

రాంబిల్లి : పంచదార్ల వద్ద వరినాట్లు వేస్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



విశాఖపట్నం
బుధవారం 30 ఆగస్టు 2017 | 16

ఖరీఫ్‌కు ఊపిరి



మాడుగుల : పూర్తిగా నిండిన పెద్దేరు జలాశయం



అనకాపల్లిలో వరద నీటితో ఉరకలెత్తుతున్న శారదా నది

...మరిన్ని ఫొటోలు సెంటర్‌స్ప్రెడ్‌లో

ఆగస్టు చివరి వారంలో విస్తారంగా వర్షాలు

- వరి, చెరకు పంటలకు ఎంతో మేలు
- తెగుళ్ల బెడద తొలగుతుందంటున్న శాస్త్రవేత్తలు
- పూర్తిస్థాయిలో వరి సాగుకు అవకాశం
- ముమ్మరంగా వరినాట్లు
- చెరువులు, రిజర్వాయర్లకు జలకళ
- పెద్దేరు జలాశయం గేట్లు ఎత్తివేత

జిల్లా అంతటా కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌కు ఊపిరిపోశాయి. నిన్నమొన్నటి వరకు వరుణుడి కరుణ కోసం ఎదురు చూసిన రైతన్న మోముల్లో వెలుగు రేఖలు విరబూస్తున్నాయి. భారీ వర్షాలతో జలాశయాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. వరి, చెరకు, ఇతర పంటలకు ఈ వర్షాలు పలు విధాలా మేలు చేశాయని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణం లేదా అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో వరినాట్లు పడే అవకాశం వుందని భావిస్తున్నారు.

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో 128.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతంకాగా, 224.72 మిల్లీ మీర్లు కురిసింది. జూలైలో సాధారణ వర్షపాతం 197 మిల్లిమీటర్లుకాగా 117.49 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో వరి నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు వర్షం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టు నెలలో మొదటి రెండు వారాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందారు. తరువాత నుంచి వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. ఈ నెలలో సాధారణ వర్షపాతం 196.5 మిల్లీమీటర్లు కాగా సుమారు 12 మండలాల్లో సాధారణం ... మిగతా 6వ పేజీలో

రెవెన్యూకు షాక్

భూ కుంభకోణం వ్యవహారంలో మరికొందరికి నోటీసులు

- జాబితాలో ఐదుగురు తహసీల్దార్లు, ఐదుగురు వీఆర్‌వోలు
- బీటీవీ రామారావుకు మరో మూడు..
- పదిహేను రోజులలోగా వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలు
- విచారణ కొనసాగిస్తున్న సిట్
- గడువుపై ఇంకా అందని ఉత్తర్వులు



(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం) విశాఖ భూకుంభకోణం వ్యవ హారంలో ఐదుగురు తహసీల్దార్లు, ఒక డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు రిటైర్డ్ తహసీల్దార్లు, ఐదుగురు వీఆర్‌వోలకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం నోటీసులు జారీచేశారు. తమకు వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై సిట్ అధికారులు విచారణ పూర్తిచేసి కలెక్టరేట్‌కు నివేదిక అందజేస్తున్నారు. దీనిపై ... మిగతా 11వ పేజీలో

ఆర్‌డబ్ల్యూఎస్ టెండర్లు గందరగోళం

ఎమ్మెల్యే మనుషులమంటూ పలువురు కాంట్రాక్టర్ల వీరంగం

- ఇతరులు టెండర్లు వేయకుండా అడ్డుకున్న వైనం
- పోలీసులకు అధికారుల ఫిర్యాదు
- సాయుధ బందోబస్తు ఏర్పాటు
- సయోధ్యకు ఈఈ ప్రయత్నాలు విఫలం
- టెండర్లు రద్దు చేస్తున్నట్టు ప్రకటన



టెండర్లదారులతో కిటకిటలాడుతున్న పాడేరులోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం

14

మూడు కిలోల బంగారం దోపిడీ

- నగలు కొంటామంటూ మంగళగిరికి చెందిన వ్యాపారికి ఎర
- నమ్మకంగా ఫ్లాట్‌కు తీసుకువెళ్లి కత్తులు, తుపాకీతో బెదిరింపు



... మెయిన్‌లో

బాలిక కిడ్నాప్‌కు యత్నం

- సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేరిక
- పరారైన అగంతకుడు
- పోలీసులకు ఫిర్యాదు



సురక్షితంగా తిరిగొచ్చిన బాలిక

10

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

- సిబ్బంది వైద్య సేవలందించినా ఫలితం శూన్యం
- పాఠశాల నిర్లక్ష్యమే బలిగొందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు

3

నా భర్తను అప్పగించాలి

అత్త ఇంటి వద్ద ఓ మహిళ ఆందోళన





పెదరాంభద్రపురంలో అత్తవారింటి ఎదుట ఆందోళన చేస్తున్న బి.కుమారి, ఆమె కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న బి.కుమారి

పాయకరావుపేట: మండలంలోని పెదరామభద్రపురంలో ఓ మహిళ తన భర్తను అప్పగించాలని డిమాండ్ చేస్తూ అత్తవారింటి ముందు ఆందోళనకు దిగింది. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదరామభద్రపురం ఎస్సీ కాలనీకి చెందిన బొండి కుమారి అనే మహిళ మంగళవారం తన భర్తను అప్పగించాలంటూ అదేగ్రామంలోని మారిశెట్టి వెంకటేష్ తల్లిదండ్రుల ఇంటి ఎదుట బైఠాయించింది. తల్లి చిలకమ్మ, కొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ఆందోళనకు దిగింది. ఈసందర్భంగా బాధితురాలు కుమారి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆరేళ్ల క్రితం తన భర్త సత్తిబాబు చనిపోవడంతో ఇద్దరి పిల్లలతో ఉన్న తనతో మారిశెట్టి వెంకటేష్ సహజీవనం సాగిస్తున్నాడని తెలిపింది. మూడేళ్ల క్రితం కులపెద్దల సంఘంలో పెడితే తనను భార్యగా స్వీకరిస్తున్నానని వెంకటేష్ చెప్పి బాగానే చూసుకున్నాడని తెలిపింది. రెండు నెలల నుంచి అతడి తల్లిదండ్రుల మాట విని తనను వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని, ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని వాపోయింది. ఫోన్ చేస్తున్నా ఎత్తడం లేదని, స్విచ్ ఆఫ్ చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త వెంకటేష్‌ని అప్పగించాలని నెల రోజుల క్రితం పాయకరావుపేట పోలీస్‌లకు ఫిర్యాదు చేశానని చెప్పింది. అయినా ఇప్పటివరకు ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో అత్తవారింటి ఎదుట ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వాపోయింది. తన భర్తను అప్పగించేంతవరకు ఆందోళన విరమించేదిలేదని తెలిపింది. దీనిపై ఎస్ఐ వి.పత్యనారాయణను వివరణ కోరగా, కుమారి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ప్రతిపక్షం తప్పిదాలే టీడీపీని గెలిపించాయి..

డీసీసీ అధ్యక్షుడు పి.బాలరాజు



నర్సీపట్నం: నంద్యాలలో తెలుగుదేశం పార్టీ గెలుపు అందరూ ఊహించినదేనని, ప్రతిపక్ష పార్టీ తప్పిదాలతోనే అధికార పార్టీకి ఓటర్లు అండగా నిలిచారని మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షుడు పి.బాలరాజు అన్నారు. సోమవారం రాత్రి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నంద్యాల గెలుపు ద్వారా రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మరింత మెరుగైన పాలన అందిస్తారని ఆశిద్దామన్నారు. అధికార పార్టీ తరుపున ఎంఎల్‌సీగా గెలుపొందిన ఏడాదికే ఆ పార్టీని వీడిన శిల్పా చక్రపాణిరెడ్డి ప్రతిపక్ష పార్టీలో చేరిన అంశాన్ని వైసీపీ ప్రజల్లోకి సరియైన రీతిలో తీసుకు వెళ్లలేకపోయిందన్నారు. రానున్న సాధారణ ఎన్నికలకు నంద్యాల ఉప ఎన్నిక ఎట్టిపరిస్థితుల్లోనూ కొలమాణం కాబోదన్నారు. గెలుపు, ఓటమిలతో సంబంధం లేకుండా ప్రతి ఎన్నికల్లో పోటీ చేయాలన్న పంథాను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందన్నారు. అయితే నంద్యాల గెలుపు ద్వారా రాష్ట్రంలో కొన్ని వర్గాలు నష్టపోయే పరిస్థితిని తీసుకురాకుండా ముఖ్యమంత్రి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు



చోద్యంలో జరిగిన అక్రమాలపై అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

- రూ.30లక్షలు దుర్వినియోగం ● సామాజిక తనిఖీలో వెల్లడి
- వీఆర్‌పీల బంధువుల ఖాతాలకు నిధులు జమ
- కె. మల్లంపేట, చీడిగుమ్మలలో ఇంకుడు గుంతలు పేరిట స్వాహా
- మొక్కలకు గూళ్లు ఏర్పాటు చేయకుండా నిధులు హాంఫట్

గొలుగొండ: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నట్టు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. పలు గ్రామాల్లో రూ.30లక్షలు దుర్వినియోగం అయినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఈ వివరాలను మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో వెల్లడించారు. మండలంలో 2016 ఆగస్టు 1వ తేదీ నుంచి 2017 జూన్ 30వ తేదీ వరకు రూ.11కోట్ల 33లక్షతో వివిధ రకాలైన పనులను చేశారు. గత పదిరోజులుగా సామాజిక తనిఖీ బృందం మండలంలో ఆ పనులను తనిఖీ చేసింది. మంగళవారం మండలపరిషత్ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ఎస్ఆర్‌పీ సూర్యనారాయణ, సామాజిక తనిఖీ ఏవో సుధాకరరావు, ఉపాధి విజిలెన్స్ అధికారి చంద్రకళ, ఎంపీడీఒ ఎంవీ సువర్ణరాజు, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు. సామాజిక తనిఖీ నివేదికను సీఆర్‌పీ, డీఆర్‌పీలు పంచాయతీలవారీగా చదివి వినిపించారు. పలు గ్రామాల్లో నాడప్ వర్మీకంపోస్టు యూనిట్లు, వానపాములు రైతులు పంపిణీ చేయకుండా నిధులు స్వాహా అయినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. ఈ మొత్తం ఎంపీడీఒ ఖాతాలోనే జమ అయినట్టు గుర్తించారు. చీడిగుమ్మల, లింగంపేట, గొలుగొండ, పాకలపాడు, చోద్యం గ్రామాల్లో వీఆర్‌పీల బంధువుల వ్యక్తిగత ఖాతాలకు నిధులు జమ అయినట్టు గుర్తించారు. అలాగే ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు అసంపూర్తిగా వదిలివేశారని, వీటి నిధులు స్వాహా అయినట్టు సామాజిక బృందం గుర్తించింది. అలాగే చేపట్టిన అభివృద్ధి పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయకుండా సుమారు రూ.పది లక్షలు దుర్వినియోగమయ్యాయని వెల్లడైంది. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏవో తెలిపారు. ఎంపీడీవో ఖాతాలో సుమారు పది లక్షలు జమ అయిన మాట వాస్తవమేనన్నారు. మార్చి నెల 31వ తేదీలోగా పనులు పూర్తి కాకుంటే నిధులు మురిగిపోతాయనే ఉద్దేశంతోనే మండల పరిషత్ అత్యవసర ఖాతాకు నిధులు జమ చేశామని తెలిపారు.



హాజరైన ప్రజలు

నత్తనడకన తీరంలో పనులు

- ఫెసిలిటీస్ సెంటర్ల పనుల్లో జాప్యం
- కష్టాలు పడుతున్న మత్స్యకారులు
- కనీస సౌకర్యాలు లేక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



తీరంలో ఎండలోనే వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు



రాజానగరం తీరంలో రెండేళ్లుగా పూర్తికాని ఫెసిలిటీస్ సెంటర్

పాయకరావుపేట: పాయకరావుపేట నియోజకవర్గంలో మత్స్యకారులకు సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. మత్స్యకారులు చేపలు ఎండబెట్టుకునేందుకు సిమెంట్ ఫ్లాట్‌ఫారాలు, వలలు మరమ్మతులు, మోటార్లు భద్రపరుచుకునేందుకు ఉద్దేశించిన సోరో బేసడ్ ఫెసిలిటీస్ సెంటర్ల నిర్మాణాల్లో తీవ్రజాప్యం జరుగుతున్నది. దీంతో జాలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఆర్ఐడీఎఫ్) కింద పాయకరావుపేట మండలంలో కొర్లయ్యపేట, రాజానగరం, వెంకటనగరం, పెంటకోట, నక్కపల్లి మండలంలో బంగారయ్యపేట, రాజియ్యపేట, ఎస్.రాయవరం మండలంలో రేవుపోలవరంలో ఒక్కొక్క ఫెసిలిటీస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఒక్కొక్క సెంటర్‌కు రూ.40 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఒక్కో సెంటర్‌లో మత్సకారులు వలలు అల్లుకునేందుకు పెద్ద హాలు, వలలు, మోటార్లు భద్రపరుచుకునేందుకు స్టోర్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. రేవుపోలవరంలో అదనంగా మరో రూ.70 లక్షలతో ఆక్షన్ హాల్, చేపలు ఎండబెట్టుకునేందుకు ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నారు. అదేవిధంగా మత్స్యకారులు సముద్రానికి చేరుకునేందుకు సీసీ రోడ్లు కూడా ఏర్పాటుచేస్తారు. అయితే రెండేళ్ల క్రితం చేపట్టిన పనులు ఏడాది క్రితమే పూర్తి కావలసి ఉండగా, ఇప్పటికీ 50శాతం కూడా పనులు పూర్తి కాలేదు. వెంకటనగరం తీరంలో ఏర్పాటు చేయాల్సిన సోరో బేసడ్ ఫెసిలిటీస్ సెంటర్ స్థల వివాదం కారణంగా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీనిపై మత్స్యకారులు పెదవివిరుస్తున్నారు. చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్న తమను పట్టించుకున్నవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు సమకూరక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తీరప్రాంతానికి సరైన రోడ్లు, వీధి దీపాలు లేక పాములతో భయపడుతూ తెల్లవారుజామున తీరానికి చేరుకుంటున్నమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

షెడ్లుల్లేక ఇబ్బందులు



తీరంలో షెడ్డులేక ఇసుక తిన్నెలపై ఎండలోనే వలలను సరిచేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నాం. చేపలు ఎండ బెట్టుకునేందుకు ఫ్లాట్‌ఫారాలు లేవు. ప్రభుత్వం మంజూరు చేసిన ఫెసిలిటీస్ సెంటర్‌ను వెంటనే పూర్తిచేయాలి.

నాయుడు కొండయ్య, రాజానగరం

వలలు, మోటార్లు నష్టపోతున్నాం..



తీరంలో ఏర్పాటుచేసుకున్న పాకల్లో దాచుకుంటున్న వలలు, మోటార్లు దొంగలు పట్టుకుపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. తీరప్రాంతంలో చేపట్టిన ఫెసిలిటీస్ సెంటర్‌ను వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

ఎన్.అప్పలరాజు, రాజానగరం

ఫెసిలిటీస్ సెంటర్ పనులు చేపట్టలేదు...



వెంకటనగరం తీరంలో ఫెసిలిటీస్ సెంటర్ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేసినా రెవెన్యూ ఎన్ఓసీ ఇవ్వక పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. మరికొద్ది ఇలానే కొనసాగితే నిధులు వెనక్కి మరలిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా తహసీల్దారు ఎన్ఓసీ జారీ చేయాలి.

చోడిపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్, వెంకటనగరం

వైద్య సిబ్బంది సాహసం.. తల్లీబిడ్డ క్షేమం!

• ప్రసవ వేదనతో బాధపడుతూ యు. చీడిపాలెం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణి • ప్రసవానికి ఆరోగ్యం సహకరించక నరకయాతన

• వై.రామవరం ఆస్పత్రికి తరలించాలని సిబ్బంది నిర్ణయం • ప్రాణాలకు తెగించి వాగును దాటించడంతో తప్పిన గండం

కొయ్యూరు : ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ గర్భిణికి యు.చీడిపాలెం పీహెచ్‌సీ సిబ్బంది సాహసోపేతమైన నిర్ణయం ద్వారా ప్రాణం నిలిపారు. ఫలితంగా తల్లీబిడ్డ నేడు క్షమంగా ఉన్నారు.

మండలంలో తూర్పు గోదావరి జిల్లా సరిహద్దులో గల మఠం భీమవరం గ్రామానికి చెందిన కాళ్ళ రాజామణి నిండు గర్భిణి. ప్రసవానికి యు. చీడిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం కుటుంబీకులు తరలించారు. ప్రసవ మయ్యేందుకు ఆమెకు తగిన శారీరక మార్పులు కలగకపోవడంతో ప్రసవం కష్టమైంది. అయినప్పటికీ సిబ్బంది తమ ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోయింది. దీంతో తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తే గానీ ప్రసవం అయ్యేలా లేదని నిర్ధారణకు వచ్చారు. వెనువెంటనే అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయగా, యు.చీడిపాలెం దాటాక వీరవరం సమీపంలో రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తున్న బండిగెడ్డ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగి ప్రవహిస్తోంది. రాజామణికి మెరుగైన వైద్యం అందాలంటే ఈ గెడ్డ దాటక తప్పని పరిస్థితి. కానీ వాగు ప్రవాహ ఉధృతి చూస్తే దాటేందుకు అవకాశం కనిపించడం లేదు. అలాగని జాప్యం చేస్తే తల్లీబిడ్డ ప్రాణాలకే ముప్పు. ఈ పరిస్థితుల్లో ఆందోళనకు గురైన ఏఎన్ఎం సుశీల, ఫార్మసిస్టు రామకృష్ణ, అంబులెన్సు డ్రైవర్ సురేంద్రలు సాహసించారు. ఆ గర్భిణిని చేతులతో ఎత్తి పట్టుకుని ప్రాణాలకు తెగించి బండివాగును దాటించారు. అనంతరం వై. రామవరం ఆస్పత్రికి తరలించగా, మంగళవారం మధ్యాహ్నం ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది సాహసం వల్లే తమ బిడ్డ తమకు దక్కిందని ఆమె కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మఠంభీమవరం, యు.చీడిపాలెం సర్పంచ్‌లు అబ్బాయిరెడ్డి, చంద్రకళలు పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశంసలతో ముంచెత్తారు.

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

◆ సిబ్బంది వైద్య సేవలందించినా ఫలితం శూన్యం ◆ పాఠశాల నిర్లక్ష్యమే బలిగొందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు

జి.మాడుగుల : మండలంలోని గెమ్మెలి బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గెమ్మెలి బాలరాజు (12) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. వంజరి పంచాయతీ పరిధి వెన్నెల కోటకు చెందిన బాలరాజు ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండడంతో పాఠశాల సిబ్బంది వైద్య సేవలం దించారు.

అయినప్పటికీ అరోగ్యం మెరుగు పడకపోవడంతో పాఠశాల సిబ్బంది ఆ బాలుడ్ని స్వగ్రామానికి తరలించారు. దీంతో సోమవారం రాత్రి ఆయన పరిస్థితి విషమంగా మారడంతో తల్లిదండ్రులు 108 సమాచారం అందించారు. ఆ వాహనం గ్రామానికి చేరుకునేటప్పటికే మృతిచెందాడు. అనారోగ్యానికి గురైనా ఆశ్రమ పాఠశాలలో సరైన వైద్యసేవలు అందించలేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఆరోగ్య పరిస్థితి విషమించి ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

▪ హెల్త్ వలంటీర్ తొలగింపు, పీఈటీకి చార్జి మెమో ▪ గిరి విద్యార్థి మృతికి కారకులపై పీవో కొరడా



పాడేరు : జి.మాడుగుల మండలం గెమ్మెలి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థి గెమ్మెలి బాలరాజు మృతికి బాధ్యులపై పాడేరు ఐటీడీఏ పీవో రవిపట్టన్ శెట్టి కొరడా ఝుళిపించారు. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం యు.రాజారావు, డిప్యూటీ వార్డెన్ ఎల్.సత్యనారాయణపాత్రుడులను సస్పెండ్ చేశారు. అలాగే పాఠశాలలో హెల్త్ వలంటీర్‌గా పని చేస్తున్న సింహాచలాన్ని విధుల నుంచి తొలగిస్తూ, పీఈటీ సూరిబాబుకు చార్జి మెమో ఇచ్చారు. విద్యార్థి బాలరాజు అనారోగ్యానికి గురైతే ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన ఉపాధ్యాయులు అందుకు భిన్నంగా విద్యార్థి స్వగ్రామం వెన్నెలకోట పంపివేయడంపై పీవో సీరియస్ అయ్యారు. విద్యార్థిని ఆశ్రమ పాఠశాలలో ఉంచి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తే ప్రాణాపాయం తప్పేదని అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో విద్యార్థి మృతిపై స్థానిక ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావుతో విచారణ జరిపించారు.

విద్యార్థి మృతికి ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉందని నిర్ధారణ కావడంతో పీవో వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఇకపై విద్యార్థుల ఆరోగ్యంపట్ల అంతా జాగ్రతతో వ్యవహరించాలని సూచించారు.

నేడు పరిశోధన స్థానంలో 'సంకల్ప సే సిద్ధి'

అనకాపల్లి అగ్రికల్చర్ : వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం జరిగే సంకల్ప సే సిద్ధి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావాలని ఏడీఆర్ డాక్టర్ ఎన్.వేణుగోపాలరావు, కొండెంపూడి కేవీకే సమన్వయాధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నవభారత నిర్మాణం కోసం పాటు పడతామని ప్రతినబూనడం, ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధికారుల ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఏఎన్‌ఎల్ స్థానే ఆర్టీసీ పార్శిల్ రవాణా



విశాఖపట్నం : ఆర్టీసీ, ఏఎన్‌ఎల్ సంయుక్తంగా నిర్వహించే పార్శిల్ రవాణా సేవలు ఇక నుంచి ఆర్టీసీ సొంతమయ్యాయి. ఆర్టీసీతో ఏఎన్‌ఎల్ పార్సిల్ రవాణా సంస్థకు కుదిరిన ఒప్పందం గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో ఏఎన్‌ఎల్ సంస్థ పార్శిల్ రవాణా సేవల నుంచి వైదొలగింది. ఆర్టీసీ సొంతంగా పార్శిల్ రవాణా చేసుకుంటుంది. ఇప్పటి వరకు విశాఖ రీజియన్‌లోని ఆర్టీసీ కాంప్లెక్సుల్లోను, ఆర్టీసీ ఆస్తుల్లోను ఉన్న ఏఎన్‌ఎల్ రవాణా సంస్థ కార్యాలయాలను ఆర్టీసీ తన స్వాధీనంలోకి తెచ్చుకున్నది. ఇప్పటి వరకు ఎఎన్‌ఎల్ సంస్థ ఆర్టీసీ ద్వారకాబస్ స్టేషన్, మద్దిలపాలెం, ఎంవీపీకాలనీ, నర్సీపట్నం, అనకాపల్లి, పాడేరు, గాజువాక, అరకు, అడ్డురోడ్డు, ఎలమంచిలి కాంప్లెక్సుల్లో పార్శిల్ రవాణా కేంద్రాలు నిర్వహించేది. వీటన్నింటినీ ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం స్వాధీనంలోకి తెచ్చుకుంది. ఏఎన్‌ఎల్ పార్శిల్ రవాణా బోర్డులను తొలగించి వాటి స్థానే ఆర్టీసీ పార్శిల్ రవాణా కేంద్రం బోర్డులు ఏర్పాటు చేసింది. ఇవన్నీ సోమవారం ఉదయం నుంచే ఆర్టీసీ విశాఖ రీజియన్ కమర్షియల్ విభాగం పరిధిలోకి వచ్చాయి. పార్శిళ్ల రవాణాకు అవసరమైన కార్గో సర్వీసులు, ట్రక్కులు ఇప్పటికే ఆర్టీసీ విశాఖ రీజియన్ కమర్షియల్ విభాగం సమకూర్చుకున్నట్టు ఆ విభాగం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఆశ్రమాల్లో గిరిజన సంక్షేమ డీడీ తనిఖీలు

విద్యార్థుల సంఖ్య తక్కువపై ఆగ్రహం ● త్వరలో నీటి పథకాలు ఏర్పాటు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయ్‌కుమార్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు, బాలికల పాఠశాలల 1,2 లను సందర్శించారు. పాఠశాలలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. అయితే ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడంపై హెచ్‌ఎం, వార్డెన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల -1పాఠవాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి భవనాలను పరిశీలించారు. అలాగే తరగతి గదిలో వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అలాగే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఎలా చేస్తున్నారని ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు. రానున్న పరీక్షలకు విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు కోసం అస్తవ్యస్తంగా మంచాలు ఏర్పాటు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో 103 మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించమన్నారు. అసంపూర్తి భవనాలు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. తాగునీటి పథకాలు పూర్తయిన విద్యుత్ సరఫరా లేక పని చేయని బాలికల 1,2 పాఠశాలతో పాటు లబ్బూరు, పనసపుట్టు పాఠశాలల్లో వారం రోజుల్లో అవి వినియోగంలోకి వచ్చేలా చేస్తామన్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి విద్యార్థులకు నిరంతరం సమగ్ర మూల్యాంకనం ద్వారా పరీక్షలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, గోపాలం, మాణిక్యాలరావు, పాల్గొన్నారు.


విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీడీ విజయ్‌కుమార్


మంచాలు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీడీ


చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ అందిస్తున్న వైద్యులు

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పక వేయించాలి

చిన్నారుల తల్లిదండ్రులకు వైద్యాధికారి ప్రసాద్ విజ్ఞప్తి

హుకుంపేట: చిన్నారులకు ముందస్తుగా ఎంఆర్ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని తల్లిదండ్రులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి లీలాప్రసాద్ సూచించారు. మండలంలోని దాలిగుమ్మడి, డి.చింతలవీధి, బారాపల్లి, నీలంపుట్టు, బారమోసి గ్రామాల్లో మంగళవారం.. 436 మంది చిన్నారులకు మీజిల్స్- రూబెల్లా వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న 9 నెలల నుంచి 15సంవత్సరాల లోపు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్‌లు వేయించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ వ్యాక్సిన్‌తో అనేక వ్యాధులు దూరమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహేష్, పాత్రుడు, ఏఎన్‌ఎంలు గుణమ్మ, సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిన గెడ్డలు

హుకుంపేట: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలో పలు గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా తడిగిరి, రాళ్లగెడ్డ, చీడిపుట్టు గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో చీడిపుట్టు గెడ్డను దాటుకుంటూ వెళ్లాల్సిన గెడ్డ అవతల గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే మండలంలోని పలు పంట పొలాల్లో నీటమునిగాయి. పల్లపు ప్రాంతాల్లోని పొలాలు కొట్టుకుపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ దేవుడువలసలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. సంజీవని స్వచ్ఛంద సంస్థ, పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో.. 620 మంది గిరిజన రోగులకు వైద్య సేవలు అందించారు. వీరందరికీ భీమిలికి చెందిన అనిల్ నిరుకొండ ఆస్పత్రి నిర్వాహకుడు కుమార్ నేతృత్వంలో 15 మంది వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం 39 మంది గిరిజనులను విశాఖపట్నం తరలించారని సంజీవిని సంస్థ కార్యదర్శి పి.దేవుళ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొవ్వా సర్పంచ్ పొట్టంగి ప్రసాద్, ఎంపీటీసీ డేవిడ్, సొవ్వా కూరగాయల రైతు సంఘం అధ్యక్షుడు పాంగి కామరాజు కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

పెదబయలు: మండలంలోని సీతగుంట ఎంపీపీ పాఠశాలలో ఎనిమిది సంవత్సవాలు పని చేసిన వెత్తన్న శెట్టి ఉమామహేశ్వరరావు జంగంపుట్టు పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఆ పాఠశాల హెచ్‌ఎం మాధవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్మించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో సింహాచలం మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు సేవలను ప్రశంసించారు. గ్రామస్థులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ఐటీడీఏ ధ్యేయం

రూ.2.2 కోట్లతో పండ్లు, పూల తోటల సాగు

పాడేరు ఉద్యానశాఖ అధికారి జి.ప్రభాకరరావు

అరకుఅర్బన్, ఆగస్టు 29: గిరి రైతులను ఆర్థికాభివృద్ధి వైపు పయనింపజేయడమే ఐటీడీఏ ధ్యేయమని.. పాడేరు ఉద్యానశాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు అన్నారు. ఇందులో భాగంగా రూ.2.2 కోట్ల నిధులు వ్యయం చేసి 300 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం, 100 ఎకరాల్లో పూల తోటల సాగు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మండలంలోని చొంపి పంచాయతీ కొత్తవలస ఉద్యానవనంలో మూడు మండలాల రైతులకు ఉద్యాన, పూలసాగుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 300 ఎకరాల్లో బిందు సేద్యంతోనే ఉద్యాన పంటలు, పూలతోటల సాగు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అంతే కాకుండా రైతులకు ఉద్యాన పంటలతో పాటు అంతర పంటలు కూడా సాగు చేసేందుకు ప్రణాళికలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గిరి రైతులకు ఎప్రికట్, పియర్, స్ట్రాబెరీ, డ్రాగాన్‌ఫ్రూట్, జాఫ్ర, ఫైన్ ఆపిల్‌వంటిని పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిలో ఒక్కో రైతుకు స్ట్రాబెరీ 2 వేల మొక్కలు, డ్రాగన్‌ఫ్రూట్ 100 పంపిణీ చేస్తామన్నారు. ఇందులో అంతర పంటగా బ్రకోలి, రెడ్ క్యాబేజీ, తదితర విత్తనాలు అందిస్తామన్నారు. అలాగే ఈ పంటలు సాగు చేస్తున్న గిరిజనులకు ఆయిల్ ఇంజన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఏవో సింహాచలం, హెచ్‌వో దిలీప్‌కుమార్, సిబ్బంది విఘ్నేష్, పాంగి కోగేశ్వరరావు, రామానాయుడు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి ప్రభాకర్‌రావు

మరుగుదొడ్ల బిల్లులు చెల్లించాలి

పెదబయలు మండల వాసుల విజ్ఞప్తి

పెదబయలు: మండలంలోని సీతగుంట, సీకరి, అరడకోట పంచాయతీలకు చెందిన గిరిజనులు తాము నిర్మించుకున్న మరుగుదొడ్లుకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని కోరారు. మంగళవారం మరుగుదొడ్ల లబ్ధిదారులు విలేకరులతో మాట్లాడుతూ, 2015-16 సంవత్సరంలో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి ప్రోత్సాహక నిధులు చెల్లిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి విడతల వారీగా బిల్లులు చెల్లిస్తామని సంబంధిత అధికారులు చెప్పడంతో నిర్మాణాలను ప్రారంభాంచామని, అయితే పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టినా నేటికీ పూర్తిస్థాయి బిల్లులు చెల్లించలేదన్నారు. మొదటి విడతగా సీతగుంటలో 200, అరడకోటలో 151, సీకరిలో 180 చొప్పున మంజూరయ్యాయి. వాటిని వివిధ దశల్లో నిర్మించుకున్నామని లబ్ధిదారులు అన్నారు. కానీ బిల్లులు చెల్లించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్ల బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సాక్షర భారత్ కేంద్రాలపై దృష్టిసారిస్తాం

ఇన్‌చార్జ్ ఎంపీడీవో మీనాకుమారి

డుంబ్రిగుడ: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉన్న సాక్షరభారత్ కేంద్రాల నిర్వహణపై.. పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వయోజన విద్యకు తోడ్పాటునిస్తున్న సాక్షర భారత్ కేంద్రాలు మండల ఎంసీలతో సాక్షర భారత్ కోఆర్డినేటర్ పర్యవేక్షణ ఉండాలన్నారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో మండలంలో ఉన్న సాక్షరభారత్ కేంద్రాలు ఎక్కడా కూడా సక్రమంగా పనిచేయడం లేదని ఫిర్యాదులు అందాయని అన్నారు. దీనిపై దృష్టి కేంద్రీకరించి నిర్వహణను మెరుగుపరుస్తామన్నారు.

డుంబ్రిగుడ పీహెచ్‌సీకి రోగుల తాకిడి


రక్త నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీలో రోగుల తాకిడితో ఆస్పత్రి మంగళవారం నిండిపోయింది. గడచిన పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గిరిజనులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీంతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చి వైద్య సేవలు పొందేందుకు క్యూ కడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు గ్రామాల్లో ఎక్కడి కక్కడ పారిశుధ్యం అధ్వానంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో దోమలు, ఈగలు ముసురుతుండడంతో గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు. అనారోగ్యానికి గురైన కొంత మంది గిరిజనులు గ్రామాల్లోనే ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది మాత్రం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి చేరుకుని వైద్యసేవలు పొందగలుగుతున్నారు. ఇక్కడ వైద్యసిబ్బంది అవసరమైన వారికి రక్త పరీక్షలు చేస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి శాంతికిరణ్ శెట్టి తెలిపారు. మరింత మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారికి అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

ముంచంగిపుట్టు: హామీలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద వైఖరిని అవలంభిస్తున్నాయని సీపీఎం జిల్లా నాయకులు పి.శాస్త్రిబాబు అన్నారు. ఇదే అంశమై మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు మంగళవారం ఆందోళన చేశారు. స్థానిక కళ్యాణ మండపం నుంచి ర్యాలీగా బయలు దేరి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రమణ కు నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.త్రినాథ్, వనుగుమ్మ సర్పంచ్ ఎస్.దొన్నో, సీపీఎం నాయకులు నారాయణ, రాజుబాబు, లైకోన్, భీమరాజు, రామదాసు, ప్రభాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

ఉపాధ్యాయులకు ఎంఈవో రామచంద్రరావు హెచ్చరిక

హుకుంపేట, ఆగస్టు 29: ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించకపోతే కఠిన చర్యలు తప్పవని.. మండల విద్యాశాఖాధికారి ఎస్.రామచంద్రరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యార్థుల వివరాలు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల సమస్యలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించి విద్యార్థులకు నైపుణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. నూతనంగా పాఠశాలల్లో చేర్పించుకున్న విద్యార్థుల ఆధార్ నమోదు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా నిర్వహించాలని, గుడ్లు మెనూ ప్రకారం అందజేయాలన్నారు. 'విందాం నేర్చుకుందాం' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రతీ రోజూ రేడియో ద్వారా పాటలు వినిపించాలన్నారు. పాఠశాల భవనాలు, మౌలిక సదుపాయాలు, వంటషెడ్ల సమస్యలు ఉంటే ఫోటోలతో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అదే విధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు



ఇన్‌చార్జ్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

'ఉపాధి బకాయి చెల్లించాలి'

డుంబ్రిగుడ: మండలంలోని సుమారు రూ.3 కోట్లు వరకు ఉపాధి హామీ బకాయిలు ఉన్నాయని గిరిజన సంఘం వెల్లడించింది. ఈ బకాయిలను తక్షణమే ఉపాధి కూలీలకు చెల్లించాలని సంఘం రాష్ట్ర నాయకుడు కె.సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని గిరిజనులతో మంగళవారం.. భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బైటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజనుల చేత పనులు చేయించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు బకాయి బిల్లులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో మీనాకుమారి, ఉపాధి హామి పథకం ఏపీవో జగదీష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.దయానిధి, పోతురాజు, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

అనంతగిరి, ఆగస్టు 29: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గల సీపీఎం కార్యాలయంలో వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 14 ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలకు మంచినీటి సౌకర్యం లేదన్నారు. అలాగే ఆటస్థలాలు కూడా లేవన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు మంత్రులు, అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు, కల్యాణ్, బుజ్జిబాబు, మధు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం





ముంచంగిపుట్టులో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, పెదబయలులో చిన్నారుల నృత్యం

పెదబయలు, ఆగస్టు 29: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల-1లో మృతభాష దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఎస్. ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవానీ, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, తెలుగుభాషలో అందరూ మాట్లాడాలని, తెలుగు చదవాలన్నారు.

తెలుగు భాషకు వెలుగులద్దుద్దాం.. ప్రపంచాన్ని చాటి చెప్పుదామంటూ నినాదించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు పలు పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. అందర్నీ ఈ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.కొండయ్య, ఎంఈవో సింహాచలం, ఏటీడబ్ల్యువో శాంతికుమారి, హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు కె.సత్యవతి, రాజేశ్వరి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో తెలుగు భాషా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగురామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాణిక్యాలరావు మాట్లాడుతూ, ఎందరో కవులు తెలుగు భాషా ఔనత్యాన్ని కీర్తించారన్నారు. ప్రతీ ఒక్కరూ తెలుగు భాషాపై పట్టును సాధించాలని, పద్యాలను పఠించాలని అన్నారు. అలాగే మండలంలో పలు పాఠశాలల్లో సైతం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాచలం, చక్రధర్, భీమనపడాల్, సురేష్, నారాయణ, సత్యారావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం

మూడు నుంచి ప్రారంభం ● జడ్పీ ఉపాధ్యక్షుడు అప్పారావు



మాట్లాడుతున్న కొట్యాడఅప్పారావు

అనంతగిరి: మండల కేంద్రంలో తెలుగుదేశం కార్యకర్తలతో జడ్పీ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ మూడో తేదీ నుంచి 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం గిరిజనులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 60 రోజులు పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో 24 పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటించేందుకు షెడ్యూలు తయారు చేస్తున్నామన్నారు. ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా తయారు కావాలని, కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, ఆనంద్ జోగులు, దొన్ను పాల్గొన్నారు.

పీహెచ్‌సీ రోగులకు భోజనం పెట్టాలి

డుంబ్రిగుడ: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఉచిత భోజన సౌకర్యాన్ని పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో అందించాలని గిరిజన సంఘం డిమాండ్ చేస్తోంది. గిరిజన సంఘం మండల కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత భోజన సౌకర్యాన్ని మంగళవారం కల్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు సభ్యుడు సింహాద్రి మాట్లాడుతూ.. కనీసం సీహెచ్‌సీలకు వచ్చే రోగులకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

డాన్స్ విజేత నటరాజ్ గ్రూప్

ముంచంగిపుట్టు: వినాయక చవితిని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి డాన్స్ బేబీ డాన్స్ పోటీలను సోమవారం రాత్రి నిర్వహించారు. గిరిజన సంస్కృతికి అద్దం పట్టే డాన్సులతో పాటు డీజే స్టెప్పులు వంటివి విశేషంగా అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో జోలాపుట్టు నటరాజ్ గ్రూప్ టైటిల్ విజేతగా నిలిచింది.

గోస్తనిలో మత్స్యవేట

అనంతగిరిలో గడిచిన వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోస్తనీ గెడ్డలో తాడిపూడి జలాశయం నుంచి చేపలు పైకి ఎదురీతకు రావడంతో వాటిని పట్టుకునేందుకు గిరిజనులు నిమగ్నమయ్యారు. జీలుగులుపాడు, దాసరి తోట, కాశీపట్నం, తుమ్మనువలస, సారవానిపాలెం, పల్లంవలస, లువ్వ వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చేపల వేట సాగుతోంది.

- అనంతగిరిరూరల్



పౌష్టికాహార వారోత్సవాలు తప్పసరి

సీడీపీవో లలితకుమారి

ముంచంగిపుట్టు: పౌష్టికాహార వారోత్సవాలను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పని సరిగా నిర్వహించాలని సీడీపీవో వి.లలితకుమారి అన్నారు. మంగళవారం అంగన్‌వాడీలకు పౌష్టికాహార వారోత్సవల నిర్వహణ, అవగాహనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పౌష్టికాహార వారోత్సవాలను ప్రతీ అంగన్‌వాడీల్లో తప్పని సరిగా నిర్వహించాలన్నారు.


చోడవరం: గౌరీపట్నం వద్ద నీటమునిగిన చెరకు, వరి పొలాలు


రాంబిల్లి: రాజాల వద్ద నీటి మునిగిన వరినాట్లు


కె.కోటపాడు: గుల్లేపల్లిలో నీట మునిగిన చెరకు తోట

కరువుతీరా వాన

పాడేరు: మన్యంలో కొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. మన్యంలో ముంచంగిపుట్టు మండలంలో అత్యధికంగా వర్షం కురిసింది. జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల మీదుగా ప్రవహించే మత్స్యగెడ్డ నిండు కుండను తలపిస్తున్నది. పాడేరుకు శివారున ఉన్న బుంగగెడ్డ ఉధృతగా ప్రవహించడంతో, విశాఖ వెళ్లే రోడ్డులో వంతెన నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో నిర్మించిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. రాయిగెడ్డకు సమీపంలోని మత్స్యగెడ్డ ఉదృతంగా ప్రవహించడంతో ఇరడాపల్లి, గొండెలి, కించూరు పంచాయతీలకు చెందిన సుమారు 20 గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లి మండలంలో కుడుముసారె గెడ్డ ఉదృతంగా ప్రవహించడంతో కుడుముసారె, బలపం పంచాయతీలకు చెందిన 20 పల్లెలకు రాకపోకలకు స్తంభించిపోయాయి. పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాల్లో మత్స్యగెడ్డ నిండుగా ప్రవహిస్తున్నది. మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ, గెడ్డల్లో వరద ఉధృతి కొనసాగుతూనే వుంది. ఈ వర్షాలు ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు చేశాయని గిరిజన రైతులు చెబుతున్నారు.

ముంచంగిపుట్టులో అత్యధిక వర్షం

ఏజెన్సీలో మంగళవారం ఉదయంతో ముగిసిన 24 గంటల్లో ముంచంగిపుట్టు మండలంలో అత్యధిక వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం తరువాత వర్షం పడలేదు. మండలాల వారీగా వర్షంపాతం వివరాలను పరిశీలిస్తే... ముంచంగిపుట్టు 127.8 మిల్లీమీటర్లు, జీకేవీధి 79.2, కొయ్యూరు 60.2, జి.మాడుగుల 59.4, పాడేరు 55.2, చింతపల్లి 47.6, అనంతగిరి 45.6, పెదబయలు 30.8, డుంబ్రిగుడ 20.2, అరకులోయ 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెరగనున్న వరి విస్తీర్ణం

నర్సీపట్నం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో వరి విస్తీర్ణం పెరగనుంది. రిజర్వాయర్‌లు, చెరువుల కింద కొంత మేర వరినాట్లు జరిగినప్పటికీ వర్షాధార ప్రాంతాల్లో ప్రస్తుతం వరినాట్లు జోరందుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీగా, మరికొన్ని ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు పడుతుండడంతో పంటలకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు. జలాశయాలు, చెరువుల్లో నీటి మట్టాలు బాగా పెరిగాయి. సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున నర్సీపట్నం పరిసర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడలేదు. మళ్లీ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో కొద్దిపాటి వర్షం కురిసింది.

చోడవరం ప్రాంతంలో తగ్గిన వర్షం

చోడవరం: గత నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలతో అతలాకుతలమైన చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలు మంగళవారం ఒకింత ఊరట చెందాయి. మంగళవారం అన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. చోడవరంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు వర్షం పడింది. 23.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో కూడా మోస్తరుగా వర్షాలు పడ్డాయి. మధ్యాహ్నం నుంచి వాతావరణం కాస్త తెరిపిచ్చింది.

అనకాపల్లిలో కుండపోత

అనకాపల్లి: అనకాపల్లి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూరగాయలు, అరటికొబ్బరికాయల మార్కెట్‌కు వేకువజామున వచ్చే రైతులు, చిల్లర వర్తకులు ఇబ్బంది పడ్డారు. బాలాజీరావుపేటలో ఒక పెంకుటిల్లు దెబ్బతిన్నది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అనకాపల్లిలో 65 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. విజయ రామరాజుపేట అండర్ బ్రిడ్జి, గవరపాలెంలోని పార్కు సెంటర్, శ్రీరామనగర్ కాలనీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. మునగపాక మండలంలో ఉరుములతో భారీ వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పొలాల్లో నీరు నిలిచి చెరువును తలపించాయి. గెడ్డలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. కశింకోట మండలంలో 78.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో కూడా భారీ వర్షం కురిసింది. ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది. గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి.

51.23 మి.మీ. వర్షపాతం

విశాఖపట్నం, ఆగస్టు 29: జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో..

మండలం	వర్షపాతం
ముంచంగిపుట్టు	127.8
పెదబయలు	30.8
హుకుంపేట	38.2
డుంబ్రిగుడ	20.2
అరకులోయ	18.4
అనంతగిరి	45.6
దేవరాపల్లి	11.4
చీడికాడ	24.8
మాడుగుల	39.9
పాడేరు	52.2
జి.మాడుగుల	55.2
చింతపల్లి	59.4
జి.కె.వీధి	47.4
కొయ్యూరు	79.4
గొలుగొండ	60.2
నాతవరం	53.2
నర్సీపట్నం	41.4
రోలుగుంట	26.2
రావికమతం	34.6
బుచ్చెయ్యపేట	31.4
చోడవరం	34.4
కె.కోటపాడు	23.8
సబ్బవరం	52.2
పెందుర్తి	46.2
ఆనందపురం	62.8
పద్మనాభం	73.4
భీమునిపట్నం	35.2
విశాఖ(అర్బన్)	82.2
విశాఖ(రూరల్)	80.0
గాజువాక	75.2
పెదగంట్యాడ	83.2
పరవాడ	70.0
అనకాపల్లి	63.4
మునగపాక	65.0
కశింకోట	88.8
మాకవరపాలెం	79.2
కోటవురట్ల	38.4
పాయకరావుపేట	37.4
అనకాపల్లి	10.8
ఎస్.రాయవరం	30.4
ఎలమంచిలి	55.8
రాంబిల్లి	50.2
అచ్యుతాపురం	68.4
సగటు	**51.23**


సాగరాన్ని తలపిస్తున్న చోడవరం లక్ష్మీపురం చెరువు


హుకుంపేట మండలం రంగశీల సమీపంలో వర్షం నీటితో నిండిన పంట పొలం

ఖరీఫ్‌కు ఊపిరి

... మొదటి పేజీ తరువాయి

కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. 15 మండలాల్లో సాధారణ వర్షపాతం, మిగిలిన మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. దాదాపు అన్ని మండలాల్లో వర్షాలు పడడంతో దమ్ము పనులు పూర్తిచేసుకొని రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఈ వర్షాలతో పంటలకు ఎంతో మేలు కులుగుతుందని చెబుతున్నారు.

పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో తాండవ, రావణాపల్లి, కళ్యాణపులోవ, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల్లోని వరద నీరు చేరుతున్నది. పెద్దేరు జలాశయం గరిష్ఠస్థాయికి చేరడంతో మూడు గేట్లను ఎత్తి, అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తాండవ జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కులు, రైవాడలోకి 567 క్యూసెక్కులు, కోనాంలోకి 394 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండడంతో ఆయా జలాశయాలు కొత్త నీటితో కళకళలాడుతున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు పడితే అన్ని జలాశయాల్లో నీటి మట్టాలు గరిష్ఠస్థాయికి చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు.

వర్షాలతో పంటలకు ఎనలేని మేలు

అనకాపల్లి అగ్రికల్చర్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు చేస్తున్నాయని, వరినాట్లు పూర్తి కూడా అవుతాయని వ్యవసాయ పరిశోధన స్థానం సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి తెలిపారు. వరినారు ముదిరిపోయి, నాట్లపై ఆశలు వదులుకున్న రైతుల్లో ఆశలు చిగురించి, ఇప్పుడు వరినాట్లు వేస్తున్నారని చెప్పారు. పొలాల్లో నీరు నిలవడంతోపాటు చెరువులలో నీరు చేరడంతో వరినాట్లకు ఢోకా లేదని అన్నారు.

చెరకు తోటలకు ఈ వర్షాలు జీవం పోశాయని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.భరతలక్ష్మి చెప్పారు. జూన్, జూలై నెలల్లో తగిన వర్షాలు పడకపోవడంతో చెరకు ఎదుగుదల మందగించిందని, ఈ వర్షాలతో తోటలు పుంజుకుని ఏపుగా పెరుగుతాయని అన్నారు.

గత రెండు నెలల్లో వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా రసం పీల్చు పురుగుల బెడద, వైరస్ తెగుళ్ల అధికమయ్యాయని, ప్రస్తుతం కుండపోతగా వర్షం కురవడం వల్ల రసం పీల్చే పురుగుల బెడద తగ్గుతుందని, వైరస్ తెగుళ్ల కూడా తగ్గుముఖం పడతాయని ఆమె చెప్పారు. వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయల పంటలకు వర్షాలు అన్ని విధాలా మేలు చేస్తాయని ఆమె పేర్కొన్నారు.

మంగళవారం ఉదయానికి వివిధ జలాశయాల్లో నీటి నిల్వలు..

జలాశయయం	నీటి నిల్వ సామర్థ్యం	ప్రస్తుతం
తాండవ	4.4 టీఎంసీలు	1.74 టీఎంసీలు
రైవాడ	2.7 టీఎంసీలు	1.5 టీఎంసీలు
కోనాం	0.8 టీఎంసీలు	0.28 టీఎంసీలు
పెద్దేరు	0.63 టీఎంసీలు	0.03 టీఎంసీలు
కళ్యాణపులోవ	0.41 టీఎంసీలు	0. 21 టీఎంసీలు

అజ్ఞాతంలో పూర్వ ఎంపీడీవో సత్యనారాయణ



పూర్వ ఎంపీడీవో గదిని తెరిచేదెలా అని చర్చిస్తున్న ఎంపీడీవో, ఎస్ఐ చంద్రశేఖర్, రిటైర్డ్ ఎంపీడీవో, జడ్పీటీసీ సభ్యురాలు నళిని

- రికార్డులు లేకపోవడంతో సెప్టెంబర్ నెల పింఛన్ల పంపిణీపై ఆందోళన చెందుతున్న అధికారులు
- కార్యాలయంలో రిటైర్డ్ ఎంపీడీవో వుండడంపై ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి పూర్వ ఎంపీడీవో రికార్డులు అప్పగించకుండగా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సెప్టెంబర్ పింఛన్ల పంపిణీపై మండల పరిషత్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు ప్రభుత్వ పథకాల అమలుకు అంతరాయం కలగకుండా వుండేందుకు గజిటెడ్ అధికారులతో పూర్వ ఎంపీడీవో వ్యక్తిగత గదిలోని రికార్డులను వెలికి తీసేందుకు మంగళవారం అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వివరాలిలావున్నాయి. గూడెంకొత్తవీధి ఎంపీడీవో సత్యనారాయణపై మండల పరిషత్ కార్యాలయానికి చెందిన ఓమహిళ ఉద్యోగి, మరో ప్రైవేటు యువతి లైంగిక వేధింపులు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. దీంతో సుమారు 20రోజుల క్రితం రికార్డులను ఈవోఆర్డీకి అప్పగించకుండా సెలవు చీటీని జడ్పీ సీఈవోకు పోస్టులో పంపించి ఎంపీడీవో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఎంపీడీవో హైకోర్టుని ఆశ్రయించి స్టే కోసం ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా ఎంపీడీవో అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో ప్రభుత్వ కార్యక్రమాలు అమలుకు అంతరాయం కలుగకుండా వుండేందుకు చింతపల్లి ఈవోపీఆర్డీ రవిరత్నకుమార్‌ని జీకే వీధి ఎంపీడీవోగా ఐదు రోజుల క్రితం జడ్పీ సీఈవో నియమించారు. ఈమేరకు రవి రత్నకుమార్ విధుల్లోకి చేరినప్పటికీ ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన రికార్డులేకపోవడంతో పలు సమస్యలను ఎదుర్కోవాల్సివస్తోంది. ఎంపీడీవో వ్యక్తిగత గదిలోనున్న పింఛన్లు,చెక్‌లు అందుబాటులోకి వస్తేనే తప్ప సెప్టెంబర్ పింఛను పంపిణీ చేయలేని పరిస్థితి ఎదురైంది. ఈవిషయాన్ని తెలుసుకున్న పూర్వ ఎంపీడీవో కుటుంబ సభ్యులు వ్యక్తిగత తాళాన్ని పదవీ విరమణ పొందిన ఎంపీడీవో గంగరాజుతో జీకేవీధి పంపించారు. మండల పరిషత్‌శాఖకు సంబంధంలేని వ్యక్తి ద్వారా పూర్వ ఎంపీడీవో వ్యక్తిగత తాళం పంపించడంతో ప్రస్తుతం విధుల్లోకి చేరిన ఎంపీడీవో రవిరత్నకుమార్ తీసుకునేందుకు అంగీకరించలేదు. పూర్వ ఎంపీడీవో గదిలో ఎటువంటి రికార్డులున్నాయో..? సంబంధిత వ్యక్తిలేకుండా గది తాళంతీస్తే రికార్డులు పోయాయని తనపై ఫిర్యాదు చేసే అవకాశముందని ప్రస్తుత ఎంపీడీవో రవిరత్నకుమార్ అంటున్నారు. సెప్టెంబర్ నెల సమీపిస్తుండడంతో పింఛన్ల ఇండెంట్ తయారుచేయడానికి అవసరమైన రికార్డు అందుబాటులో లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈవిషయాన్ని జడ్పీ సీఈవో దృష్టికి స్థానిక అధికారులు తీసుకునివెళ్లారు. సీఈవో అనుమతితో గజిటెడ్ ఉద్యోగులతో పంచనామా చేసి ఎంపీడీవో వ్యక్తిగదిని తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.



అజ్ఞాతంలోనున్న పూర్వపు ఎంపీడీవో సత్యనారాయణ



జీకేవీధి ఎంపీడీవో కార్యాలయం

పదవీ విరమణ పొందిన ఎంపీడీవో పాత్ర ఏమిటి?

ఎంపీడీవో కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఎంపీడీవో గంగరాజు వుండడంపై మండల పరిషత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అగ్రహాన్ని వ్యక్తంచేస్తున్నారు. మండల పరిషత్ శాఖకు సంబంధంలేని పదవీ విరమణ పొందిన ఎంపీడీవో గంగరాజు పాత్ర ఏమిటని, మండల పరిషత్ కార్యాలయంలో అతడు ఎందుకు వుంటున్నాడని ప్రజాప్రతినిధులు మంగళవారం మండల పరిషత్ అధికారులను నిలదీశారు. ఏది ఏమైనప్పటికీ అజ్ఞాతంలోనున్న ఎంపీడీవో బయటకొస్తేనే తప్పా ఈసమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం కనిపించడం లేదు.

ఉపాధి అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ

- విచారణ అధికారిగా ఏపీడీ లచ్చన్న
- రికార్డుల పరిశీలన

అరకులోయ: ఉపాధి హామీ పథకం కింద మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై ఐటీడీఏ పీవో రవిపట్టన్ శెట్టి స్పందించి పాడేరు ఐటీడీఏ డ్వామా అదనపు డైరెక్టర్ లచ్చన్నను విచారణ అధికారిగా నియమించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంగళవారం ఏపీడీ లచ్చన్న అరకులోయకు వచ్చి ఎంపీడీవో కార్యాలయం, ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో కలిసిన విలేకరులతో విలేకరులతో మాట్లాడారు. అరకులోయ మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు చెల్లింపుల్లో లబ్ధిదారులకు అందకుండా పక్కదోవ పట్టాయని, లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లులు ఓ నలుగురు ప్రైవేటు వ్యక్తులకు పెద్ద మొత్తాల్లో రూ.లక్షలు చెల్లింపులు జరిగాయంటూ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి స్పందించారు. తక్షణమే విచారణ జరిపి నివేదికను ఇవ్వాలని ఆదేశించడంతో మరుగుదొడ్ల బిల్లులు చెల్లింపుల అవకతవకలపై విచారణ చేపడుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఏపీడీ దొరబాబు వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించిన రికార్డులను, వివరాలను ఏపీడీకి వివరించారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వాస్తవ పరిస్థితులను గుర్తించి లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసమావేశంలో అరకులోయ మండల ఏపీడీ దొరబాబు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీడీ లచ్చన్న

చింతపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు నలుగురు శాస్త్రవేత్తల నియామకం

చింతపల్లి: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయం పరిశోధన స్థానానికి నూతనంగా నలుగురు శాస్త్రవేత్తలు నియమితులయ్యారని సహపరిశోధన సంచాలకులు డాక్టర్ జి. జోగినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరిశోధన స్థానంలో 11పోస్టులకు కేవలం ఏడీఆర్, ఒక శాస్త్రవేత్త మాత్రమే ఏడాదిగా విధుల్లో కొనసాగుతున్నారన్నారు. శాస్త్రవేత్తల కొరతను గుర్తించిన విశ్వవిద్యాలయం అధిపతులు తాజా నియామకాల్లో నలుగురుని చింతపల్లి పరిశోధన స్థానానికి కేటాయించారన్నారు. సేద్యవిభాగం శాస్త్రవేత్త ఎన్.సందీప్ నాయక్, కీటక విభాగం శాస్త్రవేత్తగా ఎన్.రమేష్ నాయక్, వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తగా సీహెచ్. అప్పారావు, భూసార విభాగం శాస్త్రవేత్తగా పి.వెంకటరమణ విధుల్లోకి చేరారన్నారు. శాస్త్రవేత్తల కొరత కాస్త తీరడంతో పరిశోధనలు మరింతగా ముందుకు తీసుకుని వెళ్లి ఆదివాసీ రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని ఏడీఆర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి లోకస్ యాప్

- యాప్‌తో సాధారణ పౌరులతో అధికారుల సమావేశాలు
- జిల్లా అధికారులు విధిగా డైన్‌లోడ్ చేసుకోవాలి
- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణ పౌరులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూపొందించిన లోకస్‌యాప్‌ను అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమై లోకస్ యాప్ వినియోగించుకొనే విధానాన్ని ఆయన వివరించారు. లోకస్ యాప్‌ను ప్రతి అధికారి విధిగా డౌన్‌లోడ్ చేసుకొని పౌరుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

లోకస్‌యాప్ ఎలా పనిచేస్తుందంటే...

- ప్రతి జిల్లా అధికారి మొబైల్ నంబరుకు లోకస్‌యాప్ అనుసంధానం చేస్తారు.
- సాధారణ పౌరులు వారి సమస్య పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసే అవసరం లేకుండా నేరుగా సంబంధిత శాఖ ఉన్నతాధికారితో సమావేశమై చర్చించుకునేందుకు ఉపకరిస్తుంది.
- సాధారణ పౌరుడు యాప్‌ద్వారా కలవాలనుకున్న జిల్లా అధికారి అపాయింట్‌మెంట్ ముందుగా పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- పౌరుల నుంచి వచ్చే వినతులకు అధికారి నేరుగా స్పందించే అవకాశం ఏర్పడుతుంది.
- ఈ యాప్‌ను వినియోగించుకునే పౌరులు జిల్లా కేంద్రానికి వచ్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.
- మీకోసం-ప్రజావాణికి, 1100కు ఫిర్యాదు చేసుకునే అవసరం ఉండదు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి పైడిరాజు

విశాఖపట్నం: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ఉపాధ్యా యుల సంఘం (ఎస్‌టీయూ) ప్రధాన కార్యదర్శి ఈ పైడిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అయన మాట్లా డుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న పెన్షన్ పీపీఎఫ్ సౌకర్యాలను ఒక్కవేటుతో రద్దుచేశారన్నారు. మన రాష్ట్రంలో 94 వేల మంది టీచర్లు, 79 వేల మంది ఉద్యోగులు సీపీఎస్‌లో ఉన్నారని తెలిపారు. సరళీకృత ఆర్థిక విధానాలు ఇలాగే కొనసాగితే 2004 ముందు నియామకాలు పొందిన ఉద్యోగులు కూడా పెన్షన్ పొందుతారన్న గ్యారంటీ లేదని వాపోయారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు సీపీఎస్ విదానం రద్దయ్యేవరకు పోరాడ తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సన్యాసిరావు, జిల్లా అధ్యక్షులు కె శామ్యూల్, ఏపీఎస్ శివాజి, జగదీష్‌బాబు, కుమార్ ఇతర ప్రతినిధులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి పైడిరాజు

విశాఖ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 29: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ మీదుగా హౌరా, బెంగళూరు, తిరువనంతపురం, కన్యాకుమారి, సంత్రాగచ్చి ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు డీసీఎం కోఆర్డినేషన్ జి.సునీల్‌కుమార్ తెలిపారు.

06516 నంబర్ గల ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 31న వేకువజాము 1.05 గంటలకు హౌరాలో బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 3.05 గంటలకు విశాఖ చేరి తిరిగి ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయలుదేరి మర్నాడు (సెప్టెంబరు ఒకటిన) రాత్రి 10.35 గంటలకు తిరువనంతపురం చేరుతుంది.

06905 నంబర్ గల రైలు గురువారం (ఈ నెల 31న) రాత్రి 11 గంటలకు కన్యాకుమారిలో బయలుదేరి సెప్టెంబర్ రెండు ఉదయం 6.15 గంటలకు విశాఖ చేరి, తిరిగి ఇక్కడ నుంచి 6.35 గంటలకు బయలుదేరి రాత్రి 9.15 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06906 నంబర్ గల రైలు సెప్టెంబర్ నాలుగో తేదీ ఉదయం 11.15 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు వేకువజాము 1.10 గంటలకు విశాఖ చేరి, తిరిగి ఇక్కడ నుంచి 1.30 గంటలకు బయలుదేరి ఆరో తేదీ ఉదయం 9.50 గంటలకు కన్యాకుమారి చేరుతుంది.

02524 నంబర్ గల ప్రత్యేక సూపరఫాస్ట్ రైలు ఈ నెల 31 ఉదయం పది గంటలకు హౌరాలో బయలుదేరి ఆ రోజు రాత్రి పది గంటలకు విజయనగరం చేరి, తిరిగి 10.10 గంటలకు బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.25 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది.

ముంచెత్తిన వాన



రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న మైనర్ శారదానది


వర్షపునీటితో నిండిపోయిన మునగపాక ప్రాథమిక పాఠశాల ఆవరణ


జి.మాడుగుల మండలం మద్దివీధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటుతున్న గిరిజనులు


పాడేరు: బుంగాగెడ్డ పొంగడంతో డైవర్షన్ రోడ్డుకు గండిపడిన దృశ్యం


మాకవరపాలెం: నారాయణరాజుపేటలో నీట మునిగిన వరి నాట్లు


చోడవరం: గౌరీపట్నం వద్ద పెద్దేరు నది ఉధృతి


మునగపాక: చెరువులా మారిన ఆవ ప్రాంత భూములు


చోడవరం: సింహాద్రిపురం వద్ద చెరకు తోటల్లో భారీగా చేరిన నీరు


కె.కోటపాడు: కె.జె.పురంలో పూర్తిగా నిండిన వెలమ వాని చెరువు


చోడవరం: గోవాడ వద్ద నిండుగా పారుతున్న శారదా నది

పాల నురగలా..

భారీ వర్షానికి గలగలపారుతున్న సింహగిరి జలధారలు

మెట్ల మార్గంలో అప్పన్న దర్శనానికి ఆసక్తి చూపిన భక్తులు



సింహాచలం, ఆగస్టు 29:
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సింహగిరిపైనున్న జలధారలు పాల నురగలా పొంగిపొర్లుతున్నాయి. సింహగిరి అందాలకు గలగలపారుతున్న జలసిరి సొగసులు మరింత వన్నె తెస్తున్నాయి. సింహాద్రి అప్పన్న ఆలయ ఈశాన్య కొండల నడుమ నుంచి ప్రవహించే పవిత్రమైన గంగధార ఎప్పటికంటే అధికమైన నీటితో జోరుగా వస్తుండడంతో మెట్ల మార్గంలోని చాకిధార, ఆకాశ ధార, హనుమంతుధార వంటి ధారలు మరింత వేగంగా ఎక్కువ నీటితో జాలువారుతుండడంతో మెట్ల మార్గంలోని భక్తులు ఆనందపారవశ్యానికి గురవుతున్నారు.

దీంతో పలువురు భక్తులు మెట్ల మార్గంలోని ధారల నీటి ప్రవాహంలో సరదాగా జలకాలాడగా... మరికొందరు మర్గమధ్యంలోని శివ లింగానికి, వినాయకునికి, ఆంజనేయునికి భక్తితో పూజలు చేస్తూ... మెట్లకు పసుపుకుంకుమలు అద్దుతూ సింహగిరికి చేరుకుని సింహాచలేశున్ని దర్శించి తరించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పలువురు భక్తులు జలధారల వద్ద సెల్ఫీలు దిగేందుకు, ప్రకృతి అందాలను కెమెరాలలో బంధించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు మెట్ల మార్గంగుండా సింహగిరికి చేరుకోవడం విశేషం.!





రెండు రోజుల్లో మూడు మీటర్లు పెరిగిన కోనాం

చీడికాడ:
గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులకు ఊరట లభించింది. కోనాం జలాశయం కొత్తనీటితో కళకళలాడుతున్నది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, మంగళవారం సాయంత్రానికి 95 మీటర్లుకు చేరుకుంది. గత ఏడాది ఇదే రోజు 99 మీటర్లు వుంది. రెండు రోజుల క్రితం 92 మీటర్లు వుండగా, ఎగువ ప్రాంతం నుంచి సుమారు 400 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి రావడంతో మూడు మీటర్లు పెరిగింది. ఔట్‌ఫ్లో 40 క్యూసెక్కులని ఏఈ ఆకుల ప్రకాష్ తెలిపారు.


కొత్తనీటితో కళకళలాడుతున్న కోనాం జలాశయం

సీలేరు జలాశయాల్లోకి 7.30 టీఎంసీల నీరు చేరిక

సీలేరు:
సీలేరు నదీ పరివాహక ప్రాంతంలో కుండపోతగా వర్షాలు కురవడంతో సీలేరు కాంప్లెక్సు పరిధిలోని నాలుగు రిజర్వాయర్లల్లో భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నదని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మోహన్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు జోలాపుట్, బలిమెల, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లోకి 7.30 టీఎంసీల వరదనీరు వచ్చి చేరిందని చెప్పారు. జోలాజోలాపుట్ పూర్తిస్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా ప్రస్తుతం 2732.7 అడుగులకు చేరిందన్నారు. బలిమెల జలాశయంలోకి మూడు టీఎంసీల నీరు చేరడంతో నీటిమట్టం 1478.7 అడుగులకు పెరిగింది. దీని పూర్తిస్థాయి నీటిమట్టం 1516 అడుగులు. గుంటవాడ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,360 అడుగులు కాగా ఒక టీఎంసీ నీరు చేరడంతో నీటిమట్టం 1354.7 అడుగులకు చేరింది. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1,037 అడుగులుకాగా, 1.5 టీఎంసీల నీరు చేరింది. దీంతో నీటిమట్టం 1,036.5 అడుగులకు పెరిగింది. దీంతో డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో 18 మెగావాట్లు, పొల్లూరులో 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నది. సీలేరులో విద్యుత్ ఉత్పత్తి చేస్తే డొంకరాయి రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతుందన్న ఉద్దేశంతో సీలేరులో ఉత్పత్తిని నిలిపివేశామని సీఈ మోహన్‌రావు తెలిపారు.


నీటితో కళకళలాడుతున్న గుంటవాడ రిజర్వాయర్

పెరుగుతున్న రైవాడ నీటిమట్టం

దేవరాపల్లి:
మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైవాడ జలాశయం నీటిమట్టం 55 సెంటీమీటర్ల మేర పెరిగింది. ఈ నెల 26న 107.80 మీటర్లు, 107.95 మీటర్లు, 28న 108.35 మీటర్లుకు చేరుకోగా మంగళవారం 108.50 మీటర్లకు పెరిగింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు. పినకోట, సమ్మెద గెడ్డల నుంచి 50 క్యూసెక్కుల వరదనీరు చేరుతున్నది. ఎడమ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, కుడికాలువ ద్వారా 25 క్యూసెక్కులు, జీవీఎంసీకి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో ఆయకట్టుకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. రైవాడ జలాశయం పరిధిలో 60 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయ్యాయి.


రైవాడ జలాశయం

నిండిన పెద్దేరు..

1000 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్ :
పరివాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పెద్దేరు జలాశయానికి వరదనీరు పోటెత్తుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.10 మీటర్లు వుంది. ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కులకుపైగా వుంది. దీంతో రాత్రి వేళల్లో జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడిచిపెడుతున్నామని ఏఈ రమేష్ తెలిపారు. ఆదివారం రాత్రి 500 క్యూసెక్కులు, సోమవారం రాత్రి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామని చెప్పారు. ఇన్‌ఫ్లో పెరగడంతో మరో వెయ్యి క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని తెలిపారు.


నిండుకుండలా పెద్దేరు జలాశయం

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన మహిళ మృతి

పాడేరురూరల్: మద్యం మత్తులో పురుగుల మందు సేవించడంతో మహిళ మృతి చెందింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హుకుంపేట మండలం చట్రాయిపుట్టు గ్రామానికి చెందిన గోమంగి బొంజునాయుడు భార్య సుచాయి(45) అనే మహిళ సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో మద్యం మత్తులో ఉండి ఇంటిలో ఉన్న సీసాలో సారా ఉందనుకొని వ్యవసాయానికి ఉపయోగించే పురుగుల మందును తాగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యాధికారి అనిల్ వైద్యసేవలు అందిస్తుండగా సుచాయి మృతి చెందింది. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. హుకుంపేట ఎస్‌ఐ నాగకార్తీక్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం



పాయకరావుపేట: పాయకరావుపేట, తుని పట్టణాల్లో చెత్త ఏరుకునే శ్రీను అనే వ్యక్తి మంగళవారం రైల్వే వంతెనపై రైలు ఢీకొని మృతిచెందాడు. ఈయన ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్ల విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో తునిలో చెత్తను ఏరుకుని పెద్ద గోనె సంచితో రైల్వే వంతెనపై వస్తుండగా అదే సమయంలో రైలు రావడాన్ని శ్రీను గమనించాడు. వెంటనే గోనె సంచితో సేఫ్టీప్లేస్‌లోకి వెళ్లిపోయాడు. అయితే గోనెసంచి రైలుకు తగులుకోవడంతో దాన్ని పట్టుకుని ఉన్న శ్రీను సంచితోపాటు వంతెన ఐరన్ స్తంభాలను బలంగా ఢీకొట్టి పడిపోయాడు. దీంతో శ్రీను తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కశింకోటరూరల్: మండలంలో సోమవారం బయ్యవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు దాసరి అచ్చియ్యమ్మ మంగళవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిందని అడిషనల్ ఎస్‌ఐ నరసింగరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

అమ్మపేట ఉపాధి వీఆర్‌పీ తొలగింపు

గొలుగొండ: విధి నిర్వహణలో అలక్ష్యం వహించిన అమ్మపేట ఉపాధి వీఆర్‌పీ బి.నాగభూషణంను తొలగించినట్టు ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు తెలిపారు. అమ్మపేటలో ఉపాధి పనులను ఇష్టానుసారం చేపట్టినట్టు గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నాగభూషణాన్ని విధుల నుంచి తొలగించినట్టు తెలిపారు.

వ్యక్తిని కొట్టిన డ్రైవర్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్: ఒక వ్యక్తిని కొట్టి గాయపరచిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ సంపతిరావు విద్యాసాగర్ తెలిపారు. ట్రాఫిక్ సీఐ వద్ద ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగు అనే వ్యక్తి ఈనెల 23వ తేదీన నెహ్రూచౌక్‌లోని ఒక మద్యం దుకాణం ముందు దాసరిగెడ్డ రోడ్‌వీధికి చెందిన లాలం సతీష్‌తో గొడవ పడి కొట్టాడన్నారు. ఈ మేరకు అదేరోజున ఫిర్యాదు అందిందని, కోర్టు అనుమతి తీసుకుని డ్రైవర్ నాగుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి

అనకాపల్లి టౌన్: తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామర్లకోట జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పీ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 27వ తేదీన 60 సంవత్సరాల పైబడిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడడంతో తీవ్రంగా గాయపడినట్టు చెప్పారు. అయితే ఇతని వద్ద అనకాపల్లి నుంచి తిరుపతికి టిక్కెట్టు లభ్యమైందని తెలిపారు. బహుశా అనకాపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా అనుమానంగా ఉందన్నారు. ఎవరైనా గుర్తించినట్లైతే సామర్లకోట జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

40 మద్యం బాటిళ్లు పట్టివేత

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలసలో 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు అనంతగిరి ఎస్‌ఐ డి.వెంకన్న తెలిపారు. కొత్తవలసలో మద్యం విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. మద్యాన్ని విక్రయిస్తున్న జి.రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

బాలిక కిడ్నాప్‌కు యత్నం

సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేరిక.. పరారైన అగంతకుడు.. పోలీసులకు ఫిర్యాదు



ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల వద్ద ఉన్న బాలిక

నర్సీపట్నం రూరల్: పట్టణంలో పట్టపగలు బాలిక కిడ్నాప్ యత్నం జరిగింది. అయితే బాలిక తిరిగి రావడంతో కథ సుఖాంతమైంది. బాలిక బంధువులు, తల్లిదండ్రులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

కోటవురట్ల మండలం చౌడువాడ గ్రామానికి చెందిన మడగల అప్పలనాయుడు, వరహాలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి పదో తరగతి చదువుతుండగా, చిన్న అమ్మాయి మల్లేశ్వరి ధనలక్ష్మి(10) ఐదో తరగతి చదువుతున్నది. కాగా, అప్పలనాయుడు దంపతులు బతుకు తెరువు కోసం విజయవాడ వెళ్లి అక్కడ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పలనాయుడుకు అనారోగ్యం చేయడంతో భార్య వరహాలమ్మ, చిన్న కుమార్తె మల్లేశ్వరితో కలిసి ఈనెల 25న చౌడువాడ వచ్చారు. ఆయన్ని పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అప్పలనాయుడిని చూడడానికి దార్లపూడిలో ఉంటున్న అత్తయ్య పిలపాల చినతల్లి మనవరాలు ధనలక్ష్మిని తీసుకుని వచ్చింది. అప్పలనాయుడును పరామర్శించి మనుమరాలిని తీసు



సురక్షితంగా తిరిగొచ్చిన బాలిక



విలపిస్తున్న తండ్రి

కుని ఇంటికి వెళ్లడానికి ఆసుపత్రి నుంచి బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ బైక్‌పై వచ్చి మాటామాటా కలిపి మీరు మాకు తెలుసు నంటూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దించుతానంటూ బాలిక, ఆమె అమ్మమ్మను ఎక్కించుకుని పెదబొడ్డేపల్లి పెట్రోల్ బంకు వద్ద ఆపాడు. చినతల్లిని నీ దగ్గర రూ.500 ఉంటే ఇవ్వు పెట్రోల్ కొట్టించి మీ ఇంటి వద్ద దించుతానంటూ నమ్మబలికాడు. అయితే నా వద్ద వంద రూపాయలు మాత్రమే ఉన్నాయని, అవి కూడా బస్సు చార్జీలకు మాత్రమే అని చెప్పడంతో ఇక్కడే ఉండు.. పెట్రోల్ కొట్టించుకుని వస్తానని చినతల్లిని దించేసి బాలికను తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో వృద్ధురాలు చినతల్లి లబోదిబోమంటూ తిరిగి వచ్చి ఆస్పత్రి వద్ద గల అల్లుడు అప్పలనాయుడు, కూతురు వరహాలమ్మకు విషయం వివరించింది. స్థానికుల సూచన మేరకు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. మోటార్‌బైక్‌పై కొంత దూరం తీసుకువెళ్లి పెట్రోల్ కొట్టించుకు వస్తానని చెప్పి బాలికను అక్కడ దించేసి ఆ వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాలిక ఏడుస్తుండడంతో స్థానికులు గుర్తించి వివరాలు తెలుసుకుని తల్లిదండ్రుల వద్దకు క్షేమంగా చేర్చారు.

128 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్: మరో ఇద్దరు పరారీ.. కారు స్వాధీనం



పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

ఎలమంచిలి: ఎలమంచిలి సమీపంలోని జాతీయ రహదారిపై షిర్ దాబా వద్ద సోమవారం కారులో 128 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ విజయ్‌నాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గంజాయి తరలిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు హైవేపై తనిఖీలు చేస్తుండగా అనకాపల్లి నుంచి వస్తున్న కారును తనిఖీ చేశామన్నారు. ఇందులో 64 బ్యాగుల్లో ఉన్న 128 కిలోల గంజాయి దొరికిందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరిని పట్టుకున్నామని, మరో ఇద్దరు పరారీ అయ్యారని తెలిపారు. చెన్నైకి చెందిన మీరన్, మురుగన్‌లను విచారించగా మరో ఇద్దరి పేర్లను తెలిపారని, వారి గురించి గాలిస్తున్నామన్నారు. పట్టుబడిన వారిలో ఎస్కే మీరన్, మురుగన్‌లు కమిషన్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నాడన్నారు. వీరిద్దరికి తమిళనాడుకు చెందిన గంజాయి స్మగ్లర్ నుంచి రూ.65 వేలు వచ్చిందని, ఇందులో రూ.55 వేలు ఇచ్చి గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుబడినట్టు సీఐ విజయ్‌నాథ్ తెలిపారు. పట్టుబడిన వీరిద్దరితోపాటు గంజాయి, కారును కోర్టుకు తరలిస్తున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో పట్టణ ఎస్‌ఐ నారాయణరావు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల కొట్లాట

స్వల్ప గాయాలు... మాడుగుల ఆస్పత్రికి తరలింపు



గాయపడిన వ్యక్తికి చికిత్స అందిస్తున్న దృశ్యం

మాడుగుల: మాడుగుల మోదమాంబ కాలనీలో మంగళవారం జరిగిన భూవివాదంలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. వివరాలిలా ఉన్నాయి.

మాడుగుల గ్రామానికి చెందిన గొరిపట్టపు నారాయణరావు, రమణ, సత్యారావు, మోదమాంబ కాలనీకి చెందిన జెర్రికాసుల కొండాజీ, షేక్ మహ్మద్‌వల్లీ, వి.అప్పారావుల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ కొట్లాటకు దారితీసింది. ఈ కొట్లాటలో ఇరువర్గాలకు చెందిన వారికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని మాడుగుల 30పడకల ఆస్పత్రికి తరలించారు. స్థలం విషయమై వీరి మధ్య గొడవ జరిగినట్టు తెలిసింది. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో ఇరువర్గాలతో పోలీసులు చర్చలు జరుపుతున్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి రెండేళ్ల జైలు, జరిమానా

చోడవరంటౌన్: మండలంలోని శ్రీరామపట్నంలో నక్కా అక్కమ్మ 2010వ సంవత్సరంలో తన స్థలంలో భూమిపూజ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కుంచా బాబ్జి, కుంచా అప్పారావు, కుంచా ఈశ్వరరావు, కుంచా గోవింద ఆమెపై దౌర్జన్యం, హత్యాయత్నం చేశారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో ఫిర్యాదుదారు తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయరాం వాదించారు. వాదోపవాదాలు విన్న అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి శివరాంప్రసాద్ మంగళవారం నిందితుడు బాబ్జికి రెండేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా, మిగిలిన ముగ్గురికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా, కట్టలేని పక్షంలో నెల రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌ఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు.

బంగ్లాదేశ్ నేవీ చీఫ్ నిజాముద్దీన్ విశాఖ సందర్శన



విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ నౌకాదళం ప్రధానాధికారి అడ్మిరల్ నిజాముద్దీన్ అహ్మద్ తన భార్య నజ్మాన్‌తో కలిసి తూర్పు నౌకాదళం సందర్శనకు విశాఖపట్నం వచ్చారు. ఆయన తన రెండు రోజుల పర్యటనలో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు, నేవీ పరమైన సహకారం, సంయుక్త సాహస విన్యాసాలపై తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ హెచ్‌సీఎస్ బిష్త్‌తో చర్చించారు. ఐఎన్ఎస్ కళింగ, శతవాహన, ఐఎన్ఎస్ కర్ణ తదితర విభాగాలను సందర్శించారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర వాతావరణం

అరకు ఏఎన్‌వై శ్రీనివాసరావు ● క్లీన్ రైల్వే స్టేషన్ నిర్వహణ

అరకులోయ, ఆగస్టు 29: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండేందుకు అవకాశం ఉంటుందని.. అరకు సెక్షన్ ఏఎన్ వై.శ్రీనివాసరావు అన్నారు. అరకు రైల్వే స్టేషన్‌లో క్లీన్ రైల్వేస్టేషన్ నినాదంతో.. ఈస్ట్‌కోస్ట్ రైల్వే అరకు సబ్ డివిజన్‌కు చెందిన అధికారులు స్టేషన్ ఆవరణలో పారిశుధ్య పనులను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే ఉన్నత స్థాయి అధికారి నుంచి దిగువ స్థాయి ఉద్యోగి వరకు, ప్రయాణికులు, పర్యాటకులు, స్థానికులు సైతం మన ప్రాంతం మన పరిసరాలు, మన రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ అని ఎవరికి వారు పని చేసే స్థలాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ప్రతీ రోజూ మోటారు ఫీల్డ్ సిబ్బంది, స్టేషన్‌లో పనిచేసే ఉద్యోగులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎప్పటికప్పుడు భాగసామ్యులు కావాలని సూచించారు.



అరకు రైల్వే స్టేషన్ ఎదుట శ్రమదానం చేస్తున్న అధికారులు

ఎంతో ప్రాచుర్యం ఉన్న అరకు రైల్వే స్టేషన్‌ను క్లీన్ రైల్వే స్టేషన్‌గా ప్రతీ రోజూ ఉండేలా అందరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అరకు సబ్ డివిజన్‌కు చెందిన డీఎన్ నాగేష్‌బాబు, ఏడీఎన్ పాండిటాం, మోటారు యూనియన్ ప్రతినిధులు, కార్మికులు, ఉద్యోగులు చీపుర్లు పట్టుకుని పారిశుధ్య పనులను చేపట్టారు.

రెవెన్యూకు షాక్

... (మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల ద్వారా శాఖాపరమైన విచారణ జరిపించి ఆ తరువాత నోటీసులు జారీచేస్తున్నారు. ఇందులో భాగంగా భీమిలి తహసీల్దార్‌గా పనిచేసి ఇప్పటికే సస్పెన్షన్‌లో వున్న బీటీవీ రామారావుకు వేర్వేరు అంశాలపై మరో మూడు నోటీసులు జారీ అయ్యాయి. అలాగే భీమిలి ఇనాం డీటీ ఈశ్వరరావుకు,

అదేవిధంగా పరవాడ తహసీల్దారు ఉమామహేశ్వరరావుకు, హుకుంపేట తహసీల్దార్ తాడి పంతులు, మరో ఇద్దరు వీఆర్‌వోలకు తాజాగా నోటీసులు జారీఅయ్యాయి. గతంలో సబ్బవరం తహసీల్దార్‌గా పనిచేసిన జగదీష్‌కు, పద్మనాభంలో పనిచేసి రిటైరైన తహసీల్దారు పి.సూర్యారావుకు కూడా నోటీసులు జారీఅయ్యాయి. పద్మనాభం తహసీల్దారు ఐకే కిరణ్‌తోపాటు భీమిలి వీఆర్‌వోలు స్వరూప్, రామారావు, ఇటీవల వరకు ఆనందపురం తహసీల్దారుగా పనిచేసిన అంబేద్కర్‌కు, అదే మండలంలో వీఆర్‌వోకు కలెక్టర్ నోటీసులు జారీచేశారు. పదిహేను రోజులలోగా వీరంతా వివరణ ఇవ్వాల్సి వుంటుంది. వివరణ సంతృప్తికరంగా లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. జిల్లాలో రెవెన్యూ శాఖలోని వివిధ హోదాలకు చెందిన 25 మందికి ఇప్పటికే భూసంబంధిత ఆరోపణలపై కలెక్టర్ నోటీసులు జారీ చేయడం, మరికొందరికి త్వరలో జారీ అయ్యే అవకాశం వుండడంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సిట్ యథావిధిగా కొనసాగింపు?

గడువు కొనసాగిస్తూ ప్రభుత్వం నుంచి మంగళవారం సాయంత్రానికి ఉత్తర్వులు అందకపోయినా ఏలేరు అతిథి గృహంలో సిట్ అధికారులు యథావిధిగా తమ విచారణ కొనసాగిస్తున్నారు. వాస్తవానికి సోమవారంతో సిట్‌కు ప్రభుత్వం విధించిన రెండు నెలల గడువు ముగిసింది. గడువు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అవుతాయని అధికారులు భావించారు. మంగళవారం సాయంత్రానికి కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందకపోయినా సిట్ ముఖ్య అధికారి వినీత్‌బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ఏలేరు అతిథిగృహంలో పలువురిని విచారించారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు యథావిధిగా సిట్ కొనసాగుతుందని అధికారులు అంటున్నారు.

గ్రేటర్‌లో 100 వార్డులు?

81 వార్డులు చాలవంటూ ప్రభుత్వానికి స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేల నివేదిక

సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

పది లక్షల వరకూ 63...ఆపై ప్రతి 20-25 వేల మంది జనాభాకు ఒకటి?

నాలుగైదు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం

కాకినాడ తర్వాత జీవీఎంసీకి ఎన్నికలు జరిపాలనే యోచనలో ప్రభుత్వం

నవంబర్ నాటికి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) వార్డుల సంఖ్య మళ్లీ పెరగబోతోందా? 81 నుంచి 100కి చేరబోతోందా? దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలైందా?...అనే ప్రశ్నలకు ప్రభుత్వంలోని పెద్దల నుంచి అవుననే సమాధానం వస్తోంది. వీలైతే నాలుగైదు రోజుల్లో దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే అవకాశం వుందని కూడా పేర్కొంటున్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల తర్వాత జీవీఎంసీ ఎన్నికలపైనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టే అవకాశం వుంది.

జీవీఎంసీకి చివరిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. తర్వాత భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీల విలీనంపై తలెత్తిన వివాదాలు ఎన్నికల నిర్వహణకు ఆటంకంగా మారాయి. ఈ ఐదున్నరేళ్ల కాలంలో అనకాపల్లి మున్సిపాలిటీ విలీనంపై వివాదాలు సమసిపోగా భీమిలికి సంబంధించి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇదిలావుండగా చాలా కాలంగా ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల చెడ్డపేరు వచ్చే అవకాశం వుందని గుర్తించిన ప్రభుత్వం జీవీఎంసీ ఎన్నికల నిర్వహణపై కొద్దిరోజుల కిందట దృష్టిసారించింది. అందులోభాగంగా విలీనానికి వ్యతిరేకంగా వున్న ఐదు గ్రామాలను మినహాయించి భీమిలి, అనకాపల్లితో కలిపి జీవీఎంసీకి వార్డుల సంఖ్యను నిర్ణయించింది.

ప్రస్తుతం వున్న 72 వార్డులకు తోడు మరో తొమ్మిది వార్డులను పెంచుతూ 81 వార్డులుగా నిర్ణయించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం గతంలో వున్న జీవీఎంసీ పరిధిలో జనాభా 17,30,320గానూ అనకాపల్లి మున్సిపాల్టీ జనాభా 86,612గానూ, భీమిలి మున్సిపాల్టీ జనాభా 54,865గానూ, అనకాపల్లికి జీవీఎంసీకి మధ్యలో వున్న ఐదు గ్రామాల జనాభా 9,889గానూ పేర్కొంది. దీనిప్రకారం కొత్తగా విలీనమైన మున్సిపాల్టీలు, గ్రామాలతో కలిపి జీవీఎంసీ జనాభాను 18,81,686గా పేర్కొంది. ఈ జనాభాలో మొదటి పది లక్షల మందికి 63 వార్డులు, మిగిలిన జనాభాలో ప్రతీ 50 వేల మందికి ఒక వార్డు చొప్పున మరో 18 వార్డులను కేటాయిస్తూ ఈనెల 16న ఉత్తర్వులు జారీచేసింది.

వార్డుల సంఖ్య సరిపోదు:

జీవీఎంసీ పరిధిలో 81 వార్డులుగా పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో ఆ సంఖ్య సరిపోదంటూ నగరానికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రి రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలో ఆశావహులు ఎక్కువగా వున్నందున మొదటి పది లక్షల మందికి 63 వార్డులు సరిపోయినా మిగిలిన జనాభాకు ప్రతీ 50 వేల మందికి ఒక వార్డు చొప్పున ఏర్పాటుచేయడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. అలాకాకుండా చివరి 8.81 లక్షల జనాభాకు 18 వార్డులు కాకుండా ప్రతీ 20 నుంచి 25 వేల మందికి ఒకటి చొప్పున వార్డులను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేశారు. అలా చేయడం వల్ల పార్టీలో ఆశావహులందరికీ అవకాశం కల్పించినట్టవడంతోపాటు ప్రజలకు అందుబాటులో కార్పొరేటర్లు వున్నట్టు అవుందని వివరించారు. దీనికి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ సంతృప్తి చెందడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కూడా దీనిపై ఇటీవల చర్చించినట్టు సమాచారం. దీనికి ముఖ్యమంత్రి కూడా సానుకూలత వ్యక్తం చేయడంతో వార్డుల సంఖ్య పెరుగుదల తథ్యమని ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా ఇటీవల ఒక సందర్భంలో ఇదే విషయాన్ని స్పష్టం చేయడంతో జీవీఎంసీ వార్డుల సంఖ్య 100కి చేరే అవకాశం ఖాయమని తేలిపోయింది. నాలుగైదు నెలల్లో దీనిపై ఉత్తర్వులు జారీచేసే అవకాశం వున్నట్టు నగరానికి చెందిన ఎమ్మెల్యేలే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇదే ఊపులో జీవీఎంసీ ఎన్నికలు:

నంద్యాల ఉప ఎన్నికల్లో ఘన విజయంతో మంచి ఊపుమీద వున్న టీడీపీ నేతలు, కాకినాడలో కూడా ఏకపక్ష విజయం తథ్యమనే ధీమాలో వున్నారు. ఇదే ఊపులో జీవీఎంసీకి కూడా ఎన్నికలు నిర్వహిస్తే జీవీఎంసీ మేయర్ పీఠాన్ని కూడా తామే కైవసం చేసుకోవచ్చునని టీడీపీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. కాకినాడ ఎన్నికలు ముగియగానే ంరాష్ట్రప్రభుత్వం జీవీఎంసీ ఎన్నికల నిర్వహణపై దృష్టిసారించే అవకాశం వుంది. ముందుగా వార్డు సంఖ్యను నిర్ధారిస్తే తర్వాత వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు, నోటిఫికేషన్ జారీ వంటివాటిని రెండు, మూడు నెలల్లో పూర్తి చేసే అవకాశం వుంది. నవంబర్ లేదా డిసెంబర్‌లో జీవీఎంసీకి ఎన్నికలు జరిగిపోవడం తథ్యమనే సంకేతాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థానం

● వీఎస్ కృష్ణా కళాశాల విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు బి.సుబ్రహ్మణ్యం

కొత్తూరు: క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉంటే ఉన్నత స్థానాన్ని సాధించవచ్చని విశాఖపట్నం వీఎస్ కృష్ణా కళాశాల విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు బి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాల సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా హాకీ పితామహుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలవాలనే క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడాకారులు ఉంటే గెలుపు సాధ్యమవుతుందన్నారు. క్రీడాకారులు అందరూ గెలవాలనే లక్ష్యంతో ఉండాలన్నారు. ఏఎంఏఎల్ కళాశాలలో 1978-81 బ్యాచ్‌లో డిగ్రి పూర్తిచేశానని, ఆ మూడేళ్లలో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో బాగా ఆడేవాడినన్నారు. ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో 64 ప్రశంసా పత్రాలు సాధించానన్నారు. క్రీడలతోపాటు విద్యపైన కూడా క్రీడాకారులు దృష్టి పెట్టాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చునన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఎంఏఎల్ కళాశాలకు మంచి కీర్తి,ప్రతిష్టలు ఉన్నాయని కళాశాలలో చదువుకోవడం ఇప్పటి విద్యార్థులకు నిజంగా ఒక వరమన్నారు. అనంతరం ముఖ్యఅతిథి సుబ్రమణ్యంను కళాశాల యాజమాన్యం పూలమాల వేసి, దుస్సాలువాతో సత్కరించింది. జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, అథెటిక్స్, షెటిల్ బ్యాట్మింటన్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు శరగడం నాగేశ్వరరావు, పూసర్ల సునీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, సూపరింటెండెంట్ పి.అనురాధ, గవర్నింగ్‌బాడీ మెంబర్లు సకల గోవింద్, ఆళ్ళ సత్య ప్రసాద్, వి.కృష్ణ కిశోర్, పీడీ కేవీఎస్ నాయుడు, అసిస్టెంట్ పీడీ వై.నాయుడు, అధ్యాపకులు బీఎంవీపీ నాయుడు, కేవీ నాగేశ్వరరావు, సుధాకర్, నూకినాయుడు, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న (ఇన్‌సెట్లో) బి.బాలసుబ్రహ్మణ్యం

ఆర్టీసీ కాంప్లెక్సుల్లో బ్రెస్ట్ ఫీడింగ్ గదులు

విశాఖపట్నం: ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని ఆరు బస్ స్టేషన్‌లలో బ్రెస్ట్ ఫీడింగ్ గదులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు నిర్ణయించారు.

ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే గదుల ఏర్పాటు పనులు ప్రారంభించి వారం రోజుల్లో పూర్తి చేస్తామని రీజనల్ మేనేజర్ జి.సుధేశ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 ఆర్టీసీ బస్‌స్టేషన్‌లలో బ్రెస్ట్ ఫీడింగ్ గదులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోందన్నారు.

‘భిన్న పరీక్ష’ నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
వివరణ: ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: **ఎ**
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: **డి**
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: **బి**
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: **ఎ**
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: **సి**
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: **డి**
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: **ఎ**
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: **ఎ**
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: **సి**
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: **డి**
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: **సి**
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: **డి**
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: **సి**
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: **డి**
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: **బి**
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: **డి**
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: **సి**
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజిల్ డి) తాన్‌సేన్
సమాధానం: **బి**
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: **బి**
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: **ఎ**
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు**: 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్

2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన నాయ్యమూర్తి

3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ

6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ

7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ

8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ

9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా

10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ

11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్

12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు

14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి

15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ

16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి

17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు

18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు

19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్


కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ

21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనపుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు

22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ

23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు

24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ

25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత

26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం

28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా

29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ

30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్
5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4

31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ

32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ఠ సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది

33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) బైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు

34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ

35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్

36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ

37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్

38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ

39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి

40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్

41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి

42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్

43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్

44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17

45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్

46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా

47. జాకీర్ హుస్సేన్ మరణాంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా

48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు

49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర

50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

సమాధానాలు

		15) ఎ	24) ఎ	33) సి	42) బి
		16) బి	25) సి	34) ఎ	43) సి
1) సి	8) బి	17) సి	26) బి	35) డి	44) బి
2) ఎ	9) సి	18) బి	27) ఎ	36) సి	45) డి
3) ఎ	10) బి	19) సి	28) డి	37) బి	46) ఎ
4) డి	11) ఎ	20) డి	29) డి	38) ఎ	47) బి
5) ఎ	12) సి	21) ఎ	30) ఎ	39) సి	48) సి
6) సి	13) సి	22) సి	31) సి	40) డి	49) ఎ
7) బి	14) డి	23) ఎ	32) బి	41) సి	50) సి

అడ్మిషన్స్

జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.

పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పిహెచ్‌డి/ ఎమ్మెస్సీ - పిహెచ్‌డి డ్యూయెల్ డిగ్రీ

టెస్ట్ పేపర్స్ - కోడ్స్: బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)

అర్హత: గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

జామ్ 2018 జరిగే తేదీ: 2018 ఫిబ్రవరి 11

ఫలితాల విడుదల: 2018 మార్చి 20

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 5

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10

వెబ్‌సైట్: www.jam.iitb.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి: ఏడాది

అర్హత: 50 శాతం మార్కులతో బిఎస్సీ/ బిఫార్మసీ/ బిఎస్సీ - అగ్రి/ ఎంబిబిఎస్/ బివిఎస్సీ/బిడిఎస్/ బిహెచ్ఎంఎస్/ బిఎఎంఎస్/ బియుఎంఎస్/ బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసిఏ/ పిహెచ్‌డి పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

ఆర్‌డబ్ల్యూఎస్ టెండర్లు గందరగోళం



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద సాయుధ పోలీసుల బందోబస్తు



అధిక టెండర్ ఫారాలతో ఓ కాంట్రాక్టర్

పాడేరు: గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) తాగునీటి పథకాల నిర్మాణానికి సంబంధించి మంగళవారం ఇక్కడ నిర్వహించిన టెండర్ల ప్రక్రియ గందరగోళం నడుమ రద్దు అయ్యింది. టెండర్లు దాఖలు చేసేందుకు వచ్చిన వారి నడుమ వివాదం నెలకొనడం, అధికార పార్టీ ఎమ్మెల్యేకి చెందిన మనుషులమంటూ కొంతమంది వీరంగం చేయడంతో చివరకు టెండర్ల ప్రక్రియను రద్దు చేయాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

ఏజెన్సీలో 83 గ్రావెటీ నీటి పథకాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.5 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామప్రసాద్ నిర్వహించారు. అంతకుముందు 73 మంది కాంట్రాక్టర్లు 994 టెండర్ ఫారాలను తీసుకున్నారు. పనులు దక్కించుకోవడానికి కాంట్రాక్టర్లు పోటీ పడడంతో, వారి మధ్య సయోధ్య కుదిర్చి, నీటి పథకాల టెండర్లను ఖరారు చేయడానికి ఈఈ రామప్రసాద్ ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో సుమారు పది మంది కాంట్రాక్టర్లు, తాము అధికార పార్టీ ఎమ్మెల్యే మనుషులమని, టెండర్లతో సంబంధం లేకుండా తమకు కొన్ని పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర కాంట్రాక్టర్లు టెండర్ ఫారాలను అధికారులకు సమర్పించేందుకు అవకాశం ఇవ్వకుండా అడ్డుపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సాయుధ పోలీసులు వచ్చి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ల మధ్య సయోధ్య కోసం ఈఈ మరోమారు ప్రయత్నాలు చేశారు. కానీ సదరు ఎమ్మెల్యే మనుషులమని చెప్పుకుంటున్న కాంట్రాక్టర్లు, ఇతర కాంట్రాక్టర్లు టెండర్ దాఖలు చేసేందుకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో టెండర్లను రద్దు చేస్తున్నట్టు ఈఈ రామప్రసాద్ ప్రకటించారు.

ఆ విషయం తెలియదు..... పరిశీలిస్తాను

ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు

ఆర్‌డబ్ల్యూఎస్ టెండర్ల దాఖలు సమయంలో కొంతమంది వ్యక్తులు తాము అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరులమని వీరంగం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును ఫోన్‌లో సంప్రదించగా, తాను విజయవాడ వెళతున్నానని, ఈ విషయం తనకు తెలియదని, తన పేరుతో వీరంగం చేసిన వారి గురించి పరిశీలిస్తానని అన్నారు.

ఏడుగురు డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించేందుకు ప్రతిపాదనలు తయారయ్యాయి. ఈ మేరకు మంగళవారం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ఆమోదముద్ర లభించింది. విశాఖలో ఎపిక్ డీటీఓగా పనిచేస్తున్న పి.అంజనకుమారి, యూఎల్‌సీలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న ఎస్.వెంకటరావు, దేవరాపల్లి హెచ్‌డీటీ డి.వీరభద్రరావు, ఎలమంచిలి స్పెషల్ డిప్యూటీ తహసీల్దారు కె.వెంకటేశ్వరరావు, కోటవురట్ల డీటీవో జి.టి.శ్రీనివాస్, చోడవరం హెచ్‌డీటీ లోకవరపు రామారావు, నర్సీపట్నం హెచ్‌డీటీ కోరాడ వేణుగోపాల్, గాజువాక హెచ్‌డీటీ ఉప్పాడ అరుణకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించనున్నారు.

జిల్లాకు కొత్తగా ఎనిమిది మంది డీటీలు

జిల్లాకు కొత్తగా ఎనిమిది మంది డిప్యూటీ తహసీల్దార్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1990లో ఏపీపీఎస్‌సీ పరీక్షల్లో ఎంపికై, వివిధ కారణాలతో ఉద్యోగాలు పొందలేకపోయిన వీరికి కోర్టు ఉత్తర్వుల మేరకు డీటీలుగా నియామకాలు చేపట్టారు. జల్లిల వెంకటసత్యసాయి రామ్మోహనరావు, భమ్మిడి చిన్నికృష్ణ, మారోతు వీఎస్ లోకేశ్వరరావు, బడుగు శ్రీధర్, మద్దాల సత్యపద్మ, జల్లేపల్లి మాధవి, రెడ్డి భాను, ఎర్రా నాగజ్యోతిని డీటీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

అన్ని లావాదేవీలు తెలుగులోనే: జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ● సాగరతీరంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాఖపట్నం: తెలుగు భాషకు మరింత వైభవం తెచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, అందుకు ప్రభుత్వపరంగా తాము చేయాల్సింది చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం ఆర్కే బీచ్‌లోని కురుసురా ఎదురుగా ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద శ్రీ శారద కళానికేతన్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో తెలుగును పూర్తిస్థాయిలో అమలు చేయడంతోపాటు పబ్లిక్ సర్వీస్ కమిషన్ సైతం పరీక్షలు తెలుగులో రాసేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. మరో అతిథిగా విచ్చేసిన సాహితీవేత్త డాక్టర్ మీగడ రామలింగస్వామి మాట్లడుతూ తెలుగు భాషను మించింది లేదన్నారు. వేదుల సుబ్రహ్మణ్యస్వామి మాట్లాడుతూ తమిళనాడులో కూడా మన తెలుగు పద్యాలనే వారి భాషలోకి అనువదించి పాడుకుంటారని అన్నారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాష ఔన్నత్యం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆలపించిన గాయాలు ఆలోచింపజేశాయి. అనంతరం కలెక్టర్ చేతులమీదుగా ప్రముఖులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో శ్రీశారదా కళానికేతన్ అధ్యక్షుడు రమేశ్ బొప్పన, ప్రధాన కార్యదర్శి అన్నవరపు శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యా యుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.30
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.40
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.25
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.30
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.12
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.80
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.30
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.20
కాకరకాయలు	రూ.30
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.80
శనగ పప్పు	రూ.80
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.30
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	98.00	95.00
విత్ స్కిన్	137.00	160.00
స్కిన్ లెస్	152.00	170.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3500	3920
రెండో రకం	3200	3980
మూడో రకం	2900	3335

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడ

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

తాతయ్య కోసం.. ఓ యాప్



ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'

- కావ్య

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో
డాక్టర్: ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?
రోగి: (పర్సు తడుముకుంటూ): హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

సూక్తి

పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

రంగులు వేయండి




పదాలు గుర్తించండి

shoe
duck
doll
globe
block
green


x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



దారి కనుక్కోండి



చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

చుక్కలు కలపండి



జవాబులు

చెప్పగలరా? : జాతీయం
జంతర్‌మంతర్ : 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL

జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▶ ....
2. LDOR ▶ ....
3. ALPM ▶ ....
4. TLAL ▶ ....

జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ....
2. అన్నతంత్యు ▶ ....
3. నీఅతివి ▶ ....
4. నంవమార్త ▶ ....

ఆంధ్రజ్యోతి
16
విశాఖపట్నం
బుధవారం 30 ఆగస్టు 2017




తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబరు 23 నుంచి డిసెంబరు 28 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబరు 23 నుంచి డిసెంబరు 28 వరకు ఉన్నాయి.
రూ.50: ఖాళీలు లేవు
శ్రీనివాసమ్: అక్టోబరు 23 నుంచి డిసెంబరు 28 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం: సెప్టెంబరు 6 నుంచి నవంబరు 30 వరకు ఉన్నాయి (మధ్యలో సెప్టెంబరు 19,23,27,28, 29,30, అక్టోబరు1,7,14 తప్ప)
ఆర్జిత సేవలు : అక్టోబరు 30వ తేదీ ఉన్నాయి.

- విశాఖపట్నం

రైల్వే సమాచారం




రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం

APSRTC



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 06333



అనంతగిరిలో మంచు సోయగాలు

మంచు కురిసే వేళలో...

ప్రకృతి అందాలకు నెలవుగా పేరుగాంచిన అనంతగిరిలో వాతావరణం అబ్బుర పరుస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో మంగళవారం అంతటా పొగమంచు కమ్ముకుంది. ఎదురుగా వచ్చే మనిషిని సైతం గుర్తించలేని విధంగా ఉన్న మంచు తెరలను చూసి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు. కాలం కాని కాలంలో ఏమిటీ వింత అని అశ్చర్యపోతూనే ఎంజాయ్ చేశారు. - అనంతగిరి



జాతీయ క్రీడలకు విశాఖ ఆతిథ్యం ఖాయం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే గణబాబు



అవార్డులు అందుకున్న క్రీడాకారులతో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

జాతీయ క్రీడా దినోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు

ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సు అవసరం : కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 29: దేశ క్రీడారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జాతీయ క్రీడల (నేషనల్ గేమ్స్) పోటీల నిర్వహణకు విశాఖ మరోసారి ఆతిథ్యమివ్వడం ఖాయమని 'పశ్చిమ' ఎమ్మెల్యే, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గణ బాబు పేర్కొన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మంగళ వారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2002లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో ఎనిమిది క్రీడాంశాల పోటీలకు విశాఖ ఆతిథ్యమిచ్చిందని, మరోసారి జాతీయ క్రీడలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఇటువంటి క్రీడల నిర్వహణతో జిల్లాలో క్రీడా మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులంతా ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని గణబాబు సూచించారు.

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సును నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. టోర్నీల నిర్వహణ, క్రీడాకారుల సాధనకు తగ్గట్టుగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. మునిసిపల్ స్టేడియాన్ని జాతీయ ఖోఖో ఇండియా కేంద్రంగా తీర్చిదిద్దనున్న నేపథ్యంలో పలు క్రీడాంశాలకు అనుకూలంగా అందుబాటులోకి రానుందన్నారు. విశాఖను క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు.

అంతకుముందు క్రీడాకారులు కవాత్తు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే, కలెక్టర్, డీఈవో రేణుక, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు టీఎస్ఆర్ ప్రసాద్, కార్యదర్శి ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్ కలిసి ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు క్రీడాంశాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేశారు.

అవార్డులు అందుకున్న అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులు

కాకర్ల శ్యామ్‌కుమార్ (బాక్సింగ్), నిషా (బాస్కెట్ బాల్), వి.తోషాలి (చెస్), ఎం.శాంతివర్షిణి (చెస్), గాయత్రి (కబడ్డీ), డి.సాయిరాజు (రోయింగ్), సీహెచ్ ఉత్తేజితరావు (బ్యాడ్మింటన్), అలీమా బేగమ్ (వెయిట్ లిఫ్టింగ్), ఆర్.కల్యాణ్ (వాటర్ స్పోర్ట్సు), జి.గాయత్రీదేవి (ఆర్చరీ), జి.సూర్యనారాయణ (అథ్లెటిక్స్), డి.రమేశ్ (బాల్ బ్యాడ్మింటన్), ఎస్.గణేశ్ (ఫుట్‌బాల్), యు.హరిణి ప్రియ (జిమ్నాస్టిక్స్), స్పందన (హాకీ), వి.వెంకటలక్ష్మి (జూడో), జి.లిఖిత (తైక్వాండో), ఆర్.సాయి స్వరూప్ (టేబుల్ టెన్నిస్), లిఖిత (టెన్నిస్), యశ్వంత్ (ట్రయిథ్లాన్), జె.అప్పలరాజు (వాలీబాల్), జి.వరలక్ష్మి (రెజ్లింగ్), కావ్య (అడ్వంచర్ స్పోర్ట్సు), ఎస్.రాజేశ్ (కరాటే), పి.శ్రీను (వాలీబాల్ పారా నేషనల్స్).

యువజనోత్సాహం

అనకాపల్లిలో ఘనంగా డివిజన్ స్థాయి యువజనోత్సవాలు

- **ఆట పాటలతో అలరించిన విద్యార్థులు**
- **దిశానిర్దేశం చేసిన వక్తలు**



విజేతలకు బహుమతి ప్రదానం

నెహ్రూచౌక్ (అనకాపల్లి) : భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపునకు.. విద్యార్థుల ఆట పాటలకు, వక్తల దిశానిర్దేశానికి వేదికగా నిలిచాయి అనకాపల్లిలో మంగళవారం జరిగిన యువజనోత్సవాలు. డివిజన్ స్థాయిలో జరిగిన ఈ వేడుకల్లో నృత్య ప్రదర్శనలు, బృంద గానాలు, వినసొంపైన వాయిద్యాలు వెరసి వేల్పుల వీధి సీతారామ కల్యాణ మండపం సందడిగా మారింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రత వల్లే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. వివేకానందుడి పుస్తకాలను అందరూ చదవడం ద్వారా మరింత జ్ఞానాన్ని సంపాదించవచ్చునన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆట పాటల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనకాపల్లిలో గల ప్రతి హైస్కూల్‌కు ప్లే గ్రౌండ్ నిమిత్తం ఐదు లక్షల రూపాయల గ్రాంటు కేటాయించినట్టు చెప్పారు. స్పోర్ట్స్ గ్రౌండ్ కోసం నారాయణపురంలో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నామని వివరించారు. యువజన సర్వీసుల శాఖాధికారిణి ఎ.సిరి మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. విపత్తులు వస్తే ఎలా ఎదుర్కోవాలి , విపత్తులు రాక ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆ సమయాల్లో ప్రజలను ఎలా రక్షించాలి, మానవ వనరులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి తదతర అంశాలపై ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఎయిర్ ఫోర్స్‌కు సంబంధించి 503 విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇదిలావుండగా, ఈ వేడుకకు ముందు ఉదయం జానపద నృత్యాలు, జానపద గీతాలు, సంప్రదాయ గాత్రం, నృత్యం, లలిత సంగీతం, వాయిద్యాల పోటీలను 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులకు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా విజయ జ్యోతి , కె.ఎల్.ఎన్.మూర్తి, కాండ్రేగుల సత్యనారాయణ, తోలేటి బుచ్చిబాబు, లలిత కుమార్‌గుప్తా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ అధికారులు కేవీఎస్ఎన్ మూర్తి, బీఎస్ ప్రకాష్, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, డాక్టర్ సత్యవతి, వాకాడ కోటిలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీలా, సిరి



విద్యార్థుల బృందగానం

ఆంధ్రజ్యోతి

4

పాడేరు

విశాఖపట్నం ● బుధవారం 30 ఆగస్టు 2017

పాడేరు । చింతపల్లి । గూడెంకొత్తవీధి । కొయ్యూరు । జి.మాడుగుల

కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గూడెంకొత్తవీధి: పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ అంబేద్కర్ ఆదేశించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండలంలో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారికి అత్యవసర సేవలు అందించేందుకు కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

అత్యవసర సేవలకు ప్రత్యేక సెల్

చింతపల్లి: మండలంలో అత్యవసర సేవల కోసం రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం తాజంగి రిజర్వాయర్, చౌడుపల్లి చెరువులోని వర్షపునీటి స్థాయిని ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. కుడుముసారి, చెరువూరు ప్రాంత ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు. అలాగే వర్షాల కారణంగా వైద్య సిబ్బంది, వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్టు చెప్పారు. అత్యవసర సేవల కోసం 9491641729 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

కొయ్యూరు: వరికి సోకిన తెగుళ్లను నివారించేందుకు రైతులు తక్షణమే తగిన చర్యలు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి విజయలక్ష్మి సూచించారు. మండలంలోని గుడ్లపల్లి, తాళ్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ, వరి నారు మడుల నుంచి నాట్లు వేసిన పైరు వరకూ మండల వ్యాప్తంగా అగ్గి తెగులు సోకిందని తెలిపారు. అలాగే పాముపొడ తెగులు సోకే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వీటి వల్ల పైరు ఎదుగుదలతో పాటు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వీటి నివారణకు ట్రైసైక్లోజోల్ లేదా హెక్సాకోనజోల్ మందును 0.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే మరికొన్ని సూచనలు ఆమె చేశారు. రాయితీపై వివిధ రకాల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భారతి, ఎంపీఈవోలు కృపామణి, మాధవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

తాజంగిలో కొనసాగుతున్న వైద్య శిబిరం



తాజంగిలో రోగులకి చికిత్స అందిస్తున్న వైద్యులు

చింతపల్లి: తాజంగి పంచాయతీ కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు నాలుగు రోజులుగా లోతుగెడ్డ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ పర్యవేక్షణలో తాజంగి వైద్యాధికారి సతీష్‌కుమార్, వైద్యసిబ్బంది స్థానికంగా నివాసం ఉంటూ జ్వర బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మంగళవారం ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు తాజంగి గ్రామాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, గ్రామంలో వ్యాధులు అదుపులో ఉన్నాయని, రోగులు కోలుకుంటున్నారని చెప్పారు. మరో మూడు రోజుల పాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామస్వామి, ఎంపీటీసీ సభ్యుడు కోరాబు అంగదరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మచ్చమ్మ



హాజరైన ప్రజా ప్రతినిధులు, పలువురు అధికారులు

సర్వసభ్య సమావేశానికీ హాజరుకారా..?

- అధికారుల తీరుపై ఎంపీపీ ధ్వజం
- వైద్యులు రాకపోవడంపై అసహనం
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

చింతపల్లి: మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోతే ఎలా? అని ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా వివిధ శాఖల అధికారులు చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కవడం మచ్చమ్మ మాట్లాడుతూ, సర్వసభ్య సమావేశానికి చింతపల్లి సీహెచ్‌సీ వైద్యులు హాజరైతే సరిపోదని, మండలంలో ని అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యులూ రావాల్సిందేనని స్పష్టం చేశారు. లంబసింగి వైద్యాధికారి వరుసగా రెండు సమావేశాలకు హాజరు కాలేదని అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకాకపోతే ప్రజల సమస్యలను ఎవరితో చెప్పుకోవాలి, ఎలా పరిష్కరించాలని ఎంపీపీ ప్రశ్నించారు. ప్రధానంగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే వర్షాల కారణంగా ప్రధాన రహదారులు పాడైపోతున్నాయని, ఆర్అండ్‌బీ అధికారులు రహదారులను తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారి, చింతపల్లి-చెరుకుంపాకలు రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. మండలంలో కల్తీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను వ్యవసాయ అధికారులు నియంత్రించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.భాగ్యారావు, జడ్పీటీసీ సభ్యురాలు పద్మకుమారి, ఎంఈవో పనసల ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భగవంతరావు, ఈపీడీసీఎల్ జేఈ చంద్రశేఖరరావు, సీహెచ్‌సీ డీసీఎస్ టి.మహేశ్వరావు, ఏడీఏ నవీన్‌జ్ఞానామణి, ఐసీడీఎస్ పీవో నీలవేణి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బోయిన సత్యనారాయణ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఉల్లి సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సాగిన దేవుడమ్మ పాల్గొన్నారు.

బోధన మెరుగుకు ప్రత్యేకాధికారులు

ఏటీడబ్ల్యూవో లక్ష్మి

సీలేరు: ఆశ్రమ పాఠశాలల్లో విద్యా బోధన మెరుగుపరిచేందుకు ప్రత్యేక అధికారులను నియమించామని ఏటీడబ్ల్యూవో లక్ష్మి తెలిపారు. సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆమె సోమవారం రాత్రి బస చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, సీలేరు బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు తాను ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి ఇక్కడ బస చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నట్టు చెప్పారు. పాఠశాలలో డిజిటల్ తరగతులు జరుగుతున్న తీరు, విద్యార్థులకు మెనూ అమలు తదితర అంశాలపై ఆరా తీశానన్నారు. ఆశ్రమాల్లో బయోమెట్రిక్ విధానం సక్రమంగా పనిచేయకపోవడంతో ఐరిస్ బయోమెట్రిక్, కొన్నిచోట్ల ఆఫ్‌లైన్ విధానం ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కుమారి, మేట్రిన్ ఆదిలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీలేరు బాలికల ఆశ్రమపాఠశాలలో ఏటీడబ్ల్యూఓ లక్ష్మి తనిఖీ చేస్తున్న దృశ్యం

ఆశ కార్యకర్తల సమ్మెను జయప్రదం చేయాలి

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగమ్మ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంగమ్మ

పాడేరు రూరల్: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల 5, 6, 7 తేదీలలో సమ్మెకు దిగుతున్నామని చెప్పారు. 20 ఏళ్లుగా గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్య రక్షణకు వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పటికీ కనీస వేతనాలు అందించకపోవడం విచారకరమన్నారు. నెలకు ఇస్తున్న రూ.400 గౌరవ వేతనం కూడా 11 నెలలుగా అందించకపోవడంతో దారుణమని వాపోయారు. అలాగే నాలుగేళ్లగా యూనిఫారం అలవెన్స్‌లు ఇవ్వలేదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు రూ.6 వేలు ఇచ్చేందుకు నిర్ణయించిందని, ఈ విషయంలో మన ప్రభుత్వం కూడా ఆలోచించాలని కోరారు. ఈ సమావేశంలో ఆశ కార్యకర్తల సంఘం సభ్యులు కె.చిన్నమ్మలు, టి.అన్నపూర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి ప్రభాకర్‌రావు

రైతుల ఆర్థికాభివృద్ధే ఐటీడీఏ ధ్యేయం

ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు

అరకు అర్బన్: గిరి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ఐటీడీఏ ధ్యేయమని ఉద్యానశాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు అన్నారు. చొంపి పంచాయతీ కొత్తవలస ఉద్యానవనంలో మూడు మండలాల రైతులకు ఉద్యాన, పూలసాగుపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 300 ఎకరాల్లో బిందు సేద్యంతోనే ఉద్యాన పంటలు, పూలతోటల సాగు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గిరి రైతులకు ఎప్రికట్, పియర్, స్ట్రాబెరీ, డ్రాగాన్‌ఫ్రూట్, జాఫ్ర, ఫైన్ ఆపిల్‌వంటిని పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ఈ పంటలు సాగు చేస్తున్న గిరిజనులకు ఆయిల్ ఇంజన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సింహాచలం, హెచ్‌వో దిలీప్‌కుమార్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

డ్రాపవుట్ పాఠశాలల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గూడెంకొత్తవీధి: డ్రాపవుట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో చెల్లయ్య తెలిపారు. మండలంలో డ్రాప్‌అవుట్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 12 పాఠశాలలను ఏర్పాటు చేయాలని అధికార్లు ఆదేశాలు జారీ చేసారని, ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరే అభ్యర్థులు బీఈడీ లేదా డైట్ సర్టిఫికెట్లను పొందినవారై ఉండాలని,అటువంటి అభ్యర్థులు జీకేవీధి ఎంఈఓ కార్యాలయానికి ఈ నెల 30 లోపు ధరఖాస్తులను చేసుకోవాలని ఎంఈఓ చెల్లయ్య కోరారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	అర్జున్ రెడ్డి
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	వివేకం

చివరికి వరద పోటు



ఉధృతంగా ప్రవహిస్తున్న బోకంవాని గెడ్డ



కె.జె.పురంలో నీట మునిగిన వరి పంట

భారీ వర్షాలకు పొంగిన గెడ్డలు, వాగులు

కె.కోటపాడులో నీట మునిగిన 285 ఎకరాలు

దేవరాపల్లిలో 60 ఎకరాల్లో పంట ముంపు

కె.కోటపాడు: అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలు వరి పంటను ముంచేశాయి. రెండు రోజులుగా పడిన వానలకు గెడ్డలు, చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే పొలాల్లో ఎక్కడి నీరు అక్కడ నిల్వ ఉండిపోయింది. దీంతో వరి పంట ముంపులో ఉండిపోయింది. కె.కోటపాడు మండలంలో దాదాపు 285 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కాలువలు, చెరువుల్లో నీరు పొలాల్లోకి చేరడంతో పంట ముంపులోనే ఉండిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో వరి పొలాలను చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కె.జె.పురంలో వెలమవాని చెరువు గండి కొట్టేయడంతో 50 ఎకరాల పంట నీట మునిగింది. అలాగే ఎ.కోడూరు, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, వారాడ, ఎ.భీమవరం, మేడిచర్ల గ్రామాల్లో వరి పంట 235 ఎకరాలు ముంపులో ఉన్నాయి.

పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు

విస్తార వర్షాలకు గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో చెరువులు, గెడ్డల్లో నుంచి రోడ్లపై నుంచి వరద నీరు పొలాల్లోకి పొంగి ప్రవహిస్తుంది. చౌడువాడలో చిట్టిగెడ్డ, మల్లంపాలెం గెడ్డ, గొండుపాలెం పెద్దగెడ్డ, మురుగుపాలెం మొండిగెడ్డ, కింతాడ శివారు జోగన్నపాలెం గొర్రెగెడ్డ, వారాడలో మొండిగెడ్డలు, మేడిచర్ల శివారు బోకంవాని గెడ్డలు ఉధృంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని గుల్లేపల్లి ఎర్నాయుడు చెరువు, కె.జె.పురం వెలమవాని చెరువులు గండ్లు పడడడంతో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. గండ్లు పడిన చెరువులను తహసీల్దార్ బి.ఎ.రాణి, జలవనరుల శాఖ ఏఈ జి.సత్యంనాయుడు, తదితరులు, పరిశీలించారు.

దేవరాపల్లిలో ముంపులోనే 60 ఎకరాలు

దేవరాపల్లి: మండలంలోని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయకట్టు పరిధిలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 60 ఎకరాలు నీటి మునిగిపోయాయి. మండలంలోని వేచలం మహాపాత్రుని చెరువు నీటిని విడుదల చేయడంతో దిగువనున్న ఎన్.గజపతినగరానికి చెందిన 40 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. అలాగే ఎం.అలమండ బట్లి కాలువ కింద మరో 20 ఎకరాల పంట మునిగిపోయింది. కాగా, కొత్తపెంట, బి.కింతాడ శివారు తారువ గ్రామాల్లో కాలువలు, చెరువులు పొంగిపొర్లతున్నాయి. దీంతో వాటి దిగువన ఉన్న వరికి కూడా ముప్పు పొంచివుంది.



ఎన్‌జి.నగరం మహాపాత్రుని చెరువు కింద ముంపులో ఉన్న పొలాలు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ఎం.కోటపాడు గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



దేవరాపల్లిలో బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్: మండలంలో తెగులు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎం.కోటపాడు పాఠశాలలో గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ప్రాముఖ్యతతో పాటు గిడుగు రామ్మూరి సేవలను తెలుగు ఉపాధ్యా యురాలు భారతి విద్యార్థులకు వివరించారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాలను వాడుక భాషగా మార్చిన మహనీయుడు రామ్మూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాస రచన, వకృత్వ పోటీలను ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, ఎస్.నాయుడు, శివప్రసాద్, సోమునాయుడు, లక్ష్మి, సుకన్య, ఆదిరెడ్డి కాసులమ్మ, సుబ్రహ్మాణ్యం పాల్గొన్నారు.

నాగార్జున అభిమానుల సేవా కార్యక్రమాలు

మాడుగుల: సినీ నటుడు అక్కినేని నాగార్జున జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఫ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీపట్టపు వెంకటరావు ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అలాగే మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అంతకు ముందు మాడుగుల బస్టాండ్ ఆవరణంలో కేక్ కట్ చేసి, అందరికీ మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘం ప్రతినిధులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి శ్రీను, ఎమ్.ఆశోక్, ఎస్‌వి.రాజేష్, చిట్టిబాబు, కిరణ్, సురేష్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఉపాధి పనులపై అవగాహన కల్పించండి

డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి

దేవరాపల్లి: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పథకం పనులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కళ్యాణచక్రవర్తి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ పథకం కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో చేపట్టిన పనుల వివరాలను ఆన్‌లైన్‌తో పాటు రికార్డుల్లో పొందుపర్చాలని ఆదేశించారు. అలాగే గ్రామాల వారీగా రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో పీడీ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1.59 లక్షల పని దినాలు కల్పించామని చెప్పారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి పనులను గుర్తిస్మాని, నవంబర్ ప్రతిపాదనలు తయారు చేస్తామని చెప్పారు. ఉపాధి పథకం కింద రూ.1.55 కోట్ల పనులు కల్పించామని, ఇందుకోసం రూ.280 కోట్లు ఖర్చు చేశామని పీడీ తెలిపారు. జిల్లాలో 522 కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు మంజూరు కాగా, 80 కిలోమీటర్ల రోడ్లు వేశామన్నారు. 691 అంగన్‌వాడీ భవనాల్లో ఇప్పటివరకు 300 భవనాలు పూర్తయ్యాయని, అక్టోబర్ నాటికి మొత్తం పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికి రెండు వేల నీటి కుంటల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో ఉపాధి కూలీలకు రూ.50 కోట్ల కూలి బకాయిలను త్వరలో వారి ఖాతాల్లో జమ చేస్తామని ఆయన తెలిపారు. గ్రామంలో జరిగే పనులు ఎప్పటికప్పుడు బహిరంగంగా చర్చించినపుడు ఆరోపణలకు తావుండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆంజనేయులు, ఎంపీడీవో డి.చంద్రశేఖర్, ఏపీవో కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ కళ్యాణచక్రవర్తి

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి పంపిణీ

దేవరాపల్లి: మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం సామగ్రి పంపిణీ చేశారు. పెదనందిపల్లి పంచాయతీ నిధుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని కొనులోగు చేసి అందజేశారు. గ్యాస్‌స్టవ్‌లతో పాటు పిల్లలకు అవసరమైన కంచాలు, పుస్తకాలను పంపినీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ కొరుపోలు దేవుళ్లమ్మ, అంగన్‌వాడీ బోధకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పాతవలసలో అన్న సంతర్పణ

కె.కోటపాడు: మండలంలోని పాతవలస గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా మంగళవారం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన నాలుగు వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అంతకుముందు గ్రామస్థులు అధిక సంఖ్యలో వినాయకుని మందిరం వద్దకు చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం నృత్యాలు, వివిధ వేషధారణల నడుమ ఊరేగింపుగా వెళ్లి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జామి భవానీ, పాతవలస యూత్ సభ్యులు కె.తాతబాబాబు, జె.నాయుడు, కె.శ్రీను, కె.పవన్, ఎన్.రాము, కె.హరీష్, జి.సతీష్, జి.హరీష్ పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	అర్జున్ రెడ్డి
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	వివేకం

నియోజకవర్గంలో ఘనంగా మాతృభాష దినోత్సవం

గిడుగు రామ్మూర్తికి నివాళులు అర్పించిన నేతలు, అధికారులు

తెలుగు భాషను రక్షించుకుందాం



మాట్లాడుతున్న కవి కురచా నరసింహానాయుడు



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు



రోలుగుంట కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

చోడవరం రూరల్ :నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మంగళవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. చోడవరంలోని నర్సాపురం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా విద్యాలయం సిబ్బంది గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి,నివాళులు అర్పించారు.అనంతరం విద్యార్థినులకు తెలుగు భాషపై వ్యాసరచన, వకృత్వపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఎరుకునాయుడు,పాల్గొన్నారు. అలాగే లక్కవరం, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలల్లోనూ మాతృభాషా దినోత్సవం జరిగింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు భాష విశిష్టతపై మాట్లాడారు. తెలుగు భాష మరిచిపోకుండా.. భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మాడుగుల గోవిందరావు, పద్మ, ఎస్.విఘ్నేశ్వరరావు, స్వర్ణ, దేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ విద్యా సంస్థలలో..

చోడవరం టౌన్ : పట్టణంలోని ఉషోదయ విద్యా సంస్థల్లో మాతృ భాషా దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి నరసింహానాయుడు మాట్లాడుతూ మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే కన్న తల్లిని నిర్లక్ష్యం చేసినట్టేనని చెప్పారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన కృషిని గుర్తుచేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఎస్‌వీఎస్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తెలుగు వెలుగులు

బుచ్చెయ్యపేట : మండలంలోని వడ్డాది కేపీడీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, తురకలపూడి, రాజా దిబ్బిడి, సీతయ్యపేట, విజయరామరాజుపేట, గున్నెంపూడి పాఠశాలల్లోనూ మాతృ భాషా దినోత్సవం జరిగింది. వడ్డాది పాఠశాలలో విద్యార్థులు తెలుగు భాష కమ్మదనాన్ని బుర్రకథ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బి.త్రినాథ్‌రావు, దొండా చంద్రకళ, డి.వి.మూర్తి,ఎస్‌విఎస్.నారాయణ,కె.వి.ఎస్.మూర్తి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగును వదిలేస్తే అమ్మను వదిలేసినట్లే

రోలుగుంట/రావికమతం :వాడుక భాషను వదిలేస్తే అమ్మను వదిలేసినట్టేనని రోలుగుంట కేజీబీవీ విద్యాలయం ప్రత్యేకాధికారిణి త్రివేణి అన్నారు. విద్యాలయంలో 'భావం-భాష,సంస్కృతి అన్నఅంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. వాడుక పదాలకు దూరమైతే మన సంస్కృతికి దూరమైనట్టేనని హెచ్చరించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ పరవాడ సతీష్, తదితరులు పాల్గొన్నారు.అలాగే రావికమతంలోని మరుపాక మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కె.అప్పారావు మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రాలో మాతృభాషకు ప్రాధాన్యమిస్తున్నారని, ఆ రాష్ట్రాల మాదిరిగానే తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సొంత భాషపై పట్టు లోపిస్తే పిల్లల్లో సరైన భావ వ్యక్తీకరణ ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌కృష్ణవేణి, సీఆర్పీలు రామారావు, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే గర్నికం కస్తూర్బాగాంధీ బాలికలవిద్యాలయంలోనూ తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



వడ్డాది పాఠశాలలో తెలుగు భాష ఔనత్యాన్ని బుర్ర కథ రూపంలో వినిపిస్తున్న విద్యార్థులు

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

రోలుగుంట : ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఎస్ మండల సమన్వయకర్త ఎస్‌వీ ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీపీఎస్ విధానంపై వచ్చే నెల 1న విజయవాడలో జరిగే ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 30 ఏళ్లుగా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కూడా ఈ విధానాన్ని అమలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కిరణ్మయి, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చోడవరం టౌన్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారిణి జోత్స్న సూచించారు. పట్టణంలోని రెల్లివీధిలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల జలుబు, జ్వరాలు, విరోచనాలు వంటివి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటి బారిన పడకుండా చూసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, వైస్ ఎంపీపీ భూతనాథు నానికుమార్, టీడీపీ మండల పార్టీ నాయకులు బొడ్డేడ నాగ గంగాధర్, దొమ్మేసి గిరి, దేవరపల్లి వెంకట అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు పట్నాల మణితల్లి, ముడుసు గోవింద, మాదిరెడ్డి జోగినాయుడు, పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట కొండపై నిర్మించిన వాటర్ ట్యాంకును పరిశీలిసున్న ఏజేసీ మిషాసింగ్

ఉపాధి పనుల పరిశీలన

బుచ్చెయ్యపేట:మండలంలో జరిగిన ఉపాధి పనులతో పాటు పంచాయతీల వారీగా రికార్డులను ఏజేసీ మిసాసింగ్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలించారు.అలాగే బుచ్చెయ్యపేట కొండపై వేసిన మొక్కలు, వాటర్ ట్యాంకు, తవ్విన కందకాలను, కందిపూడిలో చేపట్టిన నీటిగుంట నిర్మాణాలను కూడా పరిశీలించారు. ఆయనతో పాటు ఉపాధి పీడీ కళ్యాణ చక్రవర్తి, ఏపీడీ ఆంజనేయులు,ఎంపీడీఓ కొండలరావు, ఏపీఓ అప్పలరాజు, ఈసీ సురేష్ ఉన్నారు.

వచ్చే నెలలో శిష్టకరణాల ఓబీసీ సాధన గర్జన

చోడవరంటౌన్ : విశాఖలోని మధురవాడ కళాజాతర వద్ద వచ్చే నెల 15వ తేదీన జరిగే అఖిలభారత శిష్ట కరణాల ఓబీసీ సాధన గర్జనను అందరూ విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొలుమహంతి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణంలోని లక్ష్మీపురం రహదారిలోని డి. సత్యప్రసాద్ నివాసంలో జరిగిన ఆ సంఘం ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఓబీసీ సాధనకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం శిష్ట కరణాల జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన డి.సత్యప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రం అందజేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు పాత్రో, జిల్లా కన్వీనర్ ఆడమ్స్ వెంకటరావు, జనరల్ సెక్రటరీ గాజువాక రమణారావు, కోశాధికారి ఉమామహేశ్వరరావు, ప్రోగ్రాంకన్వీనర్ సింహగిరి పట్నాయక్, శ్రీకాకుళం జేఏసీ కన్వీనర్ కృష్ణ, పాల్గొన్నారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉమామహేశ్వరరావు

మరుగుదొడ్లు నిర్మాణం తప్పనిసరి

రోలుగుంట : మండలంలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ చెప్పారు. మంగళవారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. 21 పంచాయతీల్లో గ్రామాల వారీగా మరుగుదొడ్లు లేని వారి వివరాలు సేకరించాలని స్వచ్ఛదూత్‌లను కోరారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన

చోడవరం రూరల్/బుచ్చెయ్యపేట : మండలంలోని రాయపురాజుపేటలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఎంపీడీవో జీవీ చిట్టిరాజు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేయడానికి ప్రతిచోట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు స్థలాలనుఎంపిక చేస్తున్నామన్నారు.ఆయనతో పాటు మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బొడ్డేడ నాగ గంగాధర్, తదితరులు ఉన్నారు. అలాగే బుచ్చెయ్యపేట మండలంలో జరిగిన ఉపాధి పనుల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వేణుగోపాల్ పరిశీలించారు. నిర్మాణంలో పలు మార్పులను మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబుకి సూచించారు. అనంతరం వడ్డాదిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. అలాగే పొట్టిదొరపాలెంలో చెక్‌డ్యామ్,గున్నెంపూడిలో ఫారమ్ పాండ్, పొలేపల్లిలో చెరువు పనులను కూడా పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి
4
నర్సీపట్నం
విశాఖపట్నం । బుధవారం 30 ఆగస్టు 2017
నర్సీపట్నం । గొలుగొండ । నాతవరం । మాకవరపాలెం

ఓటర్ల నమోదులో రెవెన్యూ బిజీ

భూములు ఆన్‌లైన్ కాక రైతులు ఇబ్బందులు

మాకవరపాలెం: ఓటర్ల నమోదులో రెవెన్యూ సిబ్బంది బిజీగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పది రోజులుగా రెవెన్యూ సిబ్బంది ఓటర్ల నమోదు చేస్తున్నారు. దీనివల్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్‌లైన్ పూర్తిగా నిలిచిపోయింది. మీ-సేవా కేంద్రాల నుంచి వచ్చిన పాస్‌పుస్తకాల దరఖాస్తులను గుట్టుచప్పుడు కాకుండా రిజక్ట్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే భూముల ఆన్‌లైన్ కాకపోవడంతో ఖరీఫ్ సాగుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయాలని రైతులుకోరుతున్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం: గబ్బాడ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని శైలజ మాట్లాడుతూ తెలుగు భాషను విద్యార్థులు మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చలపతి, విరల్, రాజారావు, రాఘవకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి

గొలుగొండ: ఖరీఫ్ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధికారి మధుసూదనరావు అన్నారు. మంగళవారం గాదంపాలెంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి నాట్లు ఆలస్యం కావడంతో ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. అవగాహనతోనే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో..

వర్షాల కారణంగా పంటలకు వచ్చే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ వ్యవసాయాధికారి మదనసూదనరావు చెప్పారు. మంగళవారం చోద్యం, విప్పలపాలెంల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తి, మిరప, చెరకు, వరి పంటలను సంరక్షించుకునే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు వెంకటేష్, ప్రియ, ప్రసన్న, ఆత్మ పర్యవేక్షకురాలు రాజేశ్వరి, చోద్యం ఉపసర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్, టీడీపీ నాయకుడు దేవాడ శేషు, ధర్మరాజు, రైతులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మాణం తప్పనిసరి

రోలుగుంట: మండలంలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డు నిర్మించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ చెప్పారు. మంగళవారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 21 పంచాయతీల్లో గ్రామాల వారీగా మరుగుదొడ్లు లేని వారి వివరాలు సేకరించాలని స్వచ్ఛదూతలను కోరారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలను వెంటనే ఆన్ లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

సమాజ సేవలో నేను సైతం..



దహన సంస్కారాలు నిర్వహించే చోట బొమ్మలు వేసిన దృశ్యం



కైలాసవాటికలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసిన దృశ్యం



ఎంబిపట్నం శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

- శ్మశానవాటికలో సౌకర్యాలు
- స్వచ్ఛందంగా ముందుకొచ్చిన గ్రామస్థుడు
- రూ.మూడున్నర లక్షలతో పలు నిర్మాణాలు
- భవిష్యత్తులో మరిన్ని సేవలు: బాపన్ననాయుడు



నాతవరం: సమాజ సేవకు ఆయన అంకితమయ్యారు. గ్రామానికి సేవ చేయడానికి సొంత నిధులతో ముందడుగు వేశారు. ఆయనే ఎంబీపట్నంకి చెందిన పల్లి బాపన్నాయుడు. తన సొంత నిధులు రూ.మూడున్నర లక్షలతో శ్మశాన వాటికలో కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి బాపన్నాయుడు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని ఎంబీ పట్నంలో శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రభుత్వం రూ.పది లక్షలను ప్రభుత్వం గత ఏడాది మంజూరు చేసింది. ఈ నిధులతో దహన సంస్కారాలు చేసే భవనం, విశ్రాంతి భవనం నిర్మించారు. దీంతో శ్మశాన వాటికలో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అదే గ్రామానికి చెందిన పల్లి బాపన్నాయుడు ముందుకు వచ్చారు. తన సొంత నిధులు రూ.3.5 లక్షలతో శ్మశానవాటికలో 12 అడుగుల ఎత్తు గల ఈశ్వరుని విగ్రహం నిర్మించారు. అలాగే దహన సంస్కారాలు చేసే భవనంపై ఈశ్వరుని చిన్నచిన్న బొమ్మలు వేయించారు. కాటికాపరి బొమ్మతో అందంగా ముఖద్వారం ఏర్పాటు చేశారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీగోడ, ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. శ్మశానం లోపల కూర్చొనేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. నీడనిచ్చే మొక్కలను కూడా పెంచనున్నామని బాపన్నాయుడు తెలిపారు. వర్షాకాలంలో ఎంబీపట్నం శ్మశానవాటికకు వచ్చినపుడు సరైన షెల్టర్ లేక ఇబ్బందులు పడేవారమని, సొంత నిధులు రూ.3.5 లక్షలతో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. తనకు ఉన్నదాంట్లో సామాజిక సేవ చేయాలనే ఉద్దేశంతోనే కైలాసవాటిక అభివృద్ధికి ముందడుగు వేశానన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని చెప్పారు.



శ్మశానవాటిక ముఖద్వారం

గొలుగొండలో రెండు రోజులుగా భారీ వర్షాలు

గొలుగొండ: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లో వరి నాట్లు నీటమునిగాయి. మండలంలో పాతమల్లంపేట, జోగంపేట, కె.మల్లంపేట, పప్పుశెట్టిపాలెం, ఏటిగైరంపేట, పాకలపాడు, గొలుగొండ, సాలికమల్లవరంల్లో వరి నాట్లు నీటమునిగాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు నీరు సంవృద్ధిగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాతమల్లంపేటలో నీట మునిగిన పంటపొలాలు

ప్రజావేదికకు హాజరుకాని ప్రజాప్రతినిధులు

గొలుగొండ: ఉపాధి హామీ ప్రజావేదిక సమాచారాన్ని ఇవ్వకపోవడంతో మండలంలోని ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. దీనిపై జడ్పీటీసీ సభ్యుడికి గానీ, ఎంపీపీ గానీ, ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు సమాచారం అందలేదు. దీంతో ఎవరూ ఉపాధి పథకం ఏపీవో సుప్రియపై ఏపీడీ శ్రీనివాసరావుకుప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

మాకవరపాలెం: ప్రతి విద్యార్థికి క్రీడలు ఎంతో అవసరమని అవంతి కళాశాల ప్రిన్సిపాల్ సి.మోహనరావు అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. క్రీడలు విద్యార్థులకు మేధాశక్తితోపాటు చురుకుతనాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది గురునాథ్, నాగరాజు, డేనియల్, పేరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్యానచంద్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నర్సీపట్నం: ఒలింపిక్స్‌లో దేశానికి స్వర్ణపతకాలు సాధించిన హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ స్ఫూర్తిని నేటి యువత గ్రహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వెంకటరావు అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హాకీలో ధ్యాన్‌చంద్ చూపిన ప్రతిభ, చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకరరాజు, అధ్యాపకులు పార్వతీశం, సీతారామ్మూర్తి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరావు

చిననర్సాపురంలో నీటి కష్టాలు

- పది రోజులుగా రంగుమారిన బావి నీరే గతి
- మరమ్మతులకు డబ్బులు అడుగుతున్నారు: గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

పాయకరావుపేట: మండలంలోని చిననర్సాపురం గ్రామంలో కుళాయిల ద్వారా తాగునీరు అందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న రెండు బావుల్లో ఉన్న రంగుమారిన నీటినే తాగుతూ రోగాల పాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెదరాం భద్రపురం పంచాయతీ శివారు చిన నర్సాపురంలో 100 దళిత కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరికి గ్రామంలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఏర్పాటుచేసిన 20వేల లీటర్ల సామర్థ్యంగల ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి కుళాయిల ద్వారా రెండు పూటలా తాగునీటిని అందిస్తున్నారు. ఈ ఓవర్ హెడ్ ట్యాంకుకు పెదరాంభద్రపురంలో బోరు ఏర్పాటుచేసిన పైపులైను ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. బోరు వద్ద ఏదైనా సమస్య ఏర్పడితే అది పరిష్కారమయ్యేంతవరకు చిననర్సాపురం గ్రామస్థులకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో పది రోజుల క్రితం బోరు ప్యానెల్ బోర్డులో సమస్య వచ్చి మోటారు పనిచేయకపోవడంతో అప్పటి నుంచి తాగునీరు సరఫరాకాక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న రెండు బావుల్లోని రంగుమారిన నీటినే తాగునీటిగా ఉపయోగిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బోడపాటి సూరిబాబు, అంజలీదేవి, కుమారి, జక్కల అచ్చియమ్మ, బి.సత్యవతి, ఎం.లక్ష్మి, చిన్నారి, ఎం.సాయి, బి.అప్పారావు, డి.భీముడు తదితరులు మాట్లాడుతూ పెదరాంభద్రపురంలో బోరు పాడైతే అది బాగయ్యేంతవరకు చిననర్సాపురానికి తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ప్యానల్ బోర్డు పాడైన ప్రతిసారీ బాగుచేయించడానికి తమను డబ్బులు అడుగుతున్నారని, ఇప్పుడు ప్యానెల్ బోర్డు పాడై పదిరోజులు కావస్తున్నా పట్టించుకోలేదన్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ కలిగట్ల గంగాభవానీని వివరణ కోరగా చిననర్సాపురంలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి పథకాన్ని పంచాయతీకి ఇప్పటికీ అధికారులు అప్పగించనందున మరమ్మతులకు గురైతే పంచాయతీ నుంచి ఖర్చుచేసే వీలులేదన్నారు. నిర్వహణకు అవసరమైన నిధులు గ్రామంలో ఇంటింటికి వేసిన కుళాయిల ద్వారా నెలకు రూ.15 చొప్పున రుసుం వసూలు చేయాల్సి ఉందన్నారు. గ్రామంలో ఏ ఒక్కరు కూడా ఇప్పటివరకు ఈసొమ్ము చెల్లించలేదన్నారు. అయినా పలుమార్లు మోటారు కాలిపోతే ప్రజల తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ నిధులతో బాగుచేయించామని తెలిపారు. ప్రస్తుత సమస్యను బుధవారం సాయంత్రం లోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని సర్పంచ్ తెలిపారు.



గ్రామంలో ఉన్న 20వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్



రంగుమారిన బావి నీరు

చిన నర్సాపురంలో అపరిశుభ్ర పరిస్థితుల్లో ఉన్న బావి నుంచి నీరు పట్టుకుంటున్న దృశ్యం



పది రోజులుగా నిరుపయోగంగా వున్న తాగునీటి కుళాయి



తాగునీరులేక ఇబ్బందులు
బోడపాటి అచ్చియమ్మ, చిననర్సాపురం

పది రోజులుగా గ్రామంలో కుళాయిల నుంచి తాగునీరురాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. గ్రామంలో బయట నుంచి తెచ్చుకున్నవారి నుంచి తాగునీరు అడిగి తాగుతున్నాను.



పంచాయతీ పట్టించుకోలేదు
బోడపాటి సూరిబాబు, చిననర్సాపురం

గ్రామంలో కుళాయిల నుంచి తాగునీరు రావడంలేదని పది రోజులుగా పంచాయతీ కార్యదర్శికి చెబుతున్నా పట్టించుకోవడంలేదు. గ్రామస్థులు బావుల్లోని రంగుమారిన నీటిని తాగుతూ రోగాల పాలవుతున్నారు.



డబ్బులు అడుగుతున్నారు
బి.చిన్నారావు, చిననర్సాపురం

పాడైన బోరు బాగుచేసేందుకు గ్రామస్థులు డబ్బులు ఇవ్వండి అని అడుగుతున్నారు. గతంలో పలుమార్లు ఇచ్చాం. ఇప్పుడు కూడా అడుగుతున్నారు. రెక్కడితేగాని డొక్కాడని పేదలం. తాము ఎక్కడి నుంచి డబ్బులు తేవాలి.

సాగుదారులకు పట్టాలివ్వాలి

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆక్రమణలో వున్న సాగుదారులందరికీ పట్టాలిచ్చి ఆదుకోవాలని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆందోళనచేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ పి.వెంకటస్వామి ఆధ్వర్యంలో డీటీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా అంతర్జాతీయ క్రీడా దినోత్సవం

నక్కపల్లి: మండల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో హాకీ టోర్నమెంట్ నిర్వహించారు. నక్కపల్లి సర్పంచ్ వీసం వెంకటలక్ష్మిని ఘనంగా హాకీ క్లబ్ తరపున సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. నక్కపల్లి మాజీ సర్పంచ్ తుమ్మాకల్పన హాకీ క్రీడాకారులకు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఎస్ఐ సింహాచలం, సర్పంచ్ వెంకటలక్ష్మి హాకీ క్లబ్ ప్రతినిధి కొల్నాటి తాతాజీ, హాకీ కోచ్ సతీష్ పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో..

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బాక్సింగ్, కుంగ్ ఫూ ట్రైనర్ ఎం.రామకృష్ణ క్రీడలపై అవగాహన కల్పించారు. వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, హెచ్ఎం బి.సీతారాం, ఎం.శ్రీనివాస్, వి.ఎం.బీఎస్.రత్నం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చలపతిరావుకు ఘన సన్మానం





ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును సత్కరిస్తున్న వైసీపీ, టీడీపీ ప్రజాప్రతినిధులు

కోటవురట్ల: రాజకీయాలకు అతీతయంగా అజాత శత్రువుగా పేరుపొందిన ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును వైసీపీ, టీడీపీ ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్యసమావేశానికి హాజరైన ఈసందర్భంగా వైసీపీకి చెందిన ఎంపీపీ అయ్యిపువరహాలమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి, పైలరమేషలు ఘనంగా సన్మానించారు.

అనంతరం తెలుగుదేశంపార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పప్పల చలపతిరావును సత్కరించారు.

తమ్మయ్యపేటలో ఆంజనేయస్వామి ఉత్సవం

నక్కపల్లి: మండలంలోని చందనాడ పంచాయతీ శివారు తమ్మయ్యపేటలో మంగళవారం ఆ గ్రామ ఆంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. నక్కపల్లికి చెందిన పండితుడు శ్రీపాద కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.గంటా తిరుపతిరావు పాల్గొన్నారు.

హైవేపై అదుపుతప్పిన లారీ

నక్కపల్లి: గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న లారీ మంగళవారం ఉదయం అదుపు తప్పి హైవే పై నుంచి పక్కకు దూసుకుపోయింది. ప్రతీ శుక్రవారం ఇక్కడ సంత జరుగుతుంటుంది. ఈ సందర్భంగా జన రద్దీ అధికంగా వుంటుంది. మిగిలిన రోజుల్లో ఇక్కడ జనసంచారం వుండదు.ఈ కారణంగానే లారీ వారపుసంత పాకల్లోకి దూసుకుపోయినా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్టయిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.మంగళవారం సాయంత్రం ఈ లారీని బయటకు తీయించారు.

కస్తూర్బా పాఠశాల ఎంఈవో తనిఖీ

నక్కపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌ను మంగళవారం ఎంఈవో డీవీడీ ప్రసాద్ తనిఖీ చేశారు. 9,10 తరగతులు చదువుతున్న బాలికలను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మంచినీటి ఇబ్బందులున్నట్టు గుర్తించారు. వర్షం కురిస్తే పాఠశాల బయట బురదగా వుంటుందని, రాత్రి వేళల్లో పాముల బెడద ఎక్కువగా వుందని బాలికలు వాపోయారు. పాఠశాల ఆవరణలో రాత్రి సమయాల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో అంధకారం అలముకుంటుందన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చారు.

ముగిసిన సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు

- ఇంటర్వ్యూలకు హాజరుకానివారికి నేడు, రేపు బ్యాంకుల్లో ఇంటర్వ్యూలు


పాయకరావుపేట: మండలంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన ఎస్సీ, బీసీ, కాపు సబ్సిడీ రుణాల మంజూరుకు ఈనెల 23వతేదీ నుంచి నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు మంగళవారంతో ముగిశాయని ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. అయితే ఇప్పటివరకు నిర్వహించిన ఎస్సీ, బీసీ, కాపు సబ్సిడీ ఇంటర్వ్యూలకు వివిధ కారణాలతో హాజరుకాని ఎస్సీ బీసీ, కాపు రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకున్నవారంతా బుధ, గురువారాల్లో ఆయా బ్యాంకులకు దరఖాస్తుతోసహా హాజరుకావాలని ఆయన కోరారు.

తెలుగు భాషకు జేజేలు

నియోజకవర్గంలో ఘనంగా మాతృభాషా దినోత్సవం

గిడుగు రామ్మూర్తికి నివాళులు అర్పించిన నేతలు, అధికారులు

ఎలమంచిలి : పట్టణంలో తెలుగు భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది.ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. మాల్యాద్రితో పాటు చోడవరం కళాశాల అధ్యాపకుడు సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పూరిజగన్నాథం, తదితరులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాల్యాద్రి మాట్లాడుతూ పల్లె గ్రామాలు ఉన్నంత కాలం తెలుగు భాషకు ఢోకా లేదన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మహాలక్ష్మి, చంద్రమౌలి, బి.లక్ష్మి,నిర్మలాకుమారి, లావణ్య, పిడి ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే మర్రిబంద పాఠశాలలో హెచ్ఎం వినోద్‌కుమార్ ఆధ్వ ర్యంలో, శ్రీచైతన్య పాఠశాలలోనూ ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.


ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ మాల్యాద్రి

అమ్మ భాషను మరువవద్దు

అచ్యుతాపురం/రూరల్:తెలుగులోని తియ్యదనం మరే భాషలోనూ లేదని దోసూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.గంగాధర్ అన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన తెలుగు భాష దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మనం మాట్లాడుతున్న భాష గిడుగు వారి కృషి ఫలితమేనన్నారు. ఆయన కృషి వల్లే దేశభాషలందు తెలుగు లెస్స అన్న నానుడి శాశ్వతమైందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పద్యపఠన, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, మురళి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అందలాపల్లి పాఠశాలలో హెచ్ఎం మోహన మురళి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మోటూరి త్రినాథస్వామి, తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలోని దోసూరు, అందలాపల్లి పాఠశాలల్లో వేడుకలు

సమస్యలు పరిష్కరించాలని మహిళల ధర్నా

ఎలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని శేషుకొండను ఆనుకుని ఉన్న శ్రీరామ్‌నగర్ కాలనీ మహిళలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 ఏళ్లగా కాలనీలో సౌకర్యాలు లేకఇబ్బంది పడుతున్నామన్నారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీటి సదుపాయం లేదన్నారు. పన్నులు కట్టించుకుంటున్న పాలకులు, అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించాలని వారు కోరారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళల ధర్నా



మైహోమ్‌లో రక్తదానం శిబిరం

ఎలమంచిలి రూరల్ : మండలంలోని బయ్యవరం పంచాయతీలోని ములకలాపల్లిలో ఉన్న మైహోమ్ సిమెంటు కర్మాగారం స్థాపించి పదేళ్లు పూర్తి కావడంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 60 మంది రక్తదానం చేసినట్టు కర్మాగారం ప్రతినిధి చౌదరి తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో సీనియర్ డీజీఎం రమేష్ పండిట్, ఏజీఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పెదపాడులో కూలిన కల్వర్టు గోడ

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పెదపాడు గ్రామ పొలిమేరల్లో పొలాలకు వెళ్లేందుకు నిర్మిస్తున్న కల్వర్టు గోడ కూలిపోయింది. గ్రామానికి చెందిన ఒక కాంట్రాక్టర్ విశాఖ డెయిరీ నిధులతో ఈ కల్వర్టు నిర్మిస్తున్నారు. కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు కల్వర్టుకు ఆనుకుని నిర్మించిన మద్దతు గోడ పునాదులతో సహా కాలువలోకి కూలిపోయింది. ఇంజనీరింగ్ ప్లాన్ లేకపోవడం, నాసిరకం పనుల వల్ల గోడ కూలిపోయినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.




కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్ శారదా నది

వానొచ్చె..వరదొచ్చె

- నియోజకవర్గంలో భారీ వర్షాలు
- చెరువులను తలపిస్తున్న పొలాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- నిండుకుండలా చెరువులు

ఎలమంచిలి/రూరల్ అచ్యుతాపురం/ మునగపాక/రాంబిల్లి: నియోజకవర్గంలో నాలుగు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలాల్లో నీరు చేరింది. చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. రాంబిల్లిలోని మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కువడంతో కొత్తూరు వద్ద మేజర్ శారదా నది, నారాయణపురం వద్ద మైనర్ శారదా నదులు జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో దిమిలి, రజాల, మురకాడ, మర్రిపాలెం గ్రామాల్లో 150 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. నదుల్లో నీటి ఉధృతి పెరుగుతుండడంతో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అలాగే రాజల వద్ద పాత ఎర్రిగెడ్డ కొంతమేర కోతకు గురైంది. జల వనరుల శాఖ డీఈ వరప్రసాద్, టీడీపీ నేతలు ఎర్రిగెడ్డ కాలువను పరిశీలించారు.


రజాల వద్ద నీట మునిగిన పంట పొలాలు



మునగపాక ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు

అచ్యుతాపురంలో భారీ వర్షం

అచ్యుతాపురం : మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిప తర్వాత ఉరుములు మెరుపులతో వర్షం పడింది. సుమారు రెండు గంటల పాటు పడిన వర్షానికి పూడిమడకలోని ఉప్పు గల్లీలతో పాటు అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ వర్షపు నీటితో నిండిపోయాయి. మండలంలో సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు 66. 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎలమంచిలిలో 55.8 మిల్లీమీటర్లు

ఎలమంచిలి మండలంలో కురిసన వర్షానికి చెరువులు, సాగునీటి కాలువల్లోకి నీరు చేరింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ 55.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం చెదురుమదురుగా తప్ప పెద్దగా వర్షం పడలేదు.


పురుషోత్తపురం తాళ్ళమ్మ చెరువు

కానీ ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షానికి ఏటికొప్పాకలో వరహానది ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే పురుషోత్తపురంలో తాళ్ళమ్మ చెరువు నిండుకుండలా ఉంది. మునగపాకలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఈ ఏడాదిలో అత్యధికంగా 88.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాల ఆట స్థలాలు చెరువుల్లా మారిపోయాయి.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి : జెడ్పీటీసీ దాడి

మునగపాక : ప్రభుత్వ భూమిని, చెరువులను పట్టా భూములుగా మార్చి దారా దత్తం చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు దాడి లక్ష్మీ సత్యనారాయణ సిట్ డీఎస్పీ శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విశాఖలో సిట్ డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి తాను ఆరోపిస్తున్న అంశాలకు సంబంధించిన ఆధారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగవరం రెవెన్యూ పరిధిలో ఐదు చెరువులను పట్టాభూములుగా మార్చి కొంతమందికి ధారాదత్తం చేశారన్నారు. రాజుపేటలో సర్వే నంబరు 310లో ఐదెకరాల భూమిని గ్రామంలో లేని వారికి దారాదత్తం చేసి, విషయం బయటకు వచ్చాక దిగువస్థాయి ఉద్యోగి వీఆర్ఏపై నెపం పెట్టేసి అధికారులు తప్పించుకున్నారని ఆరోపించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఎలమంచిలి : విద్యతో పాటు క్రీడా రంగంపై కూడా విద్యార్థులు దృష్టిసారించాలని ఎంఈఓ మూర్తి సూచించారు. మంగళవారం కొక్కిరాపల్లి వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు.అనంతరం గ్రామ పెద్ద మజ్జి రాంబాబు క్రీడా సామగ్రి కొనుగోలుకు 5 వేల రూపాయలు వితరణగా ఇచ్చారు.


క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎంఈఓ

నేడు 'డయల్ యువర్ డిపో మేనేజర్'

అనకాపల్లి టౌన్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వి.ప్రవీణ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సూచనలను 99592 25595, 79895 42241 నంబర్లకు ఫోన్ చేసి వివరించాలని కోరారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- అర్జున్‌రెడ్డి
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - ఆనందో బ్రహ్మో
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : వివేకం

రోజూ మంట..

పెట్రో ధరల పెంపుపై అంతటా అసంతృప్తి

- రోజువారీ సమీక్షలతో జేబులకు చిల్లంటూ గగ్గోలు
- అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నా పెంచి విక్రయిస్తుండడంపై ఆగ్రహం
- కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని వినియోగదారుల వేడుకోలు

ఏమిటీ తంటా!



బంకులో పెట్రోల్ పోయించుకుంటున్న వినియోగదారుడు



అనకాపల్లి టౌన్ :
పెట్రో ధరలు రోజువారీ పునః సమీక్ష బాధ్యతలు చమురు కంపెనీల చేతికి చిక్కడం వాహనదారులకు ధరాఘాతంగా మారింది. రోజు రోజుకి దూకుడు ప్రదర్శిస్తున్న ధరలను చూసి అయోమయానికి గురవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సామాన్య, మధ్య తరగతి బండి నడిపే పరిస్థితి ఉండదని చెపుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ ఆ పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదని అంటున్నారు. దీనికి ప్రభుత్వ వైఫల్యం కూడా కారణమని ఆరోపిస్తున్నారు. అదీకాకుండా ఎన్నడూలేని విధంగా ఏ రోజుకు ఆ రోజే పెంచడం, తగ్గించడం వంటి చర్యల కారణంగా బంకు యజమానులు కూడా తలలు పట్టుకునే పరిస్థితి తలెత్తుతోంది. కేంద్ర ప్రభుత్వం జూన్ 16 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితులకు అనుగుణంగా ఏ రోజుకు ఆరోజే పునః సమీక్షించి అమ్మకాలు చేపట్టాలని నిర్ణయించింది. ఆ బాధ్యతను చమురు కంపెనీలకు అప్పగించింది. తొలిరోజు ధరలను చూసిన వారంతా భవిష్యత్తులో మరింత దిగివస్తాయని అంచనాలు వేశారు.

ధరలు పెరిగిన క్రమం ఇలా..!

జూలై 16న లీటరు పెట్రోల్ రూ.69.39 , డీజిల్ 61.23కు లభించింది. అదే జూలై 31న పెట్రోల్ 70.31, డీజిల్ 61.63, ఆగస్టు ఒకటో తేదీన పెట్రోల్ 70.51, డీజిల్ 61.79, 15న పెట్రోల్ 73.27, డీజిల్ 69.59, 29న పెట్రోల్ లీటరు 74.34, డీజిల్ 63.30కి పెరిగింది.

ఇలాగైతే ఆటోలు నడపలేం



రోజూ ధరలు పెరగడం వల్ల భారం పెరుగుతుంది. అసలే ఆటో నడపడం వలన అంతంతగా వచ్చే ఆదాయానికి ఒక పక్క పోలీసులు, మరో పక్క రవాణాశాఖ అధికారులు కేసులతో పాటు పెట్రో ధరలు కూడా చేతిలో చిల్లిగవ్వ లేకుండా చేస్తున్నాయి. ఇలాగైతే భవిష్యత్తులో ఆటోలు నడపడం కష్టమే. **- డి.సింహాద్రి,** ఆటో డ్రైవర్

నిత్యావసర వస్తువులపై ప్రభావం



రోజూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన నిత్యావసర వస్తువులపై ఆ ప్రభావం చూపుతుంది. ఇప్పటికే ధరలు పెరిగి ఉన్నాయి. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడం వలన రవాణా విషయంలో చార్జీలు పెరిగి ఆ మోత సామాన్యులపై పడుతుంది. ఇలాగైతే సామాన్య, మధ్య తరగతి ప్రజలు బతికేదెలా.

- కాండ్రేగుల జనార్ధనరావు, వినియోగదారుడు

నెలకో..పక్షం రోజులకో సమీక్షించాలి



పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం ఇబ్బందిగా ఉంది. గతంలో ఆటోకు లీటరు డీజిల్ వేసుకుంటే ఎన్ని కిలోమీటర్లు వస్తుందో అంచనా ఉండేది. రోజు రోజుకి ధర పెరుగుతూ ఉండడం వలన అంచనా తెలియడం లేదు. నెలకో లేదా పక్షం రోజులకో ధరలు పెంచడమో, తగ్గించడమో జరిగితే బాగుంటుంది.

- ఎస్.వెలస్లీ, ఆటో డ్రైవర్

రోజూ ధరలు మార్చడం ఇబ్బందే



రోజూ పెట్రోల్, డీజిల్ ధరలు మార్చడం ఇబ్బందిగా ఉంది. గతంలో నెలకో, రెండు నెలలకో ధరలు పెరిగేవి. అప్పుడు తాము కూడా ధరలు మార్చుకోవడానికి సులువుగా ఉండేది. ప్రస్తుత విధానం వల్ల తెల్లవారుజామున ఆరు గంటలకు వచ్చి మిషన్‌లో రేట్లను మార్చడానికి ఇబ్బందిపడుతున్నాం. దీని వలన రోజూ జరిగే పనులు కూడా జాప్యమవుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం కష్టమైనా తప్పడం లేదు.

- సీహెచ్. శ్రీనివాసరెడ్డి, బంకు యజమాని

కేంద్రం ప్రస్తుత పరిస్థితిని సమీక్షించాలి



పెట్రో ధరలు ఏ రోజుకు ఆ రోజు సమీక్ష జరపడాన్ని నిలిపివేయాలి. పాత పద్ధతినే కొనసాగించాలి. గతంలో ఒక రోజు రూ.200 పెట్రోల్ వేయిస్తే నాకు నాలుగైదు రోజులు వచ్చేది. ఇప్పుడు అంతే మొత్తంతో ఇప్పుడు వేయిస్తే ఎంత వేస్తున్నారో.. ఎన్నాళ్లు వస్తుందో తెలియని పరిస్థితి. కేంద్రం దీనిపై ఓ నిర్ణయం తీసుకోవాలి.

- జి.శివరామకృష్ణ, వినియోగదారుడు

గతంలో అర్ధరాత్రి.. ఇప్పుడు వేకువనే ధరల మార్పు



ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెట్రోల్, డీజిల్ ధరలు ఏ రోజుకు ఆరోజు మార్చడం ఇబ్బందిగా ఉంది. గతంలో ధరలు పెంచినపుడు అర్ధరాత్రి పన్నెండు గంటలకు మార్పులు చేసేవాళ్లం. ఇప్పుడు తెల్లవారుజామున ఆరు గంటలకే కంపెనీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ధరలు మారుస్తున్నాం. ఈ విధానం కంటే గతంలో మాదిరిగా ఏదో ఒక సమయంలో ధర పెంచితే బాగుంటుంది.

- ఆర్.వీర్రాజు, బంకు మేనేజర్

పెట్రోల్ ధరలు తగ్గించాలి



అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గుతున్నాయి. అయినా ప్రభుత్వాలు ధరలు తగ్గించకుండా రోజు పెంచుకుంటూ వస్తున్నాయి. గతంలో రెండు లేదా మూడు రూపాయలు ఒకసారే పెంచడం వలన అందుకు తగ్గట్టుగానే పెట్రోల్ పోయించుకునే వాళ్లం. దీనివలన ఎన్ని రోజులు పెట్రోల్ వస్తుందో అంచనా ఉండేది. ధరలు పెరుగుతూ రావడం వలన అంచనా తెలియడం లేదు.

- ఎ.రామారావు, వినియోగదారుడు

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి



కశింకోట రూరల్ : చింతలపాలెం మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పిల్లలకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్లు వేశారు. తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు ఈ వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయించాలని ఎఎన్ఎం ఎం.నాగలక్ష్మి తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్ కనకదుర్గ పాల్గొన్నారు.

నాట్లు సమయంలో రైతులు వరి ఆకు చిగుర్లు తుంచాలి

కొత్తూరు : నాట్లు వేసే సమయంలో రైతులు వరి ఆకు చిగుర్లను తుంచి నాటుకోవడం ద్వారా తెగుళ్లు, చీడపీడలను కొంతవరకు అదుపు చేయవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి సూచించారు. సీతానగరం, తగరంపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరినాట్లు సమయంలో తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.మహేశ్వరరావు, ఎంపీఈవోలు మాధవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

కశింకోట రూరల్ : మండలంలోని ఎన్‌జీపాలెం, వై.తుని గ్రామాల్లో మంగళవారం


సీతానగరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎ.హరికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలు రైతులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ముఖ్యంగా వరి నాట్లు వేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో, రైతులు పాల్గొన్నారు.

వైద్యాలయంలో ఆధునిక పరికరాలు ప్రారంభం

అనకాపల్లి టౌన్ : ఎన్టీఆర్ వైద్యాలయానికి కొనుగోలు చేసిన అధునాతన పరికరాలు మంగళవారం అందుబాటులోకి వచ్చాయి. ఫ్రీజర్ బాక్సులను వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ కేకేవీఏ నారాయణరావు ప్రారంభించారు. ఫిజియోథెరపీ పరికరాలు, ఈసీజీ మిషన్‌ను ఎమ్మెల్యే పీలా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏఆర్‌టీ సెంటర్‌ను ఆధునీకరించాలని జిల్లా ఆస్పత్రుల కో-ఆర్డినేటర్ నాయక్‌ను కోరారు. సూపరింటెండెంట్ ఎం.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కశింకోట రూరల్ : కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను, కొత్తగా పాఠశాలకు విచ్చేసిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎటు చూసినా... జలకళ!

- భారీ వర్షాలతో తీరిన నీటి సమస్య
- ఖరీఫ్ పంటలకు ఎంతో ఉపయుక్తం
- రైతులు, మన్యం వాసుల ఆనందం


పాడేరు-నక్కలపుట్టు మధ్యలో పంట పొలాల్లో చేరిన వరద నీరు


హుకుంపేట మండలం జాముగుడ సమీపంలోని పొలాల్లో చేరిన నీరు

పాడేరు: ఏజెన్సీలో భారీ వర్షాలకు ఎటు చూసినా జలకళ దర్శనమిస్తున్నది. అనేక ప్రాంతాల్లో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పట్టణానికి ఆనుకుని ఉన్న బుంగాగెడ్డ సోమవారం ఉధృతంగా పొంగడంతో పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో వంతెన నిర్మాణానికి రూపొందించిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. అలాగే బుంగాగెడ్డకు దిగువన్న ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు అధికంగా వచ్చి చేరింది. అలాగే పాడేరుకు సమీపంలోని కొత్తపాడేరు, లగిశపల్లి, గురుపల్లి, కాడెలి, నక్కలపుట్టు ప్రాంతాల్లోని వరి పొలాల్లోకి నీరు చేరింది. ఖరీఫ్ సీజన్‌లోని వేసిన వరి, రాగులు, వేరుశెనగ తదితర పంటలకు తాజా వర్షాల వల్ల మేలు జరుగుతుందని రైతులు, వ్యవసాయాధికారులు అభిప్రాయపడుతున్నారు. అన్ని కోణాల్లోనూ ఈ వర్షాలు ఉపయోగపడతాయని మన్యం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రవహిస్తున్న ఊటగెడ్డ


లగిశపల్లిలోని వరి పొలాల్లో ఉన్న వర్షం నీరు


గురుపల్లి ప్రాంతంలో వరద నీటితో ప్రవహిస్తున్న పంట కాలువ

నేడు పీఎంఆర్సీలో రక్తదాన శిబిరం

దాతలకు ప్రత్యేక బహుమతులు

పాడేరు రూరల్: పట్టణంలోని పీఎంఆర్సీ భవనంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు చైతన్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పెనుమాక రవికుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మన్యంలో రక్తహీనతతో పలువురు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో ఎక్కువగా గర్భిణులు ఉండడం విచారకరమని వాపోయారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతల మెరుగైన వైద్యసేవల కోసం విశాఖపట్నం వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఏరియా ఆస్పత్రిలో రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని యువతీ, యువకులు అధిక సఖ్యంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రక్తదానంలో పాల్గొన్న ముగ్గురు వ్యక్తులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా ఒక గ్రాము బంగారం, ద్వితీయ బహుమతి స్మార్ట్ ఫోన్, తృతీయ బహుమతి టేబుల్ ఫ్యాన్ అందిస్తామని రవికుమార్ తెలిపారు.

పొలాల్లో కలుపు నియంత్రించాలి

గూడెంకొత్తవీధి: వరి పొలాల్లో కలుపు నియంత్రించుకోవాలని వ్యవసాయ అధికారి వాసుదేవరావు సూచించారు. దేవరాపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి నాట్లు వేసుకున్న రైతులు 20-30 రోజులకు కలుపు తొలగించుకోవాలన్నారు. అలాగే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నారాయణరావు పాల్గొన్నారు.

సవర భాష గిడుగు రామ్మూర్తి పుణ్యమే

తెలుగు భాషా దినోత్సవంలో వక్తలు

పాడేరు రూరల్: గిరిపుత్రులకు సవర భాషను అందించిన ఘనత గిడుగు రామ్మూర్తిదేనని వక్తలు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వి.అప్పారావు, తెలుగు విభాగం అధ్యక్షుడు గోవిందరాజు మాట్లాడుతూ, గిరిజన ప్రజల కోసం ప్రత్యేకంగా సవర భాషను తయారు చేసిన ఘనత రామ్మూర్తి పంతులుకు దక్కుతుందన్నారు. సవర భాషను తయారుచేసి పరిశోధనా స్థాయి వరకు ఆయన తీసుకువెళ్లారన్నారు. వ్యవహారిక భాష స్థాయిలో డిగ్రీ పరీక్షలు రాసే విధానానికి నాంది పలికిన ఘనత కూడా ఆయనదేనన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.మురళీధర్, ఎ.రాజగోపాల్, ఎం.రమేష్, జి.గౌరీశంకరరావు, రాధాకుమారి, డి.సునీతదేవి, గురవయ్య, లక్ష్మణదాస్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఏపీఆర్ పాఠశాల ప్రధానాచార్యులు కేవీఎస్.శర్మను సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.

కొయ్యూరులో స్తంభించిన సెల్ సంకేతాలు

కొయ్యూరు: మండల కేంద్రంలోని సెల్ టవర్ నుంచి సంకేతాలు స్తంభించిపోయాయి. సాంకేతిక సమస్య ఏర్పడడంతో సిగ్నల్స్ రావడం, పోవడం కారణంగా వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యమైన సమాచారం చేరవేసే సమయంలో సిగ్నల్స్ లేక మాటలు అర్థంకాని పరిస్థితులు నెలకొంటున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ పరిస్థితులు నెలకొంటున్నాయా? లేక సంకేతాలు వెలువరించే విషయంలో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయా? అనేది వినియోగదారులకు అర్థం కాని పరిస్థితి. గడిచిన మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బీఎస్ఎన్ఎల్ అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

తాజంగి బాధితులకు పరిహారం చెల్లించాలి

చింతపల్లి: తాజంగిలో వ్యాధుల కారణంగా మరణించిన ఆదివాసీ కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజై డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది రోజుల వ్యవధిలో ఆరుగురు ఆదివాసీలు మరణించడం విచారకరమని వాపోయారు. ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమేనన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నేత చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

తాజంగిలో వ్యాధులతో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రామస్వామి, ఎంపీటీసీ సభ్యుడు కె.అంగధరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సర్వసభ్య సమావేశానికి హాజరైన సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడారు. గ్రామంలో రోగాలతో మరణించిన గిరిజనుల కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం వర్తింపజేయాలని కోరారు. పంచాయతీకి అధిక మొత్తంతో విద్యుత్ బిల్లు వస్తుందని, నిధులు వచ్చే పరిస్థితి లేనందున ఈ బిల్లు మొత్తం ఎలా చెల్లించగమని వారు ప్రశ్నించారు.



తెగుళ్లపై అప్రమత్తత అవసరం

వ్యవసాయాధికారి రమేష్

మాడుగుల రూరల్: తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి రమేష్ సూచించారు. మండలంలోని వమ్మలి, గాదిరాయి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆఖరి దమ్ములో యూరియా, సూపర్‌తో పాటు పొటాష్ వేసుకో వడం మంచిదన్నారు. దీనివల్ల కాండం గట్టిపడి చీడపీడలు తట్టుకోవడంతో పాటు వాలిపో కుండా రక్షణగా ఉంటుందని చెప్పారు. అలాగే నారుమడిలో నీటి నిల్వలు ఎక్కువగా లేకుండా చూసుకోవాలన్నారు. వరిలో ఆకుముడత పురుగు నివారణకు 2.5 మిల్లీలీటర్ల క్లోరోఫైరి పాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు. రాయితీలపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు తులసి, ప్రవీణ పాల్గొన్నారు.

'కేంద్ర నిధులు రాబట్టడంలో విఫలం'

దేవరాపల్లి: కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ఆరోపించారు. ఉపాధి పథకం బడ్జెట్‌లో రూ.6340 కోట్లు కేటాయించగా, రూ.1098 కోట్లు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఉపాధి పథకంలో పనులు చేసిన కూలీలకు తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు సిహెచ్.రాజు, కాటపల్లి అప్పారావు తదితరులు ఉన్నారు.

ఎరువుల ధరలను నియంత్రించాలి

కె.కోటపాడు: ఎరువులు, విత్తనాల ధరలను నియంత్రించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బన్న డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలకు నిరసనగా మంగళవారం కోటపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల ధరలు పెరగడానికి తోడు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు సంక్షోభంలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర కల్పిస్తూ చట్టం చేయాలని, పశువుల క్రయవిక్రయాలపై ఆంక్షలు రద్దు చేయాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దేముడు, నేతలు నాయుడుబాబు, పుష్పలత, గౌరీ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో స్వచ్ఛందంగా విద్యుత్ నిలిపివేత

దేవరాపల్లి: మండలంలో మంగళవారం స్వచ్ఛందంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. ధరణి రక్షిత రక్షితహః కార్యక్రమంలో భాగంగా రాత్రి 7 నుంచి 8 గంటల వరకూ సరఫరాను నిలిపేశారు. భూతాపాన్ని తగ్గించే సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి అందరూ సహకరించారని ఎంపీపీ కిలపర్తి భాస్కర రావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.ఈశ్వరరావు రాజరాజేశ్వరి మోటార్స్ ప్రతినిధులు రాకేష్, డివి.శంకర్, నరసింహమూర్తి, గోవింద్, సురేష్ పాల్గొన్నారు.

భూ యజమాని ఆగడాలతో అగచాట్లు


మోదమాంబ కాలనీ నివాసితుల వేదన

మాడుగుల: ఇళ్ల వెనుక భాగంలో భూ యజమాని గట్లు ఏర్పాటు చేయడం వల్ల ఆవాసాల మధ్యలోని నీరు వచ్చేస్తున్నదని, దీంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మోదమాంబ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ, గట్లు కారణంగా వర్షం నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితిలో నిల్వ ఉండిపోతుందని, దీంతో భరించలేని దుర్గంధం వెదజల్లి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోయారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని కాలనీకి చెందిన ద్రాక్షారపు మంగ, బోరా అచ్చియ్యమ్మ, పెదపూడి ఉమ, నాగేష్ ఆరోపించారు.

1న యోగా అండర్-14, 17 జట్ల ఎంపిక

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం గ్రామంలో వచ్చే నెల 1వ తేదీన యోగా అండర్-14, 17 బాల, బాలికల జట్ల ఎంపిక జరుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయుడు బోను వెంకటరావు తెలిపారు. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ఎంపిక కార్యక్రమం జపరుగుతుందని చెప్పారు. విద్యార్థుల వయస్సు, స్టడీ, అర్హత ఫారం తీసుకు రావాల న్నారు. మరిన్ని వివరాలకు 9603680020, 8919008628 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.









వానొచ్చె..వరదొచ్చె..!



చోడవరంలోని సింహాద్రిపురం వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు

- నియోజకవర్గంలో తగ్గుముఖం పట్టిన వర్షాలు
- నాలుగు రోజులగా పడిన వర్షాలతో పొలాల్లో భారీగా చేరిన నీరు
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- నిండుకుండలా చెరువులు

చోడవరం/బుచ్చెయ్యపేట/రావికమతం: నియోజకవర్గంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. చోడవరంలోని సింహాద్రిపురం, జుత్తాడ, పీఎస్‌పేట, లక్ష్మీపురం, నరసయ్యపేట గ్రామాల్లోని చెరకు తోటల్లోకి భారీగా నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పీఎస్‌పేటలో జూన్‌లో వేసిన వరి వర్షాలకు నీట మునిగింది. చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. లక్ష్మీపురం చెరువు నిండి అలుగు మీదుగాపారుతోంది. తామరచెరువులోనూ నీరు చేరింది.అలాగే పెద్దేరు నది ఉధృతంగా పారుతున్నది. నది నుంచి దిగువకు నీరు విడచిపెడుతుండడంతో ప్రవాహ బాగా పెరిగింది. మంగళవారం 23.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బొడ్డేరు గట్టుకి గండి

బుచ్చెయ్యపేటలోని బొడ్డేరు గట్టుకి భారీ గండి పడింది. గండి వెంబడి నీటి ప్రవాహం ఉధృతికి బొడ్డేటి కల్లాలకు వెళ్లే రహదారి కూడా కోతకు గురైంది. దీంతో రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. బొడ్డేరు ద్వారా ప్రవహించవలసిన నదీ ప్రవాహం గండి వల్ల పొలాల్లో నుంచి వెళ్తుండడంతో వరి, చెరకు పంటలు దెబ్బతిన్నాయి. పూడకపోయిన పల్లపువాని కాలువను అధికారులు పునరుద్ధరించకపోవడం వల్లే బొడ్డేరు గట్టుకి గండి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు.



తడిసిన వరి పనలను ఆరబెడుతున్న రైతులు



బొడ్డేరు గట్టుకి పడిన గండి

ముంపు వీడని వరి పొలాలు

రావికమతంలోని కొండగెడ్డల ఉధృతి తగ్గకపోవడంతో మంగళవారం నాటికి కూడా వరి, చెరకు పంటలను నీటి ముంపు వీడలేదు. ఇప్పటికే నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వందలాది ఎకరాల్లో వరి పూర్తిగా ముంపులో ఉంది. నాట్లు వేసి 25 రోజులు కూడా గడవక ముందే పంట పికల్లోతు నీటిలో ఉండడంతో మురిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొమిర, కరగాన గెడ్డ గండి పడి కారిపొలం అంతా ముంపునకు గురైంది. అలాగే మత్స్యపురం ఎర్రచెరువు నీటి ఉధృతికి ఆ చెరువు దిగువన ఉన్న పొలాలు నీట మునిగాయి. గదబపాలెం పెద్ద చెరువు గండి పడడంతో ఆ నీరంతా జి.చీడిపల్లి నల్ల చెరువులోకి వచ్చిపడడంతో ఆ చెరువు కింద ఉన్న వందలాది ఎకరాలు ఇసుక మేటలతో పాటు నీట మునిగి ఉన్నాయి.

యోగా పోటీలకు ముగ్గురి ఎంపిక

చోడవరం టౌన్ : మహారాష్ట్రలోని నాసిక్‌లో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో జరిగే జాతీయ యోగా పోటీలకు చోడవరం నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఇందులో 30-40 ఏళ్ల కేటగిరిలో చోడవరానికి చెందిన పుల్లేటి సతీష్, 16-21 ఏళ్ల కేటగిరిలో బోయిల కింతాడకు చెందిన బర్నికాన మోహన్ కుమార్, 6-10 ఏళ్ల కేటగిరిలో చౌడువాడ గ్రామానికి చెందిన పిల్లా నాగ పూర్ణిమ ఎంపిక య్యారు. ఈ మేరకు వారిని పలువురు అభినందించారు.

31న ఆర్మీ ర్యాలీ శిక్షణకు ఎంపికలు

బుచ్చెయ్యపేట : ఆర్మీ సెలక్షన్‌లో పాల్గొనే యువత ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఈనెల 31వ తేదీన అనకాపల్లి మున్సిపల్ స్టేడియంలో ఎంపికలు జరగనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణకు 600 మంది యువకులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు భౌతిక, రాత పరీక్షలకు సంబంధించి ఉచితంగా శిక్షణ ఇస్తారని చెప్పారు.

మొక్కలతోనే పర్యావరణకు రక్షణ

బుచ్చెయ్యపేట : మొక్కలతోనే పర్యావరణకు రక్షణ అని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన కోమళ్లపూడిలోని మూడు చెరువు గట్లతో పాటు ప్రభుత్వ బంజర్లు, గ్రామ కంఠం భూమిల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడ మొక్కలపై ఆధార పడి ఉందన్నారు. మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యతలు కూడా చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు గొన్నా హరికృష్ణ, ఎన్నెంశెట్టి అచ్చింనాయుడు, గొన్నా హరిబాబు, వరహాలు, గండెం నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో వసతి, సిబ్బంది కొరత

రావికమతం : ఆదర్శ పాఠశాలల్లో వసతి, ఉపాధ్యాయుల కొరత ఉందని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మరుపాక మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ కార్యాలయ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలో గజపతినగరం, భోగాపురం, డెంకాడ, వే ంపాడు, గర్భం పాఠశాలను ఇప్పటికే తనిఖీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం అర్ధాంతరంగా మోడల్ స్కూల్స్ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకోవడం వల్లే వసతి సమస్య తలెత్తిందని అభిప్రాయపడ్డారు. అలాగే కొన్నిచోట్ల బాలికల కోసం నిర్మించిన వసతి గృహాల నిర్మాణాలు పూర్తయినప్పటికీ వాటి నిర్వహణకు ఔట్ సోర్సింగ్ ద్వారా సిబ్బందిని నియమించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదని చెప్పారు. వసతి, సిబ్బంది సమస్యలు అధిగమిస్తే విద్యార్థులు మరింత పురోగతి సాధిస్తారని ప్రభుత్వానికి నివేదిక అందిస్తానన్నారు. ఆయనతో పాటు జిల్లా మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ రమాజ్యోతి, ఎంఈవో అప్పారావు, సీఆర్పీ రామారావు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్

నేత్రదానంపై అవగాహన

చోడవరం టౌన్ : నేత్ర దానం వల్ల వేరొకరి జీవితాల్లో వెలుగు నింపవచ్చునని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారిణి జోత్స్న అన్నారు. నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా కొత్తూరు జంక్షన్ సమీపంలోని బాలికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జోత్స్న మాట్లాడుతూ కళ్లు ప్రాధాన్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రాంతీయ నేత్ర వైద్య శాల హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి, పూర్ణిమా, ఉపాధ్యాయులు టి.వి.రమణ, బి.ఏ.రాజు, చోడవరం సీహెచ్‌సీ నేత్ర వైద్య సహాయకుడు సీహెచ్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గోవాడలో అన్న సమారాధన

చోడవరం రూరల్ : గోవాడ ఉన్నత పాఠశాల రోడ్డులో వినాయక ఉత్సవాల సందర్భంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. గోవాడ పవర్ యూత్ సభ్యుడు అప్పలస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గోవాడ షుగర్స్ ఎండీ విక్టర్‌రాజు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

బైక్ బోల్తాపడి వ్యక్తికి గాయాలు

చోడవరంటౌన్ : బెన్నవోలుకి చెందిన జామి వెంకటరమణ మంగళవారం సాయంత్రం చోడవరం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా బైక్ బోల్తా పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు ఆయన్ను ఆటోలో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఎన్‌టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత

చోడవరం రూరల్ : మండలంలో వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మంగళవారం సాయంత్రం పాము కాటుకు గురై అస్వస్థతకు గురయ్యారు. దామునాపల్లి గ్రామానికి చెందిన తలారి వెంకట అప్పారావు(32) పొలానికి వెళుతుండగా పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయన్ను చోడవరం సీహెచ్‌సీకి తరలించారు. అలాగే నర్సయ్యపేట గ్రామానికి చెందిన జనపరెడ్డి లక్ష్మణ మంగళవారం సాయత్రంం తన కల్లం నుంచి ఇంటికి వస్తుండగా పాము కాటు వేసింది. స్థానికులు హుటాహుటీన ఆయన్ను చోడవరం సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు ఆస్పత్రి వైద్యాధికారిణి జోత్స్న తెలిపారు.

నంద్యాల ఓటమి వైసీపీకి గుణపాఠం

ఏఎంసీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్

చోడవరం: నంద్యాల ఉప ఎన్నికలో ఓటమి వైసీపీకి గుణపాఠమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌మజ్జి గౌరీ శంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని నంద్యాల ఫలితం నిరూపించిందన్నారు. నంద్యాల మాదిరిగానే చోడవరంలోనూ టీడీపీకి సంపూర్ణ ఆధిక్యం లభిస్తుందని,నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్న ఎమ్మెల్యే రాజుకు ప్రజలు మరోసారి పట్టం కట్టడం తథ్యమని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు పెంచాలి : సీడీపీవో

నర్సీపట్నం టౌన్: సేంద్రియ ఎరువులతోనే అంగన్‌వాడీ కేంద్రాలలో ఆకుకూరలు, కాయగూరలు పెంచాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీకళ అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఇస్తున్న పౌష్టికాహారంతోపాటు సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరలు, కాయగూరల ఆహారం లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఇప్పటికే శివపురం, ఒ.ఎల్.పురం, చెట్టుపల్లి, తదితర ప్రాంతాలలో ఆకుకూరలను ఇదే పద్ధతిలో పెంచుతున్నారన్నారు. ప్రాజెక్ట్ స్థాయిలో 80 భవనాల్లో ఇప్పటివరకు 50 భవనాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ఈ సమావేశంలో ఏసీడీపీవో జీవీరమణి, సూపర్‌వైజర్‌లు విజయలక్ష్మి, జగదీశ్వరి, విజయ, చిన్నారి, సత్యవతి, పుష్పలత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఎం. శ్రీకళ

ఏబీవీపీ నూతన కార్యవర్గం



ఎన్నికైన ఏబీవీపీ నూతన కార్యవర్గం

నర్సీపట్నం టౌన్ :
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం వాసవీ కల్యాణ మండపంలో జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యకరణ్ చంద్ర మాలకొండయ్య నేతృత్వంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షునిగా అప్పారావు, కార్యదర్శిగా ప్రకాశ్‌రాజ్, సంయుక్త కార్యదర్శులుగా చిన్న, సాయిప్రసాద్, మహిళా కన్వీనర్‌గా నాగమల్లి, కో-కన్వీనర్‌గా లావణ్య, కళాశాలల ఇన్‌చార్జిలుగా జగదీష్, నాయుడు, ఉదయ్, నంద, నాని, ప్రసాద్, గోపాల్, మహేష్, వెంకటేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్ కన్వీనర్ కిరణ్, పట్టణ మాజీ కార్యదర్శి సాయి, జిల్లా కో-కన్వీనర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

నర్సీపట్నం రూరల్:
వరి తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వ్యవసాయాధికారిణి కె.ఝాన్సీలక్ష్మి అన్నారు. మంగళవారం చెట్టుపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరినాట్లు వేస్తున్న రైతుల వద్ద నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నాట్లకు ఇది అనుకూలమైన సమయమని, ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే తమను సంప్రదించాలన్నారు. వరి పంటకు వచ్చే తెగుళ్ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్ రవాణా కార్యాలయం ప్రారంభం

నర్సీపట్నం రూరల్:
స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ ఆర్టీసీ పార్శిల్ రవాణా కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 27 నుంచి ఆర్టీసీ సరుకు రవాణాను ప్రారంభించిందన్నారు. ఆర్టీసీ బస్సులలో కూరగాయలు, చిన్నచిన్న కవర్లతోపాటు వివిధ రకాల వస్తువులను రవాణా అవుతుందన్నారు. సుమారు ఒక టన్ను వరకు రవాణా చేస్తామన్నారు. త్వరలో కంప్యూటరైజ్డ్ చేస్తామని, దీనివల్ల సరుకులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు 7993355612 నంబర్‌ను కేటాయించామన్నారు. అలాగే డిపోకు ప్రస్తుతం అల్ట్రా డీలక్స్ బస్సులు వచ్చాయని, త్వరలోనే మరొక కొత్త బస్సు రానుందన్నారు. ఆర్టీసీ ద్వారా పార్శిల్ చేసే వస్తువులకు భద్రత, వేగం, ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాలకు చెందిన రేషన్‌షాపు డీలర్‌ల వద్ద సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకూ వనిత కార్డులు ఇస్తామన్నారు. దీనికి సంబంధించి వనితా కార్డులు కావలసిన వారు రేషన్ కార్డు జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వంద రూపాయలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎంఎన్‌ఎం రావు, పార్శిల్‌క్లర్క్ బీఎస్ వాసు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ రవాణా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ సూర్యపవన్‌కుమార్

అమలాపురం వైద్య శిబిరంలో 162 పశువులకు టీకాలు

నర్సీపట్నం రూరల్:
మండలంలోని అమలాపురంలో మంగళవారం 162 పశువులకు నోటిగోళ్ల టీకాలను వేశారు. వేములపూడి పశువైద్యాధికారి ఎల్.ప్రదీప్ ఆధ్వర్యంలో 40 ఆవులకు, 122 గేదెలకు నోటి గోళ్ల వ్యాధి రాకుండా టీకాలను వేశారు.

పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ గణేష్ నేతృత్వంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేములపూడి లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పి.అశోక్‌కుమార్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	:	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	:	9441953611
తహసీల్దార్ కార్యాలయం	:	9441836336
వెలుగు ఏపీఎం	:	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : వివేకం
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

మండల సమావేశం రసాభస

ఉపాధి పేమెంట్లలో జాప్యం,
అటవీ భూముల ఆక్రమణలపై
అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
ఎంపీడీవో జోక్యంతో సద్దుమణిగిన వాగ్వాదం



అటవీ భూముల ఆక్రమణపై సెక్షన్ ఆఫీసర్‌తో వాగ్వివాదం చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచ్

కోటవురట్ల: ఉపాధి హామీ పథకం కూలీలకు పేమెంట్లలో జాప్యం, అటవీ భూముల ఆక్రమణపై ప్రజాప్రతినిధుల నిలదీతల నడుమ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం రసాభసగా సాగింది. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అయ్యపురెడ్డి వరహాలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కె.వెంకటాపురం నుంచి తడపర్తి గిరిజన గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారని కె.వెంకటాపురం ఎంపీటీసీ సభ్యుడు పైలరమేష్ ప్రశ్నించారు. గతంలో రూ.18 లక్షలతో గ్రావెల్‌రోడ్డు వేసినపుడు అభ్యంతరం తెలపని అధికారులు ప్రస్తుతం ప్రభుత్వం రూ.2.75 కోట్లతో తారురోడ్డు నిర్మిస్తే అటవీభూమిలో నిర్మించవద్దని అభ్యంతరం తెలుపుతున్నారని సభలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రావెల్‌రోడ్డు వేసే సమయంలో తానులేనని ప్రస్తుతం తారురోడ్డు నిర్మాణానికి నిబంధనలు ఒప్పుకోవని ఆయన బదులిచ్చారు. అలాగే అటవీ భూములు వేలాది ఎకరాలను నిరుపేదలు ఆక్రమించుకుంటే సాగుదారుల్లో కొంతమంది వ్యక్తులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన అటవీ శాఖ అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. రమేష్‌కు మద్దతుగా సర్పంచ్ శ్రీనివాసరావు లేచి ఆటవీ అధికారుల తీరును తప్పుబట్టారు. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడం వల్లే కేసులు నమోదు చేస్తున్నామని సెక్షన్ ఆఫీసర్ కోటేశ్వరరావు వివరించారు. రమేష్ మాట్లాడుతూ మీరు కావాలనే కేసులు పెడుతున్నారని ఆరోపణలు చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు జోక్యం చేసుకొని ఇరు వర్గాలను సముదాయించారు. ఏపీవో నాగరాజు మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం, లేదా డబుల్ ఎంట్రీలు కావడం వల్ల ఆరువారాలుగా ఉపాధి కూలీలకు పేమెంట్లు కాలేదన్నారు. ఈవిషయమై ఎంపీటీసీ సభ్యుడు రమేష్ జోక్యం చేసుకొని మాట్లాడుతూ అకౌంట్స్‌కు ఆధార్ అనుసంధానం లేనివారు, బ్యాంకు అకౌంట్స్ లేని వారు ప్రస్తుతం ఎవరు లేరని ఏపీవో నాగరాజు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ విషయమై యండపల్లి సర్పంచ్ హైమవతి కలుగుచేసుకొని ప్రభుత్వం పేమెంట్లు ఎందుకు నిలిపివేస్తుందని రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. సభ ఉద్రిక్త పరిస్థితులకు దారి తీయడంతో ఎంపీడీవో సుబ్బలక్ష్మి జోక్యం చేసుకొని ఈవిషయాన్ని పీడీ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో వివాదం అదుపులోకి వచ్చింది. ఈ సమావేశంలో కె.వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏవో సోమశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ కమిటీల ఏర్పాటు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నక్కపల్లి:మండలంలో టీడీపీ బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కురందాసు నూకరాజు, మండల పరిషత్ చీఫ్ అడ్వయిజర్ కళ్లేపల్లి బాబ్జీరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. త్వరలో గ్రామ కమిటీలను నియమిస్తామన్నారు. ఇతర పార్టీల నుంచి తమ పార్టీలో చేరేందుకు పలువురు సిద్ధంగా వున్నారన్నారు. ఎమ్మెల్యే అనిత ఆధ్వర్యంలో అభివృద్ధి జరిగిందన్నారు. మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ,టీడీపీ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు,దేవవరపు శివ, నానేపల్లి రాఘవులు,వెదుళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బృందం వరి క్షేత్రాల పరిశీలన

ఎస్.రాయవరం(నక్కపల్లి): మండలంలోని గుర్రాజుపేట, పెదఉప్పలం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారుల బృందం వరి క్షేత్రాల పరిశీలన చేపట్టింది. వరి నాట్లు జరుగుతున్న పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.గుర్రాజుపేట సర్పంచ్ కురందాసు శ్రీనివాసరావు, ఏఈవో శ్రీనివాస్, నూకరాజు ఎంపీఈవో తేజప్రియ పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు తొలగింపు

ఎస్.రాయవరం(నక్కపల్లి):మండలంలోని చినగుమ్ములూరులో గింజాల రమణ ఇంటిపై మంగళవారం గానుగ చెట్టు కూలిపోయింది. దీంతో ఇంటి ముందు భాగం దెబ్బతింది. స్థానికులు కూలిపోయిన చెట్టును మంగళవారం సాయంత్రం తొలగించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



శ్రీప్రకాష్‌లో మాట్లాడుతున్న తెలుగు లెక్చరర్ రెడ్డి లక్ష్మణ



నక్కపల్లిలో ప్రసంగిస్తున్న డాక్టర్ వేదాల గాయత్రీదేవి

పాయకరావుపేట: గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జన్మదినం పురస్కరించుకుని మంగళవారం శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డి లక్ష్మణ. శ్రీప్రకాష్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం బి.సీతారాణి, వి.యం.ఎస్. రత్నం, జి.సత్యవర్ధిని, ఆఫీస్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: మండల కేంద్రంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు పండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి తెలుగుభాష ఔచిత్యంపై విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం పుష్యరాగం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు, నక్కపల్లి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ప్రత్యేకాధికారిణి విమలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవ సభలో ముఖ్యఅతిథిగా ఎంఈవో డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

తిమ్మాపురంలో..

ఎస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం కేజీబీవీ స్కూల్‌లో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేజీబీవీ స్కూల్ ప్రత్యేకాధికారిణి చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సెజ్ ఏర్పాటుతో ప్రజల జీవనం అస్తవ్యస్తమైంది. తాతల కాలం నుంచి జీవించిన ఊరు, ఇళ్లు అన్నీ వదులుకుని ప్రభుత్వం చూపించిన స్థలాల్లో జీవనం సాగిస్తున్న వారికి కనీస సౌకర్యాల కల్పనలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్య, వైద్యంలోనూ అదే వైఖరి కనబరుస్తున్నారు. పూడి నిర్వాసిత పిల్లల కోసం కోటి రూపాయలతో పాఠశాలను నిర్మించినప్పటికీ పోస్టులు భర్తీ చేయడం లేదు. దీంతో పిల్లలంతా ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయిస్తున్నారు. ఒకప్పుడు వంద మంది వరకు ఉండే పిల్లల సంఖ్య ఇప్పుడు 32 మందికి పడిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే వారు కూడా వచ్చే ఏడాదిలో ప్రైవేటు పాఠశాలల్లో చేరే అవకాశం ఉంది.


పూడి ప్రాథమిక పాఠశాల

ప్రాథమిక దశలోనే వదిలేశారు!

- వెదురువాడ ప్రాథమిక పాఠశాలలో సిబ్బంది కొరత
- 32 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయురాలు
- ఒకప్పుడు వంద మంది వరకు పిల్లలు
- సిబ్బంది లేక ప్రైవేటు స్కూళ్లలో చేరిక
- నిరుపయోగంగా తరగతి గదులు

అచ్యుతాపురం రూరల్ : రాంబిల్లి మండలంలోని పూడి నిర్వాసితులకు అచ్యుతాపురం మండలంలోని వెదురువాడలో 2015లో పునరావాసకాలనీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిర్వాసితుల పిల్లల కోసం కోటి రూపాయలతో పాఠశాలను నిర్మించారు. అక్కడ అన్ని సదుపాయాలు కల్పించిన ప్రభుత్వం సిబ్బంది నియామకాన్ని విస్మరించింది. దీంతో పిల్లల తల్లిదండ్రులు వారిని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. వాస్తవానికి పూడిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఇక్కడకు బదలాయించాల్సి ఉన్నా.. ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. దీంతో గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు చెల్లా చెదురైపోయారు. విద్యా శాఖాధికారులు పూడిలో పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులను కూడా డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలకు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. నిర్వాసితులు పట్టుబట్టడంతో ఈ ఏడాదికి ప్రతిష్టాత్మకంగా విశాలమైన పాఠశాలను నిర్మించారు. సుమారు కోటి రూపాయలతో నిర్మించిన ఈ పాఠశాలలో ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయురాలు పని చేస్తున్నారు. ఆఫీస్ రూమ్, ఐదు తరగతి గదులుండగా కేవలం ఒక గదిని మాత్రమే వినియోగిస్తున్నారు. విశాలమైన ఆటస్థలం, మరుగుదొడ్లు, పక్కనే అంగన్‌వాడీ కేంద్రం, చుట్టూ ప్రహారీతో అన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ విద్యాశాఖ అలసత్వం వల్ల సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో గతంలో ఇక్కడ వంద మందికిపైగా చదివే పిల్లలు ప్రస్తుతం 32 మందికి తగ్గిపోయారు. మరికొన్నాళ్లు ఇదే వైఖరి ఉంటే ఉన్న పిల్లలు కూడా వేరే పాఠశాలలకు వెళ్లిపోయే అవకాశం ఉంది. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు


పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

మరొకరిని వేయాలి



ఐదు క్లాసులు ఒకేచోట జరగడం వల్ల కొంచెం కష్టంగా ఉంది. మరో పోస్టు భర్తీ చేస్తే క్లాసులు విభజించే వీలుంటుంది. గుణాత్మక విద్య అందించాలంటే సహకార ఉపాధ్యాయుల అవసరం ఉంటుంది. వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల వైపునకు మళ్లించే ప్రయత్నం చేస్తాం.

మదీనా బేగం,
పాఠశాల ఉపాధ్యాయురాలు

వచ్చే ఏడాది భర్తీ చేస్తాం



సమయం సరిపోక కేవలం 32 మందితో ఈ ఏడాది పాఠశాలను ప్రారంభించాం. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయుల పోస్టులు ఉన్నాయి. గత కౌన్సిలింగ్‌లో రెండవ పోస్టు నింపాం. రిలీవర్ లేకపోవడం వల్ల నక్కపల్లి నుంచి ఉపాధ్యాయురాలు ఇక్కడకు రావడానికి ఆలస్యమవుతుంది. ప్రస్తుతానికి డిప్యుటేషన్‌పై వేరొక ఉపాధ్యాయుడిని వేశాం. వచ్చే ఏడాదికి పూర్తిస్థాయిలో భర్తీ చేస్తాం.

ఎంఈఓ, సూర్యారావు

కష్టపడి పాఠశాలను తీసుకువచ్చాం



కష్టపడి అధికారులు, ప్రజాప్రతినిధులపై వత్తిడి చేసి పక్కా స్కూల్ భవనాన్ని ఏర్పాటు చేశాం. గత ఏడాదిలో పాఠశాల లేకపోవడం వల్ల విద్యార్థులు చెల్లాచెదురైపోయారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటింటికి తిరిగి ఆ మాత్రం విద్యార్థులను స్కూల్‌లో చేర్పించాం. అధికారులు ముందు ఉపాధ్యాయులను నియమిస్తే వచ్చే ఏడాదికి మరింత మంది పిల్లలు చేరుతారు.

లాలం రమణ, సర్పంచ్, (పూడి)

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

అచ్యుతాపురం : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. వచ్చే నెల 1వ తేదీన విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పక్షాన జి. మధు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు చేసే వరకు ఫ్యాప్టో పోరాటానికి మద్దతు ఇస్తుందన్నారు. ఆయనతో పాటు కొల్లి రాజు, నూకరాజు, ప్రకాష్ ఉన్నారు.

చోడపల్లిలో వైద్య శిబిరం

అచ్యుతాపురం రూరల్ : చోడపల్లిలో మంగళవారం సిరి హెల్త్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో 1100 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం హెల్త్ డైరెక్టర్ అభిరాం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రక్త నమూనాలు సేకరించి, వారి బ్లడ్ గ్రూప్ వివరాలు సేకరిస్తామని చెప్పారు.

రాంబిల్లిలో వాహనాల తనిఖీ

రాంబిల్లి : నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కుమార్‌స్వామి హెచ్చరించారు. మంగళవారం ఆయన రాంబిల్లిలో పలు వాహననాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

రాంబిల్లి/అచ్యుతాపురం/రూరల్ : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని రాంబిల్లి ఏఓ గాయత్రి సూచించారు.మంగళవారం మూలజంప, గోకివాడ గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాట్లు వేసేటప్పుడు నారు చివర్లు త్రుంచి నాటడం వల్ల కాండం తొలుచుపురుగు ఉధృతి తగ్గించవచ్చునన్నారు. అనంతరం గోకివాడలో రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేగి ధనలక్ష్మి, ఎంఈఓవో ప్రసాద్, మోహన్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే అచ్యుతాపురంలోని ఆవసోమవరం, చీమలాపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏఓ రంగాచారి మాట్లాడుతూ వరునారు ఊడుపుల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తప్పనిసరిగా ఒక చదరపు మీటరుకు 66 కుదుర్లు ఉండేలా నాటు కోవాలన్నారు. ఒక్కొక్క కుదురుకు ఐదు, ఆరు మొనలు ఉండేలా చూసుకుని, దగ్గర దగ్గరగా నాటుకోవాలన్నారు. నారుమడుల నుంచి నారు సరిగా రాకపోతే ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు కె.బి.సూర్యనారాయణ,ఎంపీఈఓలు జగ్గారావు, రైతులు మామిడి శివ అప్పారావు, మాణిక్యం, పాల్గొన్నారు.


అచ్యుతాపురంలోని ఆవసోమవరంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి రంగాచారి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ప్రజలకు సురక్షిత నీరివ్వండి : ఎంపీపీ

అచ్యుతాపురం : గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రాంబిల్లి, అచ్యుతాపురం,మునగపాకమండలాల్లో ప్రపంచ బ్యాంక్ నిధులతో నిర్మించిన రక్షిత పథకాల పంచాయతీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిధులతో రాంబిల్లి మండలంలో 3, అచ్యుతాపురంలో 4, మునగపాకలో ఒక పథకం నిర్మించినట్టు తెలిపారు. వాటి నిర్వహణ పంచాయతీలే చేస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా ప్రస్తుత సీజన్‌లో ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అనంతరం ఆయన నీటిని శుద్ధి చేసే కిట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలోఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నాగేశ్వరరావు, ఎంపీడీఓ బలరాముడు, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక ఏఈలు శివకృష్ణ, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

- అనకాపల్లి, కశింకోట మండలాల్లో కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అవస్థలు పడిన పట్టణవాసులు
- పొంగిపొర్లుతున్న శారదా నది

అనకాపల్లి టౌన్/ కశింకోట రూరల్ : అనకాపల్లి, కశింకోట మండలాల్లో మంగళవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. సుమారు నాలుగు గంటల సమయంలో కుండపోతగా పడిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనకాపల్లి పట్టణంలోని కూరగాయలు, అరటి కొబ్బరికాయల మార్కెట్‌లకు వచ్చే రైతులు, చిల్లర వర్తకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాలాజీరావుపేటలోని పెంకుటిల్లు కూలింది. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల వరకు అనకాపల్లిలో 65.0 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. అధికారులు మోటారు ఇంజన్ ద్వారా నీటిని మళ్లించే పనిలో నిమగ్నమయ్యారు. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి, గవరపాలెంలోని పార్కు సెంటర్, శ్రీరామనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపిస్తోంది. అయితే ఈ వర్షాలు అన్నదాతల్లో ఆనందం నింపాయి. కశింకోట మండలంలో మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని గ్రామాల్లో రోడ్లపై నుంచి నీరు పారింది. పొలాలు చెరువును తలపించాయి. పంట కాలువలు, గెడ్డలు, నీటితో కళకళలాడుతున్నాయి.


అనకాపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచిన నీరు


కశింకోటలోని ఓ పాఠశాలను ముంచెత్తిన నీరు


బాలాజీరావుపేటలో కూలిన పెంకుటిల్లు

'శారదా' పరవళ్లు

పట్టణంలోని శారదానది పరవళ్లు తొక్కుతుంది. వారం రోజులుగా ఏజెన్సీతో పాటు చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలకళ సంతరించుకుంది. గతంలో మెట్లతో పాటు చాలా వరకు నది ప్రాంతం ఎండిపోయి కనిపించినా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

బవులవాడలో కాలుష్యంపై త్వరలో గ్రామ సభ

- ఆర్డీవో సూర్యకళ వెల్లడి
- సమస్యలపై ఏకరవు పెట్టిన గ్రామస్థులు
- క్వారీ, క్రషర్లను గనులు, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులతో కలిసి పరిశీలన

కొత్తూరు : బవులవాడ కాలుష్య సమస్య పరిష్కారానికి త్వరలో గ్రామంలో సభ నిర్వహిస్తామని ఆర్డీవో సూర్యకళ తెలిపారు. బవులవాడ రెవెన్యూ పరిధిలోని క్వారీ, క్రషర్లను గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బవులవాడ గ్రామం చుట్టూ క్వారీలు, క్రషర్లు విస్తరించి ఉండడం వలన గ్రామం కాలుష్యమయమైందని గ్రామస్థులు, గ్రామ కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. రవి కృష్ణ క్రషర్స్, వాణి, వర్మ, ఎంఎస్ రెడ్డి, సుధాకర్, నర్సయ్య క్రషర్లను పరిశీలించి నిబంధనల మేరకు క్రషింగ్ జరుగుతున్నదీ లేనిదీ విచారించామన్నారు. అనంతరం వాణి క్రషర్స్‌కు తొమ్మిది ఎకరాల స్థలం క్రషింగ్ ఏరియా కాగా, పక్కనే గల చెరువును కూడా ఆక్రమించారన్న అనుమానంతో వెంటనే చెరువును సర్వే చేయాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. గనుల శాఖ ఏడీ సూర్యచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మల్లికార్జునరావు, ఆర్ఐ బుచ్చిబాబు, క్వారీ, క్రషర్ల యాజమానులు, సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎ.బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


బవులవాడలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యకళ

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే పీలా

నెహ్రూచౌక్ : గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు కేఎన్‌వీ సత్యనారాయణ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ గురించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు శివరామకృష్ణ, జి.హేమకుమారిలు తెలుగుభాష, వ్యవహారిక భాషల అభివృద్ధికి గిడుగు చేసిన కృషిని తెలిపారు. టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, ఆడారి జగన్నాథరావు, మళ్ల శ్రీరాములు, పాఠశాల సిబ్బంది, స్టాఫ్ సెక్రటరీ కాండ్రేగుల జనార్ధన్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొణతాల రాము పాల్గొన్నారు.

డాక్టర్ హిమశేఖర్‌లో...

అనకాపల్లి టౌన్ : దాసరిగెడ్డ రోడ్డులోని డాక్టర్ హిమశేఖర్ స్కూల్‌లో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ కె.జనార్ధన్ మాట్లాడుతూ తెలుగుభాషా ఉద్యమానికి గిడుగు రామమ్మూర్తి స్ఫూర్తి ప్రధాతగా పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పి.సురేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. తెలుగుభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజా రాజకీయవేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం మెయిన్ రోడ్డులోని వన్ వే ట్రాఫిక్ జంక్షన్ వద్ద గల తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు కూడా నిర్వహించారు. అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ఆళ్ల నాగేశ్వరరావు, కోరుబిల్లి శంకరరావు, వేగి త్రినాథ్, మళ్ల రామచంద్రరావు, నాగేశ్వరరావు, శ్రీనుబాబు, కిశోర్, రమేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


గవరపాలెం హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా

తాళ్లపాలెంలో వేడుక



కశింకోట రూరల్ : తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్‌లో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ బి.రామకుమార్, హెచ్‌ఎం వై.నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హీరో నాగార్జున జన్మదిన వేడుకలు


సబ్ జైలులో కేకు కట్ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్ : ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన అభిమానులు పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. అక్కినేని అభిమాన సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో సబ్ జైలులో సూపరింటెండెంట్ నారాయణతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం సబ్‌జైలు ఆవరణలో మొక్కలు నాటారు. అభిమానులు మద్దాల వీరునాయుడు, అవ్వా, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీలో విజయంపై ఆప్ సంబరాలు

అనకాపల్లి : ఢిల్లీలోని భావన నియోజకవర్గంలో అమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు ఇక్కడ మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. నెహ్రూచౌక్ జంక్షన్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఆప్ రాష్ట్ర కోశాధికారి సినిశెట్టి గుప్తా, అనకాపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, ఎండీ అబ్దుల్ రెహ్మాన్, మావూరి రవికుమార్, బలిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కొత్తూరు : విశాఖలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో అనకాపల్లికి చెందిన వై.ఎన్.భద్రంను జిల్లా ఉపాధ్యక్షుడిగా, కోన లక్ష్మణ్‌ను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.